VISALAANDHRA, VIJAYAWADA -4 Phone 376 • • • Regd No H 203

విశాలాంధ్ర

సంపుటి 14 సంచిక 296] విజయవాడ • 12-1-1965 మంగళవారం [6 పేజీలు 8 పై.

విశాలాంధ్ర
చందా వివరాలు

	ఏజెంటు ద్వారా	పోస్టు ద్వారా
సంవత్సరం	రు 31 00	రు 34 00
ఆరు మాసాలు	15 50	17 00
మూడు మాసాలు	7 75	8 50
ఒక మాసం	2 65	2 90

ఆంధ్ర శాసనసభ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల నిర్ణయం

దుర్గాపూర్ జనవరి 11

ఆంధ్రప్రదేశ్ శాసనసభకు జరుగనున్న ఉపఎన్నికలలో పోటీ చేసే కాంగ్రెస్ అభ్యర్థుల పేర్లను కాంగ్రెస్ కేంద్ర పార్లమెంటరీబోర్డు ఆమోదించింది అమలాపురం నియోజకవర్గంనుండి శ్రీ నడింపల్లి రామభద్రరాజా డోన్ నియోజకవర్గంనుండి శ్రీ రాంభూపాల్ రెడ్డి పోటీచేస్తారు

స్టాన్లీవిల్లీలో వారం రోజులలో ఐదు వందల మంది ఉరితీత

బెల్జియన్, షోంబే కిరాయి మూకల ఘాతుక చర్య

న్యూయార్క్ టైమ్స్ వెల్లడి

న్యూయార్క్, జనవరి 10

స్టాన్లీవిల్లీలో బెల్జియం పారాట్రూపర్ల సాయంతో షోంబే ప్రభుత్వ సైన్యాలు ప్రవేశించిన దరిమిలా తిరుగుబాటుదారులని అనుమానించబడిన 500 మందిని ఎలాంటి విచారణలేకుండా ఉరితీశారని "న్యూయార్క్ టైమ్స్" నేడు వ్రాసింది

స్టాన్లీవిల్లీ నుండి యీ పత్రిక విలేకరి యీ సమాచారాన్ని 8 వ తేదీన పంపాడు

ఈ వ్యవహారము బయటి ప్రపంచానికి తెలియకుండా చాలా కట్టుదిట్టం చేశారు. కొద్ది రోజులుగా పత్రికల వారెవర్నీ ఆ నగరం పొలిమేరల్లోకి కూడా రానివ్వలేదు అయితే ప్రత్యక్షంగా ఈ దురంతాన్ని కండ్లారా చూచి వచ్చినవారే మాకు యీ సమాచారం తెలియజేశారు

"ఈ హత్యల్లో ఎక్కువభాగం బెల్జియం శ్వేత కిరాయి సైన్యాలు ఆ నగరంలో ప్రవేశించిన నవంబర్ 24 వ తేదీ అనంతరం వారం రోజుల్లోనే జరిగాయి

"డిసెంబర్ మాసం మధ్యనుండి ఈ హత్యాకాండ ఉధృతం కొంతతగ్గినట్లు కన్పిస్తున్నది. ఈ దరిమిలా అనుమానితులైన వ్యక్తుల్ని ఓ 50 మందిని కాల్చివేసివుంటారు " అని ఆ విలేకరి రాశాడు

షోంబే సైనిక మూకకు బెల్జియమ్ శిక్షణ

కిటోనా జనవరి 9

కిటోనా సైనిక స్థావరంలో 64 గురు బెల్జియమ్ సైనికాధికారులు షోంబే సైనిక మూకకు శిక్షణ గరపుతున్నారు. ఈ శిక్షణ పది నెలలపాటు కొనసాగుతుందట.

స్వతంత్ర కాంగోకు సూడాన్ సాయం

కైరో జనవరి 10

సూడాన్ ప్రధాని సిర్ ఎల్ ఖతిమ్ ఎల్ ఖలీఫా నేడు కైరోలో రేడియో విలేకరితో ప్రసంగిస్తూ అరబ్ ఆఫ్రికను, ఆసియను దేశాలతో సహకరించే విధానాన్ని తమ దేశం అనుసరిస్తుందన్నారు సామ్రాజ్యవాద వ్యతిరేకత తటస్థ విధానం తామనుసరిస్తామన్నారు

కాంగో విషయమై తమ దృక్పథాన్ని తెలుపుతూ ఖలీఫా తాము స్వతంత్ర ప్రజలెక్కుతున్నా - ముఖ్యంగా అరబ్బు ఆఫ్రికను ప్రజలకు తోడ్పడతామన్నారు

కాంగోకు తాము సాయపడుతూనే వున్నామనీ దానిని ఇకముందు ఇంకాహెచ్చిస్తామనీ కాంగోకు వెళ్ళే సహాయాన్ని తమ దేశంగుండా పోనిస్తున్నామనీ ఆయన అన్నారు.

ఇండొనీషియాకు 18 సోవియట్ యుద్ధనౌకలు

న్యూయార్క్ జనవరి 10

మలేషియాలో బ్రిటిష్ సైన్యాల కేంద్రీకరణ ఎక్కువ కావటం ప్రారంభం అయినతర్వాత గత రెండు రోజులలో 18 సోవియట్ యుద్ధ నౌకలు సూయజ్ కాల్వగుండా ఇండొనీషియా తీరానికి బయలుదేరి వెళ్ళినట్టు బరాస అనధికార వర్గాలవారి ద్వారా నేడిక్కడ తెలియవచ్చింది

వీటిలో రెండు క్రూయిసర్ నౌకలు కొన్ని డిస్ట్రాయర్లు జలాంతరాములుకూడా ఉన్నట్లు సూయజ్ కాల్వసర్వేక్షణాధికారులు అన్నట్లు ఈ వర్గాలు తెలుపుతున్నాయి

సూయజ్ సంక్షోభ సమయంలో ఈజిప్టుకు రష్యా యిచ్చిన నౌకలకంటే కూడా యివి అధునాతన మయినవని ఈజిప్టు ఉన్నతాధికారవరాలు భావిస్తున్నట్లు వీరు పేర్కొంటున్నారు.

బరాస నుండి ఉపసంహరణ నిర్ణయాన్ని సుకర్నో ప్రభుత్వం పునరాలోచించకపోయినా మలేషియామీద మాత్రం దాడిచేయదని వీరన్నారు.

మలయా తీరంలో మరో 11 పడవలు

సింగపూర్ జనవరి 10

మలయా నైరుతి తీరంలో ఈ రోజు 11 చిన్న పడవలను కనుగొన్నట్లు, అందులో బహుశా ఇండొనీషియన్లు వచ్చి ఉండవచ్చునని అనుమానించుతున్నట్లు వేరొకచోట వార్త చేరింది.

ఈ పడవలలో ఒక్కొక్క దానిలో 8 మంది ఉండటానికి వీలున్నది. మొన్న శుక్రవారం ఇండొనీషియన్లు దిగినచోటే ఇవీ వున్నాయి.

జాతిభవిష్యత్తుదృష్ట్యా సింహళ ఎన్నికల ప్రాధాన్యత

సిరిమావో రేడియో ప్రసంగం

కొలంబో జనవరి 10

త్వరలో జరగనున్న సింహళ జనరల్ ఎన్నికలు యావత్తు సింహళ జాతి భవితవ్యానికి సంబంధించిన ప్రధాన ఘటన అని అందువల్ల ప్రజలు ప్రశాంతచిత్తంతో ఒడుదుడుకులకు లోనుకాని వైఖరిని అవలంబించాలని సింహళ ప్రధాని శ్రీమతి సిరిమావో దేశప్రజల నుద్దేశించి చేసిన రేడియో ప్రసంగంలో కోరారు

అభ్యర్థుల నామినేషన్లను దాఖలు చేసే సందర్భంలో ఆమెచేసిన రేడియోప్రసంగంలో, సింహళ స్వాతంత్ర్యానంతరపు చరిత్రను రెండు దశలుగా విభజించ వచ్చునని అన్నారు

మొదటి దశ 1948 56 మధ్యకాలమనీ, ఇది సింహళ చరిత్రలో పెట్టుబడిదారీ దశ అని సిరిమావో అన్నారు. 1948-56 మధ్య సింహళదేశం బ్రిటిష్ సింహాసనానికి రాజకీయంగా బద్ధంబడిలేకపోయినా ఆర్థికంగా బ్రిటన్ ఆర్థిక వ్యవస్థ పరాధీనమైనదిగా వుండని తెలిపారు

1956 - 1964 రెండవ దశ అనీ, ఈ కాలంలో సోషలిజానికి, బ్రిటిష్ పార్లమెంటరీ పద్ధతిలోనే మధ్యేమార్గాన్ని అనుసరించటం జరిగిందని అన్నారు.

ఇప్పుడు ఈ రెండు మార్గాలలో ఏది ఉత్తమ మార్గమో దేశ ప్రజలు నిర్ణయించుకొని ఓటు చేయాలని అన్నారు.

ప్రజాస్వామిక ప్రభుత్వం అనేది బుద్ధుని బోధలకు అనుగుణమయినదని చెప్పారు మన ప్రస్తుత ప్రజాస్వామిక వ్యవస్థలో కొన్ని లోపాలుంచే వాటిని క్రమంగా సవరించడానికి మనం ప్రయత్నించాలని అన్నారు.

వైద్య ఉద్యోగుల కోర్కెల సాధనకు ఈ నెల 8 వ తేదీనుండి నిరాహారదీక్ష జరుపుతున్న గుంటూరు బ్రాంచి మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్ష ఉపాధ్యక్షులు శ్రీయుతులు జొన్నలగడ్డ జోషి, బెన్నీ

కాంగ్రెసుకు అండగా కాథలిక్ చర్చి

త్రివేంద్రం, జనవరి 9

కొట్టాయం విషప్పు భవనంలో జరిగిన కేరళలోని కాథలిక్ చర్చి బిషప్పులంతా సమావేశమై మధ్యంతర ఎన్నికలలో కాంగ్రెసును బలపరచ నిశ్చయించినట్లు విశ్వసనీయంగా తెలుస్తూంది.

ఆ సభకు బిషప్పులేగాక ప్రసిద్ధులయిన కొందరు కాంగ్రెసు కాథలిక్ నాయకులు కూడా హాజరయ్యారని తెలుస్తూంది.

కేంద్ర మంత్రి శ్రీ పి. ఎమ్ థామస్ ఇటీవల కేరళకు వచ్చి వెళ్ళేక బిషప్పులలో ఈ మార్పు వచ్చిందనీ, కాంగ్రెస్‌ను బలపరచకపోతే తమ మతానికే ప్రమాదం రాగలదని అయన వారికి నచ్చచెప్పాడనీ, ఇటీవల ప్రపంచ క్రైస్తవ మహాసభకు వచ్చిన పోప్ కూడా అటువంటి సలహాయే ఇచ్చారనీ తెలుస్తూంది

గుంటూరులో ప్రభుత్వ వైద్య ఉద్యోగులసమ్మె

యూనియన్ నాయకుల నిరాహారదీక్ష: వివిధ కార్మిక సంఘాల అండదండలు

గుంటూరు జనవరి 11

దీర్ఘకాలంగా గుంటూరు పట్టణంలోని ప్రభుత్వ వైద్య సంస్థలలోని పనివారలు తమ కోర్కెలను ప్రభుత్వ దృష్టికి తీసికొనివచ్చి పరిష్కారాన్ని కోరినప్పటికీ ప్రభుత్వం పెడచెవిని పెట్టటంతో జనవరి 8 నుండి పట్టణ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు నిరాహారవ్రతం ప్రారంభించారు

గతరాత్రినుండి వైద్య ఉద్యోగులందరు సమ్మె ప్రారంభించటంతో ఆందోళన తీవ్రస్థాయికి అందుకుంది పట్టణంలోని వివిధ కార్మిక సంఘాలు వైద్య ఉద్యోగుల కోర్కెలను బలపరుస్తూ ప్రకటనలు చేస్తున్నారు

గుంటూరు పట్టణంలోని ప్రభుత్వ వైద్య సంస్థలలోని (జనరల్ ఆస్పత్రి వైద్య కళాశాల) పనివారలు తమ కోర్కెల సాధనకై దీర్ఘకాలంగా ఆందోళన జరుపుతున్నప్పటికీ మూగనోము పట్టిన వైద్య శాఖాధికారుల ప్రభుత్వాధికారుల వైఖరికి నిరసనగా పనివారల కోర్కెల సాధనకు గుంటూరు మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు, శ్రీ జొన్నలగడ్డ జోషి ఉపాధ్యక్షులు శ్రీ బెన్నిగారలు జనవరి 8 నుండి నిరాహార దీక్ష కొనసాగిస్తున్నారు

యూనియన్ నాయకులు నిరాహార దీక్ష ప్రారంభించిన తర్వాత కూడా పనివారల కోర్కెలను సానుభూతితో పరిశీలించి, పరిష్కరించేందుకు ప్రభుత్వాధికారులు వైద్య శాఖాధికారులు సుముఖత ప్రదర్శించకపోవటంతో గతరాత్రి 12 గంటల నుండి ప్రభుత్వ వైద్యసంస్థలలోని పని వారలంతా దాదాపు 270 మంది సమ్మెను ప్రారంభించారు

తమ కోర్కెలు సాధించబడే వరకు ఆందోళనా కార్యక్రమాన్ని కొనసాగించాలనే పట్టుదల పనివారలలో ద్యోతక మౌతున్నది.

1961 లోనే ప్రభుత్వం పనివారలకు యూనిఫారంలను సప్లయి చేయాలని ఆదేశించినప్పటికీ ఏవో సాకులు చెప్పి ఈ నిర్ణయాన్ని స్థానికాధికారులు అమలు జరపటం లేదనీ కనుక ఈ నిర్ణయాన్ని వెంటనేఅమలుజరపాలని మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ నిరాహార దీక్ష సమ్మెలను ప్రారంభించిన సందర్భంలో వెలువరించిన కరపత్రంలో పేర్కొనబడింది

61 నుండి మెడికల్ డైరెక్టరు ఆఫీసులో పడివున్న అప్పీళ్ళను పరిశీలించి సత్వరం పరిష్కారం చేయాలని, యూనియన్ కార్యదర్శిపై కక్షతో తీసుకొన్న చర్యలను రద్దుచేస్తూ ఆయనకు నష్టంవాటిల్లకుండా చూడాలని విచారణ లేకుండా ఉద్యోగుల వద్ద కత్తిరించిన డబ్బును వాపస్ చేయాలని, అర్హతగల ఉద్యోగు లందరి సర్వీసులను రెగ్యులరైజ్ చేసి పర్మినెంటు చేయాలని పనివారలు కోరుతున్నారు

మెడికల్ కాలేజీలోని స్వీవర్లకు, నిర్దయి చి వారికి రావలసిన బాకాయీలను చెల్లించాలని, కార్మికులకు క్వార్టర్సును నిర్మించాలని గుర్ఖా వాచ్‌మన్‌లను రెగ్యులర్ సర్వీసు వర్కర్సుగా గుర్తించాలని, కార్మికులకు టిఫిన్లకు క్యాంటీన్ ఏర్పాటు చేయాలని గుర్తించబడిన ఈ కార్మిక సంఘానికి ట్రేడ్ యూనియన్ చట్టంక్రింద అన్ని సౌకర్యాలను కల్గజేయాలని కూడా పనివారలు కోరుతున్నారు

పట్టణ కార్మికుల పరామర్శ

వైద్య ఉద్యోగుల కోర్కెల సాధనకు నిరాహారదీక్ష ప్రారంభించిన యూనియన్ నాయకులు శ్రీ జోషి బెన్నిగార్లను పట్టణ కార్మికులు కార్మిక నాయకులు ఊరేగింపులతో వచ్చి పరామర్శించి వెళ్తున్నారు

పట్టణంలోని ముఠా కార్మికులు లాగుడు బండ్ల ముఠాకార్మికులు రైస్ డిపోల కార్మికులు వైద్యఉద్యోగుల కోర్కెలను బలపరుస్తూ నినాదాలిస్తూ శ్రీయుతులు బోయపాటి వీరయ్య జి వి. కృష్ణారావుగార్ల నాయకత్వాన ఊరేగింపుగావచ్చి నిరాహారవ్రతం సాగిస్తున్న మెడికల్ ఎంప్లాయీస్‌యూనియన్‌నాయకులను పరామర్శించారు తాలూకా కమ్యూనిస్టు నాయకులు పట్టణంలోని వివిధ కార్మిక సంఘాల కార్యకర్తలు వచ్చి నిరాహారదీక్షను బలపరుస్తూ యూనియన్‌నాయకులను పరామర్శించి వెళ్తున్నారు. రోజూ వందలాదిప్రజలు గుంపులు గుంపులుగా వచ్చి యూనియన్ నాయకులను పరామర్శించి, వైద్యపనివారల కోర్కెలను బలపరుస్తూ,తమసంఘీభావాన్ని ప్రకటిస్తున్నారు

హేమలతా టెక్స్‌టైల్ వర్కర్సు యూనియన్ కార్యదర్శి విజ్ఞప్తి

గుంటూరు వైద్య ఉద్యోగుల కోర్కెలను బలపరుస్తూ ప్రజోపయోగార్థం ప్రజల అవసరాన్ని దృష్టిలోవుంచుకొని ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని పనివారల సమస్యల పరిష్కారానికి పూనుకోవాలని కోరుతూ పెదకాకానిలోని హేమలతా టెక్స్‌టైల్ వర్కర్సు యూనియన్ కార్యదర్శి శ్రీ వి గంగాధరరావు ప్రకటన కావించారు

యూనియన్ నాయకులు పనివారలు, నిరాహార దీక్షకు సమ్మెకు పూనుకోవలసిన పరిస్థితిని కల్పించినందుకు ప్రభుత్వాధికారులు వైద్యశాఖాధికారుల వైఖరిని ఆయన తీవ్రంగా

(మిగతా 6 వ పేజీలో)

విజయవాడ స్టేషన్‌లో శ్రీ రాజేశ్వరరావు గారికి ఘనస్వాగతం

విజయవాడ జనవరి 10

భారత కమ్యూనిస్టుపార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీ చండ్ర రాజేశ్వరరావుగారికి నేడు విజయవాడ రైల్వే స్టేషన్‌లో పట్టణ కమ్యూనిస్టు సమితి, తదితర ప్రజా సంస్థల తరపున ఘనస్వాగత మిచ్చారు

శ్రీ రాజేశ్వరరావుగారు పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన పిమ్మట, విజయవాడకు రావటం ఇదే ప్రథమం ఆయన త్రిచూర్‌లో కేరళ రాష్ట్ర కమ్యూనిస్టు సమితి సమావేశంలో పాల్గొని "హౌరా ఎక్స్‌ప్రెస్ లోనే ఇక్కడకు వచ్చారు.

సాయంత్రం ఆరున్నరకు విజయవాడ స్టేషన్ చేరవలసిన "హౌరా ఎక్స్‌ప్రెస్" నాలుగు గంటలు ఆలస్యంగా రాత్రి 10-30 కు వచ్చింది. రైలు ఆలస్యంగా వచ్చినా భారత కమ్యూనిస్టుపార్టీ ప్రధాన కార్యదర్శికి స్వాగత మివ్వడానికి వచ్చిన వందలాది ప్రజలు వేచివున్నారు. రైలుస్టేషన్‌లోకి చేరగానే వందలాది గొంతుకలు ఒక్కపెట్టున భారత కమ్యూనిస్టు పార్టీ జిందాబాద్ "కామ్రేడ్ రాజేశ్వరరావు జిందాబాద్" "కామ్రేడ్ డాంగే జిందాబాద్" అని నినదించటంతో స్టేషన్ మార్మోగి పోయింది.

శ్రీ రాజేశ్వరరావుగారికి స్వాగత మివ్వడానికి స్టేషన్‌కు వెళ్ళినవారిలో పట్టణ కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ టి వెంకటేశ్వరరావు కాసనసత్యులు శ్రీ వెల్లంకి విశ్వేశ్వరరావు. పట్టణ కమ్యూనిస్టు పార్టీ నాయకులు దలసాని వెంకటరత్నం వెల్లంకి సుబ్బారావు. బెల్లపు శ్రీరాములు ఎన్ వెంకటేశ్వరరావు ఏమెంటు హోటల్ ఆర్ టి సి రిక్షా కార్మిక సంఘాల నాయకులు. విశాలాంధ్ర సంపాదక వర్గ సభ్యులూ ఉద్యోగులూ వివిధ పేటలకు చెందిన ప్రముఖ కార్యకర్తలు కానూరు పంచాయతీ అధ్యక్షులు శ్రీ వెంకటేశ్వరరావు శ్రీ కోనేరు వెంకటదలపతిరావు మున్నగు ప్రముఖులు కలరు

వివిధ ప్రజా సంఘాల తరపున, పట్టణ కమ్యూనిస్టు సమితి తరపున అనేక మంది ప్రముఖులు శ్రీ రాజేశ్వరరావుగారికి పూలమాలలు వేశారు

అనంతరంఆయననుఊరేగింపుతో గవర్నరుపేటలోని పట్టణకమ్యూనిస్టుసమితి కార్యాలయానికితీసుకొచ్చారు ఊరేగింపుపొడుగునావేడుకగా ఆపుట్లు పేల్చారు పట్టణసమితి కార్యాలయం ముందు శ్రీ రాజేశ్వరరావుగారు తనకు స్వాగతమిచ్చిన ప్రజలకు అభివందన తెలుపుతూ కొద్దిసేపు ప్రసంగించారు.

చరిత్రాత్మకమైన భారత కమ్యూనిస్టుపార్టీ సప్తమ మహాసభ అతిముఖ్యమైన నిర్ణయాలు చేసినదనీ ఆనిర్ణయాలను అమలు జరపడ వల్ల ఆశేయమైన ప్రజోద్యమాలను నిర్మించవచ్చునని 'భారత్ బంద్'కు ఇప్పటినుండి సన్నాహాలు చేయాలని కూడా మహాసభ నిర్ణయించినదని శ్రీ రాజేశ్వరరావు గారు తమ ప్రసంగంలో పేర్కొన్నారు.

భారత కమ్యూనిస్టుపార్టీ ప్రధాన కార్యదర్శి కార్యక్రమం

హైదరాబాద్ జనవరి 11

భారత కమ్యూనిస్టుపార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీ చండ్ర రాజేశ్వరరావుగారి కార్యక్రమం ఈ నెల 18 వ తేదీ వరకు ఈ క్రింది విధంగా వుంటుంది :

11 12 తేదీలలో విజయవాడలో వుండి, 13 వ తేదీన హైదరాబాద్ వెళతారు అక్కడ 15 వ తేదీవరకు వుంటారు 16 విజయవాడకు తిరిగివచ్చి 17 వ తేదీన పట్టణ కమ్యూనిస్టు సమితి సర్వసభ్య సమావేశంలో బొంబాయి కమ్యూనిస్టుపార్టీ మహాసభ నిర్ణయాలను వివరిస్తారు అదేరోజు సాయంత్రం గాంధీనగరంలో జరిగే బహిరంగసభలో ప్రసంగిస్తారు 18 వ తేదీన మెయిల్‌లో మద్రాసుకు బయలుదేరి వెడతారు

చైనాకు బ్రిటన్ ఓడల అమ్మకం మహోపసందైన ఆలోచన అని బ్రిటన్ మంత్రి

హాంగ్‌కాంగ్, జనవరి 11

చైనాకు బ్రిటన్ ఓడల అమ్మకం మహోపసందైన ఆలోచన అని బ్రిటిష్ మంత్రి రేమాన్ బ్రిటన్ వాణిజ్యబోర్డు సమావేశంలో నిన్న ఇక్కడ చెప్పారు

బ్రిటిష్ నౌకా పరిశ్రమ కొత్త మార్కెట్టులను సంపాదించుకుంటున్నదని చైనాకు రెండు ఓడలను నిర్మించి పెట్టడం మంచి లాభసాటి బేరమని ఆయన అన్నారు

తాము చైనాతో యిలాంటి వ్యాపారఒప్పందాలను వ్యాప్తిచేస్తున్నట్లు ఆయన చెప్పారు

చైనా-బ్రిటన్ వాణిజ్య పెంపుదల బ్రిటన్ విదేశాంగ విధాన సూత్రాలను ఉల్లంఘించదని కమ్యూనిజాన్ని నిరోధించాలన్న దాని లక్ష్యాలను తగ్గించదనీ ఆయన అన్నారు

జపాను నౌకా పరిశ్రమాధిపతులతోను అధికార్లతోను నౌకా నిర్మాణ పరిశ్రమ సమస్యలను గురించి చర్చించడానికి ఆయన జపాన్ వెళ్ళారు.

పోటీపార్టీపై నేరాలు ప్రభుత్వం రుజువు చేయాలి

అలాచేస్తే తామూపార్టీనుంచివైదొలగుతామని శ్రీ నంబూద్రిపాద్ సవాలు

త్రిచూర్ జనవరి 10

పోటీ కమ్యూనిస్టు పార్టీ దేశద్రోహకర చర్యలలో పాల్గొంటున్నదని భారత ప్రభుత్వం నిరూపించ గలిగినట్లయితే తాము ఆ పార్టీని విడిచివేస్తానని పోటీ కమ్యూనిస్టు పార్టీ నాయకులు శ్రీ ఇ ఎం ఎస్ నంబూద్రిపాద్ సవాలు చేశారు

తనకు గనుక అవకాశం ఇస్తే తమపార్టీ మీద చేసిన ఆరోపణలు నిజంకాదని నిరూపించగలనని ఆయన చెప్పారు

త్రిచూర్ జిల్లాలో తమ పార్టీ ఎన్నికల ప్రదర్శనను ఆరంభిస్తూ శ్రీ నంబూద్రిపాద్ ఇల్లా అన్నారు

"మన పార్టీమీదచేసిన ఆరోపణలు వట్టి అబద్ధాలపుట్ట ఎన్నికల సమయంలో కేరళ ప్రజలను గందరగోళంలో పెట్టేటందుకే అవి కల్పించారు

దేశంలో సాయుధ విప్లవం ప్రారంభించాలని కలకత్తా మహాసభ ఆదేశించిందన్న ఆరోపణ వట్టి అసత్యం నిజానికి అమృతసర్ తీర్మానాన్ని పునరుద్ఘాటించడం తప్ప కలకత్తా మహాసభ అదనం ఏమీ చెయ్యలేదు దేశంలో సోషలిజాన్ని శాంతియుత ప్రజాతంత్రయుత పార్లమెంటరీ పద్ధతులపై స్థాపించబడ వచ్చునని దానిలో చెప్పింది.

తమ పార్టీని నిషేధి దశమూ అరెస్టయిన నాయకులను ఎన్నికలలో పోటీ చేయకుండా నిషేధించడమూ రాజ్యాంగ చట్ట విరుద్ధ చర్యలని శ్రీ నంబూద్రిపాద్ అన్నారు.

కేరళ ఎన్నికలను గురించి మాట్లాడుతూ కాంగ్రెసుతో పోరాడేందుకు అతివాదులంతా ఐక్యసంఘటనగా ఏర్పడే ఆశ స్వల్పంగా వుండక పోలే దన్నారు అయితే వియోజక వర్గాల కేటాయింపువంటి పెద్ద ఆటంకాలనింకా అధిగమించవలసేవున్నాదన్నారు. ఆయాపార్టీల సత్యత్వాన్ని బటి స్థానాల కేటాయింపు జరగవచ్చునసీ ఇంకే వేవో చిన్న చిన్న సర్దుబాట్లు చేసుకోవడం కాదనీ అన్నారు

అధికార కమ్యూనిస్టులు గొంతెమ్మ కోరికలు కోరుతున్నారనీ ఆ పద్ధతిలో వరితో సర్దుబాటు సాధ్యం కాక పోవచ్చునని ఆయన అన్నారు

తమ పార్టీవారిని అరెస్టు చేయడం తప్పని కమ్యూనిస్టులు కూడా చెప్పుతున్నారు. గనక వారిప్పుడు కాంగ్రెసు యెడ తమ దృక్పథాన్ని పునరాలోచించు కోవలసిన సమయం వచ్చిందనీ ఆయనఅన్నారు పార్టీలో చీలిక రావడానికి ప్రధాన కారణం కాంగ్రెసు యెడ అనుసరించవలసిన విధానం మీదనే గదా అని ఆయన అన్నారు

అరెస్టయినవారి కుటుంబాలకు భృతి

కేరళ గవర్నరుకు శ్రీ నంబూద్రిపాద్ లేఖ

త్రిచూర్ జనవరి 10

దేశరక్షణ నిబంధనల క్రింద అరెస్టుచేసి జైళ్ళలో నిర్బంధించిన కమ్యూనిస్టు నాయకుల కుటుంబాలకు జీవన భృతిల నివ్వాలని పోటీ కమ్యూనిస్టుపార్టీ నాయకులు శ్రీ ఇ ఎం. ఎస్ నంబూద్రిపాద్ కేరళ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు

గత రో డిశెంబ్యాల కుటుంబాలకు అలవెన్సుల నిచ్చేవారని వివరిస్తూ అరెస్టయిన

(మిగతా 6 వ పేజీలో)

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు 3 వ వేతనాలబోర్డునియమించాలి

పోస్టు - టెలిగ్రాఫ్ ఉద్యోగుల సమాఖ్య కార్యదర్శి శ్రీ ఆంజనేయులు డిమాండ్

600 మంది ప్రతినిధులతో 8 వ సంయుక్త మహాసభ ప్రారంభం

ఇండోర్, జనవరి 10

కేంద్ర ప్రభుత్వోద్యోగుల వేతనాల పునరవ్యవస్థీకరణకు మూడవ వేతనాల కమిషన్‌ను వెంటనే నియమించాలని పోస్టు టెలిగ్రాఫ్ ఉద్యోగుల జాతీయ సమాఖ్య ప్రధాన కార్యదర్శి శ్రీ అంజనేయులు టెలిగ్రాఫ్ ఇంజనీరింగ్ ఎంప్లాయీస్ యూనియన్ లైన్‌స్టాఫ్, 4వ తరగతి ఉద్యోగులు, అఖిభారత టెలిగ్రాఫ్ ఎంప్లాయీస్ యూనియన్‌ల 8వ సంయుక్త మహాసభలో డిమాండ్ చేసారు

జీవనవ్యయ సూచీలో పెరిగిన ప్రతి పాయింటుకు అనుగుణంగా కరువు భత్యాన్ని పెంచాలని ఆయన కోరారు

మహాసభను కేంద్ర కమ్యూనికేషన్ శాఖ మంత్రి శ్రీ సత్యనారాయణసిన్హా ప్రారంభించారు

ఇటీవల పెంచిన కరువుభత్యం విషయంలో పోస్టు, టెలిగ్రాఫ్ ఉద్యోగులు చాలా ఆశాభంగం పొందారనీ అసంతృప్తి చెందారనీ అంజనేయులు అన్నారు

రోజు రోజుకూ పెరిగే ధరలవల్ల తమ నిజవేతనాలు విపరీతంగా తరిగిపోతూవుంచే ఉద్యోగులు చూస్తూ కూర్చోరని హెచ్చరించారు

ప్రభుత్వం వెంటనే విట్లీ కౌన్సిళ్ళను ఏర్పరచాలని ఎజ్ఞప్తిచేశారు. ప్రభుత్వ వాగ్దానాలు హామీల మీద ఉద్యోగుల నమ్మకం క్రమంగా సడలి పోతున్నదని అన్నారు.

ఈ మహాసభకు దేశం నలుమూలల నుండి సుమారు 600 పోస్టు టెలిగ్రాఫ్‌ల ఉద్యోగుల ప్రతినిధులు ఇతర కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల ప్రతినిధులు హాజరవుతున్నారు.

ఇండోర్ మేయరు మహాసభ ఆహ్వాన సంఘం అధ్యక్షులు శ్రీ భన్‌వార్‌సింగ్ బహాదర్ ప్రతినిధులకు స్వాగతం చెబుతూ తమ రాష్ట్రంలోని భోపాల్ గ్వాలియర్ జబల్‌పూర్ ఇండోర్ పట్టణాలు గ్రేడ్‌లను పెంచాలని కోరారు

మహాసభకు ముందు పట్టణంలో పోస్టు టెలిగ్రాఫ్ ఉద్యోగులు తమకోర్కెలను ప్రభుత్వం అంగీకరించాలని కోరుతూ బ్రహ్మాండమయిన ప్రదర్శన జరిపారు

మంత్రి ఓదార్పు

భారత దేశం అనేక చిక్కులు ఎదుర్కొంటున్నదనీ, వనరులు చూసే అల్పంగా వున్న దృష్ట్యా సంధిదశలో ఇబ్బందులు తప్పవని మంత్రి అన్నారు ట్రేడ్‌యూనియన్‌ల్లు దేశాభివృద్ధికి కృషిచేయాలని కోరారు.

ఆహార సమస్యా పరిష్కారానికిప్రభుత్వం అనేక చర్యలు తీసుకున్నదన్నారు దేశానికి బయటనుండి లోపలనుండి ఉన్న ప్రమాదాలను ప్రజలు గుర్తించాలని కోరారు.

పరిపాలనలో ఉద్యోగులకు ఇతోధిక స్థానం ఇవ్వడానికి ఒక పథకాన్ని రూపొందించే విషయమై ప్రభుత్వం ఆలోచించుతున్నదని

(మిగతా 2 వ పేజీలో)

విశాలాంధ్ర
సంక్రాంతి ప్రత్యేక సంచిక
జనవరి 14, 1965

సంక్రాంతి సందర్భంగా 14-1-65 న "విశాలాంధ్ర" ప్రత్యేక సంచికగా ఆకర్షణీయంగా వెలువడుతుంది వ్యాపార ప్రకటనలకు యీ సంచిక ఎంతో ఉపయోగపడుతుంది. వ్యాపారస్థులు రోగకవలెనే మమ్ము ప్రోత్సహిస్తారని నమ్ముతున్నాం. పాఠకులు, ఏజెంట్లు తమతమ కాపీలు రిజర్వు చేసుకోవలసి

— మేనేజరు 'విశాలాంధ్ర'

విశాలాంధ్ర

ప్రభుత్వ విదేశాంగ విధానంలో బలహీనతలు

అంతర్జాతీయ పరిస్థితులపై దుర్గాపూర్ కాంగ్రెస్ మహాసభ ఆమోదించిన తీర్మానంలోనూ ఆ తీర్మానంపై వివిధ స్థాయిలలో జరిగిన చర్చలలోనూ అణ్వాస్త్రాలపట్ల భారత దేశ విధాన మే-టనే సమస్య ప్రాధాన్యం వహించడం సహజమే. అణుశక్తిని శాంతి ప్రయోజనాలకే వినియోగించాలని గుంటూరులో ఎ ఐ సి సి తీర్మానించినప్పటికి భారతదేశం అణ్వాయుధాల ఉత్పత్తికి పూనుకోవాలనే వారూ భారత దేశం అమెరికా బ్రిటన్ల అణ్వాయుధచ్ఛత్రం క్రిందికి చేరాలనేవారూ పట్టుబట్టినందువల్ల ఈ సమస్యను దుర్గాపూర్ మహాసభ తిరిగి చర్చించవలసి వచ్చింది.

అంతేకాదు ఈచర్చలు బహిరంగంగా జరగాలనిమూడ కాంగ్రెస్ కార్యవర్గం మొదట్లో నిర్ణయించింది. ఎన్నో అపోహలకు దారితీసే ఇటువంటి రహస్య సమావేశం జరగకపోవడమూ, మహాసభ గత విధానాన్నే పునరుద్ఘాటించడమూ ముదావహం.

అయితే తీర్మానంపై ప్రసంగించిన ప్రధాని శాస్త్రి 'ప్రస్తుతానికి ఇదే మా విధానం, ముందేం జరుగుతుందో చెప్పలేను' అని ప్రకటించడం భారత దేశానికి స్వంత అణ్వాయుధాలుండాలనే వారిని కొంత సంతృప్తిపరచడానికా అనే సందేహం సహజంగానే కలుగుతుంది.

ఈ వివరణను పురస్కరించుకొని వీరు, ఏదో ఒక సాకుతో, మాటిమాటికి విధానాన్ని మార్చాలని ఒత్తిడి ప్రారంభించవచ్చు. అందువల్లనే భవిష్యత్తుకు ఒక విధానాన్ని మనం నిర్ణయించలేమనే శ్రీ శాస్త్రి వాదనను శ్రీ కృష్ణమీనన్ సవాలు చేశారు. ప్రస్తుత పరిస్థితులను దృష్టితో ఉంచుకోవడమేకాక భావి పరిణామాలెలా వుంటాయనే ఒక స్పష్టమైన అవగాహనతో ప్రభుత్వం తన విధానాన్ని రూపొందించుకోవాలన్నారు.

తమ దేశరక్షణకై హామీ ఇవ్వవలసిందిగా అణ్వస్త్ర రాజ్యాలకు భారతదేశం విజ్ఞప్తి చేయాలనే సూచనను కూడా శ్రీ కృష్ణమీనన్ ఖండించడం సముచితమేకాక అవసరంకూడా. ఎందుకంటే, బ్రిటిష్ అమెరికా దేశాల అణ్వస్త్ర రక్షణకై అర్రులుచాచే వచ్చి అభివృద్ధి నిరోధకులు కాంగ్రెస్పార్టీలోను ప్రభుత్వంలోనూ, ప్రముఖ స్థానాలలో వుండటమేకాక, అమెరికా, బ్రిటన్, సోవియట్ దేశాలు సమిష్టిగా భారతదేశానికి ఇలాంటి హామీ ఇవ్వాలని ప్రధాని శాస్త్రి కూడా బ్రిటిష్ ప్రధాన మంత్రికి సూచించినట్లు వార్తలు వచ్చాయి. ఈ వార్తలను శ్రీ శాస్త్రి విదేశాంగమంత్రి శ్రీ స్వరణ్ సింగ్ ఖండించడంవల్ల కొంత సందేహ నివృత్తి కలిగినా, భారతదేశాన్ని తమ అణ్వచ్ఛత్రం క్రిందికి తెచ్చుకోవడానికి సామ్రాజ్యవాదులు చేస్తున్న ప్రయత్నాలనూ, దేశం అప్రమత్తతతో ఎదుర్కోకపోతే వీటివల్ల మనకేర్పడే ప్రమాదాన్ని తక్కువ అంచనా వేయరాదు.

కామన్వెల్తు పత్రికా విలేకరుల సంఘ వార్షికోత్సవ సందర్భంలో విల్సన్ చైనా అణ్వస్త్ర పరీక్షనుగురించి ప్రస్తావిస్తూ 'ఆసియాలోని అణ్వస్త్ర రహిత దేశాలకు 'నిజమైన హామీ ఇవ్వటం అసలు సమస్య. ఈ విషయమై బ్రిటన్ తన సహచర దేశాలతో చర్చలు ప్రారంభించింది' అని వెల్లడించారు. పైగా, ఇది కామన్వెల్తు దేశాలు తక్షణమే చర్చించవలసిన అత్యంత ప్రధానమైన సమస్య అని కూడా అన్నారు.

కామన్వెల్తు దేశాలకు లండన్లో శాశ్వత సెక్రటేరియట్ను స్థాపించడానికి భారత ప్రభుత్వం అంగీకరించిన దృష్ట్యా, కామన్వెల్తు దేశాలరాజకీయ, రక్షణ విధానాలను సమన్వయం చేసేబాధ్యతను ఈసంస్థకు అప్పగించాలనే ప్రచారంకూడసాగుతున్నదృష్ట్యా విల్సన్ ప్రకటనలను ఉపేక్షించడానికి వీలులేదు. ఏనాడు భారతదేశం విదేశాల అణ్వస్త్ర రక్షణను స్వీకరిస్తుందో ఆనాడు మన అలీన విధానానికే కాదు, మన స్వాతంత్ర్యానికి స్వస్తి పలకటం జరిగినట్లే. అందువల్ల ఈ విషయమై భారతదేశం నిర్ద్వంద్వమైన వైఖరి అవలంబించాలి.

ఈ విధానంపై జరిగిన వాదోపవాదాలలో అంతర్జాతీయ రంగంలోని కొన్ని తీవ్ర పరిణామాలు కాంగ్రెస్ మహాసభ ప్రతినిధుల దృష్టికి రాకపోవడం శోచనీయం. విదేశాంగ మంత్రి శ్రీ స్వరణ్ సింగ్ ఈ లోపాన్ని ప్రస్తావించి, స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్న వలస దేశ ప్రజలపట్ల భారత ప్రజల సంఘీభావాన్ని పునరుద్ఘాటించడం ప్రత్యేకించి మొజాంబిక్, దక్షిణరొడీషియా ప్రజల స్వాతంత్ర్య పోరాటాలను సమర్థించటం హర్షణీయం.

అయితే, ఎక్కడైతే అమెరికా బ్రిటిష్ సామ్రాజ్యవాద సైన్యాలు విముక్తి పోరాటాలను అణచడానికి పూనుకున్నాయో అక్కడి సమస్యలను శ్రీ స్వరణ్ సింగ్ అస్పష్ట పదజాలంతో దాటవేయడం సముచితంకాదు.

నేడు ఆగ్నేయాసియాలో అమెరికా బ్రిటిష్ సైన్యాల ప్రత్యక్ష జోక్యంవల్ల రోజు రోజుకు ఉద్రిక్తత పెరుగుతున్నది. కమ్యూనిజాన్ని అరికడుతున్నామనే పేరుతో ఇండో-చైనాలో అమెరికా ముష్కర సైన్యాలు వందలాది దేశభక్తులను పొట్టబెట్టుకుంటున్నాయి. ఆగ్నేయాసియాలో తన దోపిడీని కొనసాగించడానికై బ్రిటన్ సృష్టించిన మలేషియాకు రక్షణ యిచ్చే సాకుతో బ్రిటిష్ సైన్యాలు యుద్ధనౌకలు విమానాలు పెద్దఎత్తున ఆగ్నేయాసియాలో మోహరింపబడివున్నాయి.

హిందూ మహాసముద్రం తమ క్రీడాసరోవరమైనట్లు అమెరికా బ్రిటిష్ నౌకాదళాలు వ్యవహరిస్తున్నాయి. ఎవరికి వ్యతిరేకంగా ఎవరి రక్షణకు ఇవి ఇక్కడ తిష్టవేసినట్లు?

ప్రపంచగతిని అడ్డుకొని బడుగు దేశాలపై ఏదో ఒకరూపంలో తమ ఆధిపత్యం పునస్థాపించుకోవడానికి తమ దోపిడీని కొనసాగించడానికి సామ్రాజ్యవాద దేశాలు ముఖ్యంగా అమెరికా బ్రిటిష్ పాలకవర్గాలు చేస్తున్న ప్రయత్నాలలో ఇది ఒక భాగమనే విషయం భారత ప్రభుత్వం గుర్తించకపోతే వీటిని తీవ్రంగా ఖండించ నిరాకరిస్తే, అది మన అలీన విధానాన్ని నీరస పరచడమే అవుతుంది.

స్వరణ్ సింగ్ ప్రసంగంలో ఈ బలహీనత మరొకసారి ద్యోతకం అయింది. ఈ వైఖరి మారకపోతే మన అలీనతకు శోభ చేకూరదు. ఆసియా ఆఫ్రికా రాజ్యాలలో మన సంఘీభావం, గౌరవప్రతిష్ఠలు ఇనుమడించవు.

చల్లపల్లి ఏరియా చెరుకు రైతులకు హెచ్చరిక

మోపిదేవి, జనవరి 10

దివి తాలూకా చెరుకు ఉత్పత్తిదారుల సంఘం కన్వీనర్ శ్రీ కంఠంనేని అమ్మతరామయ్య ఇలా వ్రాస్తున్నారు:

చల్లపల్లి సుగర్సు లిమిటెడ్ ఫ్యాక్టరీ ఏరియాలో ఫ్యాక్టరీకి 1965-66 (వచ్చేసంవత్సరానికి) సీజనుకు చెరుకు సప్లయి చేయదలచిన రైతులు ఫ్యాక్టరీకి అపర్లు ఎగ్రిమెంటు వెంటనే ఇవ్వవలయును. ఆలస్యం చేసినయెడల పాత గ్రోయర్సుకూడా సకాలములో ఆఫీసు ఎగ్రిమెంటు ఇవ్వలేదనే సాకుచూపి ఫ్యాక్టరీ మానేజిమెంటు తమ కిష్టంలేని రైతులను నిరాకరించే ప్రమాదం వున్నది. కనుక తక్షణం సంతకాలు ఫ్యాక్టరీ ఆఫీసుకు అపరు ఎగ్రిమెంట్లురిజిష్టరు పోస్టుచేయవలెను. సదరు విషయన్ని పుత్తరంద్వారా సుగర్ కేన్ ఇన్స్పెక్టరు పుయ్యూరు, వారికికూడ తెలియపరచవలెను. అపరు ఎగ్రిమెంటు పారములు ఫ్యాక్టరీ ఆఫీసులోగాని చల్లపల్లిలోని అసిస్టెంట్ సుగర్ కేన్ ఇన్స్పెక్టరువారి ఆఫీసులోగాని దొరుకుతాయి. వివరములు తెలుసుకొనుగోరు వారు నన్ను మోపిదేవిలో కల్సుకొనవచ్చును.

ఇప్పటివరకు కీడింగు తీసుకొని రిజిష్టరు కేన్ గ్రోయర్సు ఒకవేళ కీడింగుతీసినారా లేదని దాటవేస్తున్న సందర్భంలో (ఫ్యాక్టరీ మానేజిమెంటు యిష్టంలేని వారికి నెం 997 రకపు చెరుకు ఇంతవరకు కటింగు పర్మిషన్ ఇవ్వటంలేదనే నెం 627రు చెరుకు మొక్క తోటలు కూడా తమ అనుకూలురని నటిస్తున్నారు) తమ సర్వే నంబరు భూమి విస్తీర్ణం పేరకపు చెరకుపైరు వేసిన తేదీ తమ కోటా పరిమితి వగైరా వివరాలతో సుగర్ కేన్ ఇన్స్పెక్టర్, పుయ్యూరు డైరెక్టర్ ఆఫ్ ఎగ్రికల్చర్ - ఆంధ్రప్రదేశ్ హైద్రాబాద్ వారికి అర్జీలు పెట్టి దాటినకట ఫ్యాక్టరీ మానేజిమెంటు వారికి కూడా పంపవలయును అప్పు అప్లికేషన్ పారములు కావలసినవారు నా వద్దనుండి పొందవచ్చును.

అలెప్పీ మున్సిపాలిటీలో పోటీపార్టీ అనుచిత ప్రవర్తన

['విశాలాంధ్ర విలేకరి]

అలెప్పీ జనవరి 10

అలెప్పీ మున్సిపల్ కౌన్సిల్లోని అయిదుగురు పోటీకమ్యూనిస్టుపార్టీ సభ్యులు కాంగ్రెస్ ముస్లింలీగ్ సభ్యులతో కలిసి ప్రస్తుత కార్మిక నాయకుడు లోగడ కమ్యూనిస్టు మంత్రివర్గంలోని కార్మిక మంత్రి అయిన శ్రీ టి వి థామస్ను మున్సిపల్ అధ్యక్షపదవినుంచి తొలగించాలని ప్రయత్నించారు.

కమ్యూనిస్టుపార్టీయే తమ ప్రథమ శత్రువు అంటూ పోటీపార్టీ నాయకులు శ్రీ సుందరయ్య ప్రకటించిన విధానానికి అనుగుణంగా అలెప్పీ మున్సిపాలిటీలోని పోటీపార్టీ సభ్యులు మున్సిపల్ అధ్యక్ష పదవి నుంచి కమ్యూనిస్టుని తొలగించడంకోసం కాంగ్రెసు ముస్లింలీగ్లతో కలిసి అవిశ్వాస తీర్మానపై సంతకాలు చేశారు. అయితే ప్రజలు గట్టిగా మందలించడంతో పోటీపార్టీ కాస్తవెనకడుగు వేయక తప్పిందికాదు. పోటీ కమ్యూనిస్టుపార్టీ సభ్యులు ఐదుగురిలో ముగ్గురు మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి హాజరై తాము యిచ్చిన అవిశ్వాస తీర్మానానికి వ్యతిరేకంగా తామే ఓటు చేశారు. మిగతా ఇద్దరు పోటీపార్టీ సభ్యులు గైరుహాజరయ్యారు. తాము హాజరైతే శ్రీ టి వి థామస్పై అవిశ్వాస తీర్మానం ఒకటి రెండు ఓట్ల మెజారిటీతో నెగ్గగలదని ఆశించారు కాని ఒక్కఓటు మెజారిటీతో ఆ తీర్మానం వీగిపోయింది.

దేశరక్షణ చట్టాన్ని రద్దుచేయాలి

విజయవాడ పట్టణ కమ్యూనిస్టుసమితి నిర్ణయాలు

విజయవాడ జనవరి 10

నేటి ఉదయం పట్టణ కమ్యూనిస్టు సమితి కార్యాలయంలో శ్రీ కొండే రామచంద్రరావుగారి అధ్యక్షతన జరిగిన విజయవాడ పట్టణ కమ్యూనిస్టు సమితి దేశవ్యాపితంగా పోటీకమ్యూనిస్టు నాయకులను అరెస్టుచేసిన ప్రభుత్వ నిరంకుశ చర్యను ఖండించుచు తీర్మానించింది. దేశరక్షణ చట్టాన్ని ప్రజాస్వామిక ఉద్యమాలను, ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమాలను అణచటానికి ప్రభుత్వం దేశరక్షణ చట్టాన్ని దుర్వినియోగం చేయటం సహించరాని విషయమని అందుచేత దేశరక్షణ చట్టాన్ని రద్దుచేసి అరెస్టు చేసిన నాయకులందరిని తక్షణం విడుదల చేయాలని తీర్మానించారు.

పట్టణసమితి కార్యదర్శి శ్రీ టి వెంకటేశ్వరరావు బొంబాయిలో జరిగిన పార్టీమహాసభ నిర్ణయాలను, సాధించినవిజయాలను క్లుప్తంగా వివరించారు.

1965 సంవత్సరానికి పార్టీని కట్టుదిట్టంగా శక్తివంతంగా పనిచేయుటకున్ను గృహదహనాల కేసుల వ్యయం, కేరళలో జరుగు ఎన్నికల సహాయం చేయటానికి - కొన్ని పాత బాకీలు తీర్చటానికి మొత్తం రు.15 000 లు కావలసి వుంటుందని ఆ మొత్తాన్ని పట్టణ వ్యాపితంగా సభ్యులు సానుభూతిపరుల కార్మికులనుండి వసూలు చేయాలని ఏకగ్రీవంగా నిర్ణయించబడింది. పార్టీశాఖలు అన్నీ కదలి - 15 రోజులు యిదే కార్యక్రమంగా తీసుకొని శక్తికొలది విరాళాలు వసూలు చేయాలని సమితి ఆదేశించింది.

త్వరలో పట్టణ పార్టీ సభ్యులు, సానుభూతిపరుల సర్వసభ్య సమావేశంవేసి, పార్టీ మహాసభ రిపోర్టులు యివ్వాలని నిశ్చయించబడింది.

కేరళ రాష్ట్రీ యస్. యస్. పి. లో చీలికలు

తిరువనంతపురం, జనవరి 11

కేరళ శాసనసభ ఎన్నికలలో అనుసరించవలసిన విధానం విషయంలో రాష్ట్రీ యస్ యస్ పి. నాయకుల మధ్య ఏర్పడిన విభేదాలు, ఈ వారంలో మరింత తీవ్రమయ్యాయి.

కేరళ యస్. యస్ పి నిజానికి ఈ ఎన్నికల విషయంలో ఒక నిర్దిష్ట వైఖరిని అవలంబించటంలేదు. ఇతర రాజకీయ పార్టీలతో ఎటువంటి ఎన్నికల పొత్తు పెట్టుకోవద్దని, పార్టీ చైర్మన్ శ్రీ యస్ ఎం జోషి గతంలో సూచన చేశారు. ఆయనసూచనకనుగుణంగా రాష్ట్రపార్టీ అధ్యక్షుడు శ్రీ కె చంద్రశేఖరన్ ఒక ప్రకటన చేశారు. కాని ఆ తర్వాత ముస్లింలీగ్తో రాష్ట్ర పార్టీ ఒప్పందం కుదుర్చుకున్నది.

పోటీ కమ్యూనిస్టులతోపొత్తుపెట్టుకోవాలన్న కొందరు నాయకులు, మిగతా వామపక్షపార్టీలతోపాటు ఐక్యసంఘటనలో చేరాలని కోరుతున్నారు. ఈ గ్రూపుకు శ్రీ పి కె కుంజు నాయకుడు. ఈయన వామపక్ష ఐక్యసంఘటన కమిటీ సమావేశానికి పరిశీలకుడుగా హాజరయ్యారు. అయితే ఈయన వైఖరికి రాష్ట్రీ పార్టీ అధ్యక్షుడు ఆయన అనుచరులు గట్టిగా వ్యతిరేకించారు.

జనవరి 3 వ వారంలో శ్రీ ఎస్. యమ్. జోషి కేరళ వస్తున్నారు. జోషి పర్యటనవల్ల ఉభయ గ్రూపుల మధ్య విభేదాలు పరిష్కారం అయినా కావచ్చు, లేదా మరి విభజన జరిగినా జరగవచ్చు.

వారణాసిలో జరిగే పార్టీ రాష్ట్రీ మహాసభలో పాల్గొనడానికి 200 మందిని రాష్ట్రశాఖ నిర్ణయించింది. కాని వీరిలో చాలా మంది ఎన్నికలు దగ్గరపడుతున్న దృష్ట్యా వారణాసి వెళ్ళడానికి అయిష్టతచూపుతున్నారు. ఈ అయిష్టతలకు ప్రాధాన్యతవుందని ఇక్కడ రాజకీయ పరిశీలకులు అంటున్నారు. రానున్న చీలికలకిది నాందిగా భావిస్తున్నారు.

తుపానుకు గురయిన రామేశ్వరం పట్టణంలో ప్రస్తుతం మామూలు పరిస్థితులు నెలకొన్నట్టు మద్రాసు రివెన్యూబోర్డు కార్యదర్శి శ్రీ వి. కార్తికేయన్ నేడు మదురైలో తెలిపారు.

'అణ్వాస్త్ర ఉత్పత్తి ఎన్నడూ కూడదు'

అణ్వాస్త్ర పోటీ దేశ స్వాతంత్ర్యాన్నే హరిస్తుందని కాంగ్రెస్ మహాసభలో కృష్ణమీనన్ ఉద్ఘాటన

దుర్గాపూర్ జనవరి 10

భారతదేశం అణ్వాయుధాలు ఉత్పత్తి చేయాలనే సూచనను కాంగ్రెస్ మహాసభలో శ్రీ కృష్ణమీనన్ తీవ్రంగా ఖండిస్తూ భారతదేశం ఇప్పటికేగాదు ఎప్పటికీ అణ్వాస్త్రాలను ఉత్పత్తి చేసే సమస్యే ఉండదని ఉద్ఘాటించారు.

విదేశాలతో 'అణ్వస్త్ర పొత్తు' సూచనను కూడా తీవ్రంగా వ్యతిరేకిస్తూ, ఇలాటిది జరిగినట్లయితే భారతదేశం ఆ దేశాల సైనిక స్థావరాలకు అంగీకరించడంద్వారా తన సార్వభౌమాధికారాన్ని తాకట్టు పెట్టి ఆ దేశాలకు దాసోహమనడమేనని తీవ్రంగా విమర్శించారు.

దుర్గాపూర్ జనవరి 10

భారత దేశం స్వంత అణ్వాయుధాలను కలిగివుండాలన్న కొందరి వాదనలను మాజీ రక్షణ మంత్రి శ్రీ కృష్ణమీనన్ పూర్తిగా ఖండించారు.

అంతర్జాతీయ వ్యవహారాలపై నేడిక్కడ కాంగ్రెస్ మహాసభలో ప్రతిపాదించిన తీర్మానంపై శ్రీ మీనన్ ప్రసంగిస్తూ భారతదేశం ఇప్పటికేకాదు ఎప్పటికీ అణ్వాయుధాలను కలిగివుండడమన్న సమస్యే లేదని ఈ సమస్యపై కనీసం చర్చ కూడా అనవసరమని ఆయన ఉద్ఘాటించారు.

వర్తమానకాలానికి మాత్రమే పరిమితమైన తన విధానాలను రూపొందించగలననీ సుదూర భవిష్యత్తుకు సంబంధించిననీ ప్రధాని చేసిన ప్రకటనను శ్రీ కృష్ణమీనన్ సవాల్ చేశారు.

ప్రధాన మంత్రి సొంత అభిప్రాయాన్ని తాను సరిగా అవగాహన చేసుకోలేక పోయాననీ ప్రధాన మంత్రి బహిరంగంగా మాట్లాడి ఉండరనీ పత్రికలు ఆయన ఉపన్యాసాన్ని తప్పుగా ప్రచురించి ఉంటాయనీ ఆశిస్తున్నాననీ శ్రీ కృష్ణమీనన్ అన్నారు.

ప్రస్తుత పరిస్థితి దృష్టిలో వుంచుకొని భవిష్యత్తు పటమను ఆధారితమైన అవగాహనతో విధానాన్ని రూపొందించడం ప్రభుత్వ విద్యుక్త ధర్మమని శ్రీ మీనన్ ఉద్ఘాటించారు.

చైనా ప్రమాదంతోపాటు గత 17 సంవత్సరాల్లో భారత సరిహద్దుల్లో శాంతి లేకుండా పాకిస్తాన్ ప్రమాదం కొనసాగుతూనే వుందని ఆయన అన్నారు.

దేశాన్ని ముక్కచెక్కలు చెయ్యాలని భారత రాజ్యాంగ సూత్రాలకు విరుద్ధంగా కొంత మంది చేస్తున్న వాదనకు ఆయన తీవ్ర అభ్యంతరం తెలిపారు. నాగభూమి కాశ్మీర్ సమస్యలపై శ్రీ జయప్రకాశ్ నారాయణ ప్రభృతులు చేస్తున్న వాదనలను దృష్టిలో ఉంచుకొని శ్రీ మీనన్ పై విధంగా అన్నారని భావించబడుతున్నది.

అణ్వాస్త్రాలు కల్పించే మానవ మారణ హోమమేగాక, అణ్వస్త్రదేశంకావాలనుకున్న రాజ్యాలు కలిగివుండవలసిన సాధన సామగ్రి గురించి కూడా శ్రీ మీనన్ తన ఉపన్యాసంలో వర్ణించారు.

అణ్వాయుధ ప్రమాదం నుండి దేశాన్ని రక్షించడానికి, అణ్వాస్త్రాలకలిగివుండటమంటే దాడికితయారౌతుండటమన్న ఏ శత్రుదేశమైనా ముందుగానే నాశనంచేసే అపారమైన శక్తిని సాధన సంపత్తిని కలిగివుండటమే అంతరార్థమనీ అన్నారు. అణ్వాయుధాలకు వ్యతిరేకంగా పోరాడానికి ఏకైక మార్గం దాటిని అంతం చేయడమేనని ఆయన ఉద్ఘాటించారు. అణ్వాస్త్రాలు కలిగి వున్నందువల్ల అమెరికాకుగానీ, సోవియట్ యూనియన్ కుగానీ భద్రత పెంపొందినదనడానికి ఆధారమేమీలేదన్నారు. అణ్వస్త్ర ప్రమాదమంతటివస్తే భారతదేశానికి తన సహాయాన్ని అందజేస్తానని అణ్వస్త్ర రాజ్యాలలోని ఏదేశం హామీయిచ్చిందోతాను తెలుసుకోదలచానన్నారు.

అణుశక్తి ఉపయోగంపై సోవియట్ యూనియన్ అమెరికాలు ఒక ఒప్పందానికి వస్తే ప్రపంచానికి మహావిపత్తు తొలగిపోగలదని ఆయన అన్నారు.

భారతదేశం ఏదోఒక దేశంతో అణ్వస్త్ర పొత్తు పెట్టుకొనడమంటే ఆ విదేశాలకు సైనిక స్థావరాలు కల్పించడానికి భారతదేశం అంగీకరించడమేనని దాని పర్యవసానం తన సార్వభౌమాధికారాన్ని ఆ దేశాలకు అర్పించి దాసోహమనడమేనని ఆయన ఉద్ఘాటించారు.

భారతదేశం అణ్వస్త్ర రాజ్యాలనుండి ఎలాటి హామీ పొందడానికైనా విజ్ఞప్తి చేయాలన్న ధోరణిని ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు.

పోటీపార్టీ వారి అరెస్టులను ఖండిస్తూ కార్మికుల ప్రదర్శన

పెదకాకాని, వెనిగండ్ల గ్రామాలలో

పెదకాకాని, జనవరి 11

దేశవ్యాపితంగా పోటీపార్టీ నాయకులను కార్మిక నాయకులను, ఏ ఐ టి యు సి నాయకులను దేశరక్షణ చట్టంక్రింద అరెస్టు చేయటాన్ని ఖండిస్తూ హేమలతా టెక్స్టైల్ వర్కర్సు యూనియన్ నాయకత్వాన నేటి ఉదయం పెదకాకాని వెనిగండ్ల గ్రామాలలో కార్మికులు నిరసన ప్రదర్శనలు జరిపారు. డిటెన్యూలను అందరినీ వెంటనే విడుదల చేయాలని కార్మికులు డిమాండ్ చేశారు.

ప్రదర్శనానంతరం జరిగిన సభలో ప్రభుత్వ దమననీతిని ఖండిస్తూ స్థానిక శాసనసభ్యులు జిల్లా కమ్యూనిస్టుపార్టీ నాయకులు శ్రీ ఎ.గులాబి కోటేశ్వరరావుప్రసంగించారు. సభకు యూనియన్ ఉపాధ్యక్షులు శ్రీ ఎ. రాజరత్నం అధ్యక్షత వహించారు.

కాంగ్రెస్ మహాసభలో మితవాద అభివృద్ధి నిరోధకశక్తుల పైచేయి

ఆర్థికపరిస్థితి ముసాయిదాలో సమూలమైన మార్పులపట్ల ఐ.పి.ఎ. విలేకరి వ్యాఖ్య

దుర్గాపూర్, జనవరి 10

కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలోని మితవాద అభివృద్ధి నిరోధకశక్తులు దుర్గాపూర్ మహాసభలో పైచేయిఅయ్యాయి. శ్రీ నందా శ్రీమతి ఇందిరాగాంధీలను ఈ శక్తులు వెనుకకు నెట్టాయి. దేశ ఆర్థికపరిస్థితిపై శ్రీ నందా ప్రతిపాదించిన ముసాయిదాలో సమూలంగా మార్పులు చేయడం ద్వారా ఈ అభివృద్ధి నిరోధకశక్తులు తమ బలాన్ని రుజువు చేసుకోగలిగాయి.

కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలోని మితవాద అభివృద్ధి నిరోధక శక్తుల ఒత్తిడి ఫలితంగా మంత్రి శ్రీ నందా సమర్పించిన ఆర్థిక పరిస్థితిపై ముసాయిదా తీర్మానంలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ప్రధానమైనమార్పులుచేసింది.

నందా సమర్పించిన ముసాయిదాలోని 'ఆత్మవిమర్శ' ధోరణిని పూర్తిగా తొలగించి 'ఆత్మ సమర్థన' వైఖరిని చొప్పించారు. భువనేశ్వర్లో మహాసభ నిర్ణయాలను అమలు జరపడంలో లోపాలను గురించి శ్రీ నందా ఈ ముసాయిదాలో పేర్కొన్నారు. కాగా కాంగ్రెస్ కమిటీ వాటిని తొలగించి 'భువనేశ్వర్ తీర్మానంలో పేర్కొన్న సూత్రాలను ఆశయాలను భావాలను ఆచరణలో పెట్టేందుకు నిర్మాణాత్మక చర్యలు తీసుకోబడ్డాయి' అని చేర్చింది. చతుర్థ ప్రణాళికలో ఉన్నతమైన అభివృద్ధి రేటు ఆవశ్యకత గురించి నందా ప్రస్తావనలను పూర్తిగా తొలగించారు.

ఉదాహరణకు నందా ప్రవేశపెట్టిన ముసాయిదాలోనుండి ఈ క్రింది పేరాను పూర్తిగా తొలగించారు.

మూడవ ప్రణాళికా కాలంలో జరిగిన లోపాల మూలంగా మూడవ ప్రణాళిక మిగిలిన కాలంలో ఉన్నతమైన అభివృద్ధి రేటును సాధించడానికి ఇతోధిక కృషి అవసరం మన రక్షణ పథకాలపై అదనపు వ్యయం చేయవలసిన దృష్ట్యా ఈ అవసరం ద్విగుణీకృతమైంది. నాల్గవప్రణాళికలో ఏడు శాతానికిసాధ్యమైనంత చురుకుగా ఉత్పత్తిని సాధించాలి. అందరికీ కనీసావసరాలను కూర్చడానికి, సమానావకాశం కల్పించడానికి, మూల సమస్యలను పరిష్కరించడానికి ఈ రేటున ఆర్థికాభివృద్ధి సాధించడం అత్యంత అవసరం. అంటే దీని అర్థం ఎక్కువ పనులను కల్పించాలి, ఇంకా ఎక్కువ స్థాయిలో పొదుపును పెంపొందించుకోవాలి. మంచి పరిపాలన, సమర్థవంతమైన సహకార సమన్వయం, రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు, ప్రయివేటు రంగాలలోని ప్రధాన యూనిట్ల ఆచరణపై ఎల్లప్పుడూ నిఘా ఉంచడం ద్వారా మాత్రమే దీనిని సాధించగలం. ఈ పేరాను పూర్తిగా తొలగించారు.

ఆహార సమస్యకు సంబంధించిన ముసాయిదా భాగాలను కూడా తీవ్రమైన మార్పులు చేశారు. దొంగవ్యాపారుల ధాన్యం దొంగనిల్వలకు సంబంధించి ఉన్న వాక్యాలన్నింటినీ తొలగించారు.

దొంగనిల్వల ఫలితంగా నీతిబాహ్యమైన వ్యాపారులు విపరీతంగా ధరలు పెంచి ఆహారధాన్యాల సప్లయిలో ఇబ్బంది కల్పించి ప్రజానీకానికి కష్టాలు కలిగించారు. ప్రత్యేకించి స్వల్పాదాయపరులకు, నిర్ణీత ఆదాయం వచ్చేవారికి తీవ్రమైన క్లేశాలు కలిగించారు. దొంగనిల్వలు తదితర అవినీతి కార్యక్రమాల మూలంగా దేశంలోని అనేక ప్రాంతాలలో అదుపు తప్పిన పరిస్థితి ఏర్పడింది. రాష్ట్రాల పరిపాలనా పరిస్థితి తలక్రిందులుగా తయారైంది. అన్న వాక్యాలను పూర్తిగా తొలగించారు. ఈ మహాసభ మితవాద అభివృద్ధి నిరోధకులు కొన్ని అంశాలపై అభివృద్ధికాముకులను ఓడించారు కూడా. శ్రీమతి ఇందిరాగాంధీని కూడా వెనుకకు కొట్టారు. భువనేశ్వర కాంగ్రెస్ నిర్ణయాలను అమలు జరపకుండా కాంగ్రెస్లోని ఒక బలమైన వర్గం నిరోధిస్తున్నారని ఆమె అన్నారు. భువనేశ్వర్ కాంగ్రెస్ మహాసభ నిర్ణయాల అమలుకు నిర్మాణాత్మకమైన చర్యలు తీసుకోబడ్డాయని చెప్పడ ద్వారా ఆమె చెప్పిన విషయాన్నికూడా వర్కింగ్కమిటీ త్రోసిపుచ్చింది.

భారత, ఈజిప్టుల స్నేహ సంబంధాలు దినదినాభివృద్ధి చెందుతున్నట్లు

ఈజిప్టు రాయబారి ప్రకటన

తిరువనంతపురం జనవరి 10

భారతదేశం, యునైటెడ్ అరబ్ రిపబ్లిక్ల మధ్య స్నేహ సంబంధాలు దినదినాభివృద్ధి గాంచుతున్నాయని, ఈజిప్టు రాయబారి శ్రీమహమ్మద్అసన్ ఎల్ అయత్ కేరళ సందర్శన సందర్భంలో తిరువనంతపురం ముస్లిం సంఘం తనకు ఏర్పాటు చేసిన సన్మాన సభలో ప్రసంగిస్తూ అన్నారు.

భారత ప్రధాని శ్రీ లాల్బహదూర్ శాస్త్రి తమ దేశపర్యటన సందర్భంలో వారికి నాజర్కి మధ్యజరిగే సంప్రతింపులవల్ల ఉభయదేశాలకు మధ్యగల ఈ స్నేహ సంబంధాలు మరింత పటిష్టం కాగలవని తెలిపారు.

అన్ని మతాలవారిని సమానదృష్టితో జూచే మత ప్రసక్తిలేని విధానాన్ని భారతదేశం అనుసరిస్తున్నందుకు తమ ఆహ్లాదాన్ని వ్యక్తపరచారు.

ఇతర మతస్థులతో సమతుగల సంబంధాలలో ఇస్లాంమతం ప్రపంచానికి బోధించిన ప్రేమ, సహోదరభావాలతో ముస్లింలు ప్రవర్తించాలని చెప్పారు.

ఈ సన్మాన సభకు కేరళ రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి శ్రీ పి. కె. యం. అబ్దుల్లా అధ్యక్షత వహించారు.

యంత్రాల ఉత్పత్తికై రష్యా సహాయం

భారత ఇంజనీరింగ్శాఖ మంత్రి వివరణ

న్యూఢిల్లీ జనవరి 11

భారతదేశంలో అన్ని రకాల యంత్రాలను ఉత్పత్తి చేయడం జరగడంలేదనీ లోటుగా వున్న శాఖల అభివృద్ధికి సోవియట్ యూనియన్ సహాయం ఇస్తే భారతదేశం సంతోషంగా స్వీకరిస్తుందనీ ఉక్కు గనులు భారీ ఇంజనీరింగ్ శాఖమంత్రి శ్రీ టి ఎన్ సింగ్ ఒక సోవియట్ లేఖరితో అన్నారు.

భారీ పంపులు కంప్రెసర్లను వుత్పత్తిచేసే కర్మాగారం గురించి చర్చలు నడుస్తున్నాయనీ అది ఎంత త్వరలో పని ప్రారంభిస్తుందాయని ఎదురు చూస్తున్నామనీ ఆయన అన్నారు.

బాల్ బేరింగుల రోలర్ బేరింగుల కర్మాగారం నిర్మించడం సాధ్యమేనని సోవియట్ నిపుణులు నివేదికనిచ్చారనీ, దానిమీద ప్రభుత్వం కార్యక్రమాన్ని ఉపక్రమించిందనీ ఆయన అన్నారు.

ఇక్కడ భారీ ఇంజనీరింగు పరిశ్రమలను ప్రభుత్వ రంగంలో హెచ్చుగా స్థాపించి వృద్ధి పరుస్తే తప్ప 1973 - 74 నాటికైనా భారత దేశం స్వయం పోషక స్థితి చేరుకోలేదని ఆయన అన్నారు. నాలుగో ప్రణాళిక అవుట నాటికి భారతదేశం భారీ యంత్ర నిర్మాణాగారాలలోనూ ఉక్కు కర్మాగారాలలోనూ పుట్టే శక్తిని రెట్టింపు పెంచుకోవలని వుంటుందనీ అలాచేసినా ఉక్కు పుట్టే 5 కోట్ల టన్నుల స్థాయికి చేరాలంటే 10-15 ఏళ్ళు పడుతుందనీ అనాటికి మన అవసరాలుకూడా పెరిగి ఆ వుత్పత్తి కూడా ఏమాత్రం చాలదనీ అన్నారు.

ప్రెస్ కౌన్సిల్ బిల్లు

కోయంబత్తూరు, జనవరి 11

ప్రెస్ కౌన్సిల్ బిల్లుపై నియమించిన పార్లమెంటు జాయింట్ సెలెక్టుకమిటీ ఈనెల 20 వ తేదీన ఢిల్లీలో సమావేశమై అయిదు రోజుల పాటు చర్చలు జరుపుతుందని కేంద్ర సమాచారశాఖ ఉపమంత్రి శ్రీ సి ఆర్ పట్టాభిరామన్ నేడిక్కడ పత్రికా విలేకరులతో చెప్పారు.

యువజన కాంగ్రెస్ పట్ల అతుల్యాఘోష్ ఆగ్రహం

దుర్గాపూర్ జనవరి 11

కాంగ్రెస్ నాయకులు శ్రీ అతుల్యాఘోష్ తీవ్ర కోపానికి యువజన కాంగ్రెస్ గురైంది. యువజన కాంగ్రెస్ నిబంధనావళిని రద్దుచేస్తూ కాంగ్రెస్ కార్యవర్గం నిర్ణయించేందుకు ఆయన 'చొరవ' తీసుకున్నారు.

యువజనకాంగ్రెస్వాదుల సంస్థసురక్షించేందుకే ఈ చర్య తీసుకొనబడినట్లు ఆయన చెప్తున్నారు.

ఇంతకుముందే ఈ సంస్థ చేతులుకట్టి మూలకూర్చోబెట్టటానికిగాను హిందీ, ఇంగ్లీషు భాషలలో 'యువ కాంగ్రెసు' పత్రికను ప్రచురించేందుకు కావలసిన డబ్బును ఎ ఐ సి సి. నిధులనుండి ఇవ్వకుండా నిలిపివేయటం జరిగింది.

కాంగ్రెస్లోని అతివాదశక్తులపై కాంగ్రెస్ మితవాద అభివృద్ధి నిరోధక శక్తులు సాగిస్తున్న దాడిగా ఈ చర్యలను రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. 'సోషలిస్టు ఫోరమ్' సమావేశాన్ని దుర్గాపూర్లో జరుప నెంచగా అతుల్యఘోష్ అడ్డంకిచెప్పి నిరోధించడంతో ఈ మితవాద అభివృద్ధి నిరోధక శక్తుల చర్యలు వెల్లడయ్యాయి. కాంగ్రెస్ మహాసభల సందర్భంలో 'సోషలిస్టు ఫోరమ్' చర్చలను జరపటం విచ్ఛిన్నకర చర్యగా శ్రీ అతుల్యఘోష్ పేర్కొన్నారు.

60 వేలమంది అమెరికా రేవు పనివారి సమ్మె

తూర్పుతీరం రేవులన్నింటిలో పనిబంద్

న్యూయార్క్, జనవరి 11

అమెరికాలోని తూర్పు తీరంరేవుల కార్మికులు నేడు సమ్మె ప్రారంభించారు. ఇంటర్నేషనల్ లాంగ్ షోర్మెన్స్ అసోసియేషన్ సభ్యులు 60 వేలమంది ఈ సమ్మెలో పాల్గొంటున్నారు.

ప్రభుత్వం ప్రవేశపెటిన కొత్త లేబరు కంట్రాక్టును నిరాకరిస్తూ ఈ సమ్మె ప్రారంభమైంది. దీని ఫలితంగా మైన్ రేవునుండి టెక్సాస్ రేవువరకూ తూర్పుతీర రేవులన్నింటిలోను పని స్తంభించింది.

సరిగ్గా నేటి అర్ధరాత్రి తరువాత రేవు కార్మికులందరూ పనులు విరమించి బయటకు వచ్చేశారు. సమ్మె పూర్తి పరిస్థితి నేటి ఉదయానికిగాని సరిగా తెలియరాలేదు. అయినప్పటికీ ఇంటర్నేషనల్ లాంగ్షోర్మెన్స్ అసోసియేషన్ సభ్యులు 60 వేలమంది ఈ సమ్మెలో పాల్గొన్నారని తెలుస్తున్నది.

1962-63 చలికాలంలో 34 రోజులపాటు ఇంటర్నేషనల్ లాంగ్ షోర్మెన్స్ అసోసియేషన్ నడిపిన సమ్మె ఫలితంగా అమెరికాకు నూరుకోట్ల డాలర్ల నష్టం వచ్చింది.

నూతనంగా ప్రవేశ పెట్టిన నాలుగు సంవత్సరాల ఒప్పందాన్ని నిరాకరిస్తూ గత శుక్రవారం రాత్రి న్యూయార్క్ రేవు కార్మికుల ఓటింగ్ తీసుకున్న ఫలితంగా నేడు ఈ సమ్మె ప్రారంభమయింది.

న్యూయార్క్ కార్మికులతో ఇతర అట్లాంటిక్, గల్ఫ్కోస్టు రేవు కార్మికులు కూడా సంఘీభావ సిద్ధంగా అనుసరిస్తారు.

క్యూబా వాణిజ్యశాఖ డైరెక్టరు బ్రిటిష్ గయానా రాక

జార్జిటౌన్ జనవరి 10

క్యూబా వాణిజ్యశాఖడైరెక్టరు సీనార్ రికార్డో కాబినెన్ కొద్ది రోజులలో బ్రిటిష్ గయానా రాజధాని జార్జిటౌన్కు రానున్నారు.

ఉభయ దేశాల మధ్యగల వాణిజ్య సంబంధాలను గురించి ఆయన బ్రిటిష్ గయానా నూతన ప్రభుత్వంతో చర్చలు జరుపుతారు.

బ్రిటిష్ గయానా బియ్యాన్ని అన్నిదేశాలకంటే ఎక్కువగా దిగుమతి చేసుకునే దేశాలలో మొదటిది క్యూబా. తమదగ్గర క్యూబా ఏటా 45 వేల టన్నులు బియ్యం కొంటున్నదని డాక్టర్ చెడిజగన్ ఇదివరలో తెలిపారు.

బ్రిటిష్ గయానా కొత్తప్రధాని బర్న్హామ్ను ఈ విషయమై అడిగిన ప్రశ్నకు సమాధానం ఇస్తూ క్యూబాకు బియ్యం సప్లయిని ఆపు చేయబోమని అన్నారు. ఇంకా కొత్త మార్కెట్ల కోసం ప్రయత్నిస్తామని కూడా ఆయన అన్నారు.

క్యూబాకు అమ్మే బియ్యం క్రింద బ్రిటిష్ గయానా క్యూబానుండి తమకవసరమయిన వస్తువుల్ని తీసుకోవాలని కాస్ట్రో ప్రభుత్వం ఈసారి కోరవచ్చునని తెలుస్తున్నది.

హిందీ ప్రచారసంస్థలకు ఆర్థిక సహాయం

మార్చి 31 లోగా దరఖాస్తులు పంపాలి

న్యూఢిల్లీ జనవరి 7

హిందీ భాషాభివృద్ధికి ప్రచారానికి కృషిచేసే స్వచ్ఛంద సంస్థలకు భారత ప్రభుత్వం ఆర్థిక సహాయం చేస్తుంది. ఇందుకు ఉద్దేశించిన పథకం ప్రకారం 1965-66 కు ఈ సహాయాన్ని మంజూరు చేయటానికిగాను, ఈ స్వచ్ఛంద సంస్థలు మార్చి 31 లోగా దరఖాస్తులు పంపాలని భారత ప్రభుత్వంలో విద్యా మంత్రిత్వశాఖ కోరింది.

నిర్ణీతమైన ఫారాలమీద ఈ దరఖాస్తులు పంపాలి. రాష్ట్ర ప్రభుత్వాలద్వారా వీటిని పంపాలి. రాష్ట్రాలలో విద్యాడైరెక్టరు కార్యాలయాలలో ఈ ఫారాలు దొరుకుతాయి. కేంద్ర విద్యాశాఖ మంత్రిత్వశాఖలో భాషా విభాగం నుంచీ కూడా ఈ ఫారాలను పొందవచ్చును. అంతేగాకుండా కలకత్తా, మద్రాసు నగరాలలోని కేంద్ర హిందీ డైరెక్టరు కార్యాలయాల ప్రాంతీయ అధికారులనుండి గూడా వీటిని తెప్పించుకో వచ్చును.

ఆర్థిక సహాయం పొందటానికి దరఖాస్తులు పంపే స్వచ్ఛంద సంస్థలు, 1964 65 లో గాని అంతకు ముందుగానీ మంజూరు చేయబడిన గ్రాంట్ల తాలూకు ఆడిట్ చేసిన స్టేట్మెంట్లు ఆ గ్రాంట్లను వినియోగించినట్లుగా సూచించే సర్టిఫికేట్లను 1965 ఏప్రిల్ 30 లోగా పంపాలి.

పూనా, జనవరి 10

ధరల పెరుగుదలకూ, అవసర సరకుల కొరతకూ నిరసనగా పూనా హోటల్ యజమానులసంఘం పిలుపు నందుకొని నేడు పూనాలోహోటళ్ళూ, రెస్టారెంట్లు ఒకరోజు లాంఛన సమ్మె జరిపారు.

దక్షిణాఫ్రికాలో 90 రోజుల నిర్బంధ చట్టానికి స్వస్తి

ప్రిటోరియా జనవరి 10

నిర్దిష్టమైన ఆరోపణలు లేకుండా 90రోజుల పాటు సమాచారాన్ని రాబట్టే దృష్టిని జైలులో ఒంటిగదుల్లో నిర్బంధించటానికి అవకాశమిచ్చే చట్టాన్ని దక్షిణాఫ్రికా ప్రభుత్వం రేపటినుండి నిలుపుదల జేస్తుంది.

ఈ చట్టం క్రింద ఇప్పుడు 73 మంది నిర్బంధించబడి ఉన్నారు. ఈచట్టాన్ని అవసరమైనప్పుడు పునరుద్ధరించే అధికారం న్యాయశాఖా మంత్రికి వుంటుంది. ఈ చట్టాన్ని నిలుపుదల చేయడంవల్ల ఈ 73 మందిని విడుదల చేయటంగాని కోర్టులలో హాజరు పరచటం గాని జరగవలసి వుంది.

ఈ నిగు మారిన చట్టానికి గత జూన్ మాసంతోనే గడువు పూర్తి అయింది. అయితే అప్పుడు మరో సంవత్సరం పాటు చట్టకాల పరిమితిని పొడిగిస్తూ ప్రభుత్వం ప్రకటన చేసింది.

ఈ చట్టానికి వ్యతిరేకంగా వేలాది ప్రజలు గత సంవత్సరంలో దేశవ్యాపిత పోరాటాన్ని నడిపారు.

ఒక 'డచ్రిఫార్మ్డ్ క్రైస్తవసంస్థ'తప్పితే మిగతా అన్నిమత సంస్థలు మహమ్మదీయ క్రైస్తవ, యూదు సంస్థల కార్యకర్తలు, అధిపతులు, జోహాన్స్బర్గ్ డర్బాన్, కేప్టౌన్లలో పెద్దఎత్తున నిరసన ప్రదర్శనలు జరిపారు.

గత సంవత్సరం ఈ చట్టంపై పార్లమెంటులో తీవ్రస్థాయిలో చర్చలు జరిగినప్పుడు నిషేధించబడిన ఆఫ్రికా జాతీయ కాంగ్రెస్, పాన్-ఆఫ్రికా నిస్టుల కాంగ్రెస్ పూర్తిగా విచ్ఛిన్నమైపోయినప్పటికీ, ఈ చట్టాన్ని అమలు జరుపవలసిన ఆవశ్యకత వుందని (అ) న్యాయశాఖామంత్రి వోర్స్టర్ అన్నారు.

ఈ 90 రోజుల చట్టంక్రింద అరెస్టు చేయబడి జైలులో ఒంటిగదుల్లో నరకయాతన అనుభవిస్తున్న వరిలో 25 మందిని రేపు విడుదల చేస్తారని తెలుస్తున్నది. ఆ చట్టం క్రింద అరెస్టుకావించి నిర్బంధించబడిన మిగతావారిపై కేసులుపెట్టి మామూలుగా కోర్టులలో విచారిస్తారని తెలుస్తున్నది.

మద్రాసులో హిందీ వ్యతిరేక ఆందోళన

వెనుకబడ్డ మనస్తత్వమని భక్తవత్సలం ప్రకటన

కలకత్తా, జనవరి 10

మద్రాసు రాష్ట్రంలో హిందీ వ్యతిరేక ఆందోళనకారుల వైఖరి "అభివృద్ధి నిరోధకమైనది, వెనుకబడ్డ మనస్తత్వంతో కూడినది" అని మద్రాసు ముఖ్యమంత్రి శ్రీ భక్తవత్సలం నేడిక్కడ చెప్పారు.

వారి కార్యకలాపాల మూలంగా తమిళులు సిగ్గుతో తలవంచుకొన వలసివస్తున్నదని కూడా ఆయన అన్నారు.

వీరు రిపబ్లిక్ దినోత్సవాన్ని సంతాప దినంగా జరప నిర్ణయించుకొన్నదన్న వార్తవల్ల ఆయన ఆశ్చర్యం ప్రకటిస్తూ దేనికి వీరి సంతాపం? అని ప్రశ్నించారు.

కలకత్తాలోని తమిళులు తమిళ రచయితల సంఘం ఆధ్వర్యాన చేసిన సన్మాన సభలో ప్రసంగిస్తూ శ్రీ భక్తవత్సలం పై విధంగా అన్నారు. కేంద్ర గనుల మంత్రి శ్రీ ఓ. వి. అలగేశన్ కూడ ఈ సన్మానసభకు హాజరైనారు.

హిందీని నేర్చుకోవాలని యువతరంవారు ఎక్కువ ఉత్సాహం చూపుతున్నారని ఆయన అన్నారు.

కలకత్తా విశ్వవిద్యాలయంలో తమిళ భాషా బోధన ప్రవేశ పెట్టడానికి తన ప్రభుత్వం చేయగలిగిన దంతా చేస్తుందని ఆయన హామీ యిచ్చారు.

శ్రీ ఆంజనేయులు డిమాండ్

(1 వ పేజీ తరువాయి)

అన్నారు.

మెకానిక్కులు సాంకేతిక నిపుణుల కొరతను గురించి ప్రస్తావించి ఈ కొరతను తీర్చడానికి ప్రభుత్వం ఇటీవలే కొన్ని చర్యలు తీసుకొన్నదని అన్నారు.

అధికారులు తమ వైఖరిని మార్చుకొని, ప్రజాసేవకులం మనం అనే వైఖరిని అవలంబించాలన్నారు.

అధికార పెత్తనం అనేది బ్రిటిష్వాళ్ళ కాలంలో వచ్చిందనీ కాని స్వాతంత్ర్యానంతరం క్రమశిక్షణ పేర చెలామణి అయిన ఈ దుష్టపద్ధతిని అంతంచేయటం ప్రారంభమయ్యిందని అన్నారు. క్రమశిక్షణ, శాంతి భద్రతలు ముఖ్యమయినా, ప్రజాసంక్షేమం అన్నిటికంటే ముఖ్యమని ఆయన అన్నారు.

పాట్నా, జనవరి 10

సంగీత నాటక అకాడమీలను బీహారు రాష్ట్రంలో ఏర్పాటుచేస్తూ గవర్నరు కార్యదర్శి శ్రీ బి ఎస్ దాస్ నేడు లాంఛనంగా ఒక ప్రకటన చేశారు.



మహిళాభ్యుదయం

ఆహార పదార్థాలలో కల్తీకి నిరసనగా మహిళలు ప్రదర్శనలు జరపాలి

'కల్తీచేయమని వర్తకులతోనూ, అలాంటివారిని శిక్షిస్తామని అధికారులతోనూ మాటతీసుకోవాలి'

కల్తీపట్ల, దొంగ వ్యాపారంపట్ల ప్రభుత్వపు 'నీళ్లునమిలే వైఖరి'ని బట్టబయలు చేయాలి

కల్తీ సరుకుల అమ్మకం కోటి మానవుల పట్ల మహాపరాధం కాదా? ఈ ప్రశ్న విశాలాంధ్ర 'మహిళాభ్యుదయం'లో చదివాను నేడు ప్రతివ్యక్తి నోట పెలువడుతున్న కల్తీ ఆహార సమస్య అగుటంవలన చర్చా వేదికలో పాల్గొనవలెనని అనిపించింది మొదట పై ప్రశ్నకు సమాధానంగా అట్టి కల్తీ వ్యాపారస్తులకు ఎంత పెద్దశిక్ష వేసినా తక్కువే అని పిస్తుంది.

మాటమాత్రంగా మిగిలి పోయిన 'ఉరిశిక్ష' మాట

కల్తీవ్యాపారాన్ని అరికట్టవలసిన బాధ్యత ప్రజలను పరిపాలించే ప్రభుత్వానిదే. ప్రభుత్వం ఏమోహో హెచ్చరికలు చేస్తుంది. అయినా వ్యాపారస్తులు మాత్రం లెక్కకు రా తమ పనులు నెరవేర్చుకుంటున్నారు. దీనినిబట్టి ఒక విషయం తేలిపోతుందంటే ప్రభుత్వ అసమర్థతైనా కావాలి లేదా ప్రభుత్వానికి వ్యాపారస్తులకు లోలోన ఏదో గాఢమైన బంధమైనా యుండాలి లేదా కాని కొన్ని పరిస్థితులను బట్టి, కొందరు నాయకుల (అధికార) వ్యాఖ్యలను చూస్తే రెండవదే నిజమన్నట్లు తెలుస్తుంది. 'మానవుని మానవుడు' దోచుకోవడం వరకు గూడా సహిస్తూనే వచ్చాము. తీరా అది కాని ప్రాణానికే ముప్పువచ్చేటట్లు ఉంది ఇదే సోషలిస్టు రాజ్యాలలోనైతే వారికెంత శిక్షఇచ్చేవారో మనం ఆలోచించాలి.

శ్రీ శ్రీ నెహ్రూగారు ఉన్నప్పుడు, ఇటువంటి కల్తీ వ్యాపారస్తులకు, బ్లాకు మార్కెట్ల దార్లకు 'ఉరి శిక్ష' సరియైన శిక్ష అన్నట్లు జ్ఞాపకం ఉంది. కాని వారు మాత్రం ఆచరణలో అట్టివారిపై ఎటువంటి శిక్ష తీసుకున్నారు? ఏ ఒక్కరికైనా అలా ఉరిశిక్షవేశారా లేదే ఐతే మరి వ్యాపారస్తులు అప్పటినుంచి తమ చీకటి, కల్తీ వ్యాపారానికి స్వస్తిచెప్పారా చెప్పాలి మరి అలా జరిగిందా అంటే మనకు నిత్యం కనపడుతున్నదాన్ని ఎలా కాదనగలము. దీన్నంతటిని బట్టి వ్యాపారస్తులకు మంత్రి పదవులలో కూర్చున్న మన (వి) నాయకులకు, విడదీయ కాని బంధమేదో ఉన్నదని గట్టిగానే చెప్పవచ్చు

ఇడ్లీ సాంబారుతో గుర్రపు లద్ది

బియ్యంలో కల్తీ ఉప్పులో కల్తీ నూనెలో కల్తీ అన్నిటిలో కల్తీ అసలికి ఇదెంతవరకు వెళ్లిందయ్యా అంటే కల్తీలేని వస్తువేదయ్యా అంటే. ఏదీలేదనేదాకా వచ్చింది ఈ మధ్యనే 'హిందుసమాజ్' వారు తీసిన ఆరాలుబట్టిచూస్తే ఇడ్లీ సాంబారులో గుర్రపులద్దీ బయటపడ్డదట చూడండి ఎంతదారుణమో పైసాకొరకు వారు పెంటతిన్నారంటే తిననీయి అనుకుందాము. కాని అట్టి పైనను మనదగ్గర తీసుకుని మనకే అదితినిపిస్తున్న ఈ దానవుని ఏమిచేస్తే బాగుంటుంది

ఈ మద్య చక్కెర కంట్రోల్ వచ్చిన దగ్గరనుండి 'చాయ్' లో పంచదార బదులు 'శాక్రీన్' కల్పుతున్నారు. కొన్నిహోటల్లలో బెల్లం చక్రీన్ మిక్చర్ చేసి కల్పుతున్నారు.

ఆదిమ మానవుడే మేలా?

నాగరికత పెరిగిన కొద్దీ మానవుని బుద్ధి వైజ్ఞానికంగా పెరిగినా సాంఘిక సంస్కారాలలో ఆదిమ మానవుడే మేలు అనిపిస్తుంది.

ఇట్టి సమయములో ప్రతివ్యక్తి ఈ విషయాలను ఎంతో ఎదుర్కొనవలసియున్నది అందులో ముఖ్యంగా మహిళలు ముందంజ వేయవలసియున్నది అనాదిగా సగభాగంగా యున్న మహిళలు చీకటి తెరలలో ఉండడం వలననే ఇటువంటి అత్యాచారాలు జరుగుతున్నవేమోననిపిస్తుంది. అందువల్ల స్త్రీలు ముందంజ వేసి ఈ ప్రతిఘటనను ఎదుర్కొనడం నేటి పరిస్థితులలో ఎంతో ముఖ్యం.

గ్రామాల లోనైతే తాము పండించిన వస్తువులే ఎక్కువగా దొరుకుతవి గానుక 'గుడ్డిలో మెల్ల' వలె కొంతలో కొంతనైనా బాగానే యున్నది ఎటొచ్చీ ఉప్పుదగ్గర నుండి నిత్య జీవితంలో అవసరంపడే ప్రతివస్తువునూ దుకాణాలమీదనే కొనే పట్టణ వాసులకే చాలా కష్టం వచ్చింది.

రోజుకూలీలో ప్రొద్దస్తమానం కష్టపడే పేద, మధ్య తరగతి ప్రజలకు ఈ సంక్షోభం ఎంతో ఎదురై కూర్చుంది. ఈ కల్తీ సరుకుల వల్ల కొత్త కొత్త రోగాలు రావడం, ఇది వరకే డాక్టరు ఫీజులు చెల్లించలేక సతమతమవుతున్న తరుణంలో ఈ కొత్త రోగాలు రావడ ఇక వారు కోలుకోలేని స్థితి కల్గింది ప్రాణాలను గూడా బలిగొంటున్నాయంటే ఈ కల్తీ సరుకుల చరిత్రను సృష్టించిన ఆ నరరూప రాక్షసులను ఏ విధంగా శిక్షిస్తే మన మనసులు కుదుట బడుతవి?

ఏమైనా ఈ విషయాన్ని ఇంతటితో వదిలి వేయ వలసిందిగాదు. గ్రామ గ్రామాల స్త్రీలు ప్రదర్శనలు చేయాలి. పట్టణాలలో ప్రభుత్వానికి తమ అసమ్మతి తెలుపుతూ దుకాణాల ముందు కల్తీసరుకులు అమ్మబడునే మాట ఇచ్చేంతవరకు సత్యాగ్రహాలు చేయుచూ ప్రభుత్వానికి ఈ వ్యాపారస్తులకు కఠిన శిక్షలువేసి తొందరలో ఈ కలుషిత వాతావరణానికి కారకులైన కల్తీ వ్యాపారస్తులను బయటికిలాగి ఈ సమస్యను అంతమొందించవలెనని అభ్యర్థనలు పంపుకోవాలి ఈ సమయాన మహిళలు ఎంతో ఓర్పుతో ఒక్కుమ్మడిగా కదిలి, ప్రభుత్వానికి కల్తీ వ్యాపారస్తులకు తమ తీవ్ర అసమ్మతిని తెల్పుచూ తొందరలో సమస్యను తీర్చకపోతే ఆ తర్వాత పరిణామాలకు ప్రభుత్వానిదే బాధ్యతనన్న హెచ్చరిక చేయుచూ కదిలినచో కొంతవరకైనా ఈ మాటుకవర్గ ఆగిపోయేదేమో నన్న అభిప్రాయం నాకు కలుగుతున్నది.

ప్రజాభిప్రాయాన్ని ధిక్కరించిన ఏ ప్రభుత్వమూ రాణించలేదు అందునా ప్రజాస్వామ్యయుతమైన ఈ ప్రభుత్వం గూడా అదేమొండిపట్టుపట్టితే పతనమయ్యేది తథ్యం. ఇది చరిత్ర చెప్పిన పాఠమే

అందువల్ల నా అభిప్రాయమేమంటే గ్రామ గ్రామాన పట్టణాలలో మహిళాసంఘాలు మహిళ లందరినీ కూడగట్టుకొని పెద్ద ఆందోళన ఈ 'కల్తీ' సరుకుల అమ్మకమునకు వ్యతిరేకంగా చేపట్టేనేతప్ప ఈ సమస్య అంతంగాదేమోనని అనిపిస్తుంది. 'ఆఫీసరు భార్యనే నేనెలా అసమ్మతి తెల్పాలి మంత్రి భార్యనే నేనెలా మందిలోకి రావాలి' అనుకోకుండా ఆ అభిప్రాయాలువదలి 'మానవులు' అనే భావనతో ముందుకువచ్చి ఈ సమస్యకు అడ్డుకట్టను కట్టవలసియుంది

—"అంతటి .."

కల్తీవ్యాపారస్తులు "నరహంతకులు!"

వారిని ప్రభుత్వం కఠినంగా శిక్షించడం అవసరం

మనదేశంలో నేడు అన్నిటికంటే ఘోరమైన నేరం ఆహార పదార్థాలను రకరకాలైన పదార్థాలతో కల్తీచేసి ప్రజల ఆరోగ్యాన్ని నాశనం చేయడమే ఇటువంటివారు మామూలు నేరస్తులు కాదు నరహంతకులకంటే ఘోరమైన నేరం చేస్తున్నవారని చెప్పాలి

ప్రతి కొట్లోను మంచి సరుకు కల్తీ సరుకు కూడా ఉంటాయి తెలిసి ఉన్నవారు, అధికారులు అయితే మంచి సరుకు యిస్తారు సామాన్య ప్రజలకైతే కళ్ళలో దుమ్ముకొట్టి కల్తీ సరుకు ఇస్తారు ఎందుకంటే సామాన్యులు నూటికి 90 మందిగా ఉన్నావారు చేయగల్గేది ఏమీ ఉండదు

ఉప్పులో ఒక బస్తాకు 10 శేర్ల చొప్పున యిసుక కలిపి అమ్ముతున్నారు ఒక బస్తా బియ్యంలో తెల్లరాళ్లు 10 15 శేర్ల వరకు కలిపి అమ్ముతున్నారు బియ్యం నూక కూడా గుడి గుచ్చుతున్నారు పరే ఇక పాత కొత్త బియ్యం కల్తీ సర్వ సామాన్యం. గోధుమ పిండిలో జొన్నపిండి కలగలుపుతున్నారు నూనెల్లో ఎన్ని రకాల నూనెలు అందులో శరీరానికి హానికలించేవి కలుపుతున్నారోచెప్పలేం కారపుపొడిలో గుర్రం విసర్జించిన పదార్థం కలుపుతున్నారు ఇన్నివిధాలుగా కల్తీ చేసి అమ్ముతూండడం. ప్రజలు కొనుక్కొని తినడం వలన అనారోగ్యాల పాలవుతున్నారు దేహదారుఢ్యశక్తి సన్నగిలిపోతుంది.

మందులకోసం వస్తే అందులో కూడా కల్తీసరుకే ఉంటున్నది

ఈ విధంగా ప్రజలను మోసం చేయడం ప్రజల ఆరోగ్యానికి ముప్పుతేవడం సహించరాని విషయం ఇది దొంగతనం కంటే దారుణమైన నేరం అసలు దొంగలంటే ఇంతకంటే వేరే ఎవరు ఉంటారు?

అందుచేత మహిళలు ఈ కల్తీ సరుకులకు వ్యతిరేకంగా పెద్ద ఆందోళన లేవదీయాలి ఇటువంటివారిని అధికారులు కఠినంగా శిక్షించాలని ఎలుగెత్తిందాలి అవసరమైతే అటువంటి వారిని అధికారులకు పట్టించడానికి కూడా వెనుదీయరాదు.

— శ్రీమతి ఎం. జబ్బార్

అధికారబలంవల్ల మానంకూడాపోతున్న స్త్రీ ఉద్యోగ పరిస్థితి

కల్తీ సరుకుల అమ్మకంలో ప్రభుత్వం ఏమైనా జాగ్రత్తలు తీసుకొనుచున్నట్లు మనకు అర్థమగుటలేదు. గొప్ప ధనికులకు పై అంతస్తులవారికి బాధావరకులు. ప్రశస్తమైన వస్తువులే దొరుకుచున్నవి పేద మధ్య తరగతికి చెందినవారికే గదా ఇట్టి కల్తీ సరుకులు దొరుకునది? ఈ ఇబ్బందులపై వారికి తెలియును? వారికి అంతా మనలాగే అనే భావము వారిలో స్ఫురించక మానునా? ఈ ఇబ్బందులు వారికే వున్న అట్టి సాధక బాధకాలు తెలిసియే యుండును.

అసలు వ్యాపారులు, మిల్లర్లు గొప్ప గొప్ప కోటీశ్వరులుగానో గొప్పధనికులుగానో వుదురు వారివారి స్వార్థము కొరకు ఉపయోగించుకొను పనులేగదా? వారిని ఎదిరించు శక్తి ఎవరికి వున్నది? ఎన్నిరోజులీ అక్రమ పరిపాలన? బ్లాకు మార్కెట్లు లంచగొండితనం రూపుమాపునది ఎప్పుడు?

ప్రజాపాల నంటున్నారు, కాని ఇందులో చట్టాలవిలువఎంత? ఆచరణలో నున్న కల్తీచేసే వారిని ఎదురించు శక్తి ఎవరికున్నది? అంతా వాళ్ళవాళ్ళేగదా సిఫారసులు, లంచాలు ఇచ్చి కేసులను తప్పుచుకొంటారు పేద, మధ్యతరగతివారికి కల్తీ చేసే అంతటిసరకు ఎక్కడిది? ప్రభుత్వము ఎవరిమీద కఠిన చర్య తీసుకున్నది? కర్మందాలక చిన్న చిన్న (పాలు నేయి) కల్తీ చేసిన నేరస్తులనే గట్టిగా శ్రద్ధ తీసికొని శిక్షించి జుల్మానాపేస్తారు వారా మొత్తం వ్యాపారము ప్రస్తుత ప్రజా పాలనలో గొప్పవారే సాగిస్తున్నారు దీనిని ప్రభుత్వము గుర్తించకుండా యున్నదా? అంతా ప్రభుత్వమునకు తెలిసియే యుండును పెట్టుబడిదారులు కోటీశ్వర్లు ధనికులు కాబట్టి వారి మీద కఠిన చర్యతీసికొనుటలేదు.

బియ్యంలో తెల్లరాళ్ళ కల్తీ

స్వరాజ్యము వచ్చిన నాటి నుండి ప్రజలకు ఎట్టి సౌకర్యములు గలుగుచున్నవో ప్రజలకే గుర్తు చిన్న వస్తువు మొదలుకొని పెద్ద వస్తువు వరకు కల్తీలేని సరుకులేదు ధాన్యములో తెల్లరాళ్ళను మిల్లర్లు కల్తీచేయుచున్నారు.

మన దేశము పాడిపంటలు సమృద్ధిగా వుండు దేశము భాగ్యవంతమైన దేశము ఇట్టి దురవస్థ పాలగుటకుకారణము? వ్యాపారులు కాంట్రాక్టర్లు చేయుస్వార్థపు పనులను బట్టి ఈ అధిక ధరలు మండిపోవుచున్నవి, ఈ ధరలుచూస్తే కడుపు మండిపోతున్నది.

'పేదవానికోపం పెదవికి చేటు' కాదుకదా?

'పేదవాని కోపము పెదవికిచేటు' అన్నట్లు అక్రమపనులు చేసినవారిని పట్టించినప్పటికీ వారిని శిక్షించుటకు సిఫారసులతో లంచాలతో పొలుసినుచున్నారు ఈ కండ్లతో ఎన్నో కేసులు చూచి ఊరకున్నాము. ఈ స్వార్థపరులు దిన దినాభివృద్ధి చెందుచున్నారు కల్తీలేని సరకులు గాని మరియేఇతర వసతులుగాని కలుగనేరవు. ప్రభుత్వమువారు మహిళలకు వసతులు గలుగ చేయుటకు అధిక ఇబ్బందులు ఏవో కుంటి సాకులు చెప్పరు. నష్టపడు ధనమంతా ఎవరి సొత్తు?

ఉద్యోగస్తులుగా వున్న విద్యాలయ ప్రభుత్వము తగు వసతులు గలుగచేయా లంటే డబ్బు వుండదు మా సేత డ్యూటీ కాలము కాక అదనపు డ్యూటీలు చేయించునపుడు మా బిడ్డలను సంసారమును విడిచిపెట్టి ఒక్కు చెప్పి పొయిగూయులకు పోతున్నాము ఇన్ని సౌకర్యములు లేక అనేక ఇబ్బందులకు వ్యయ ప్రయాసాలకు లోనగుచున్నాము బిడ్డలబాధలు తలిదండ్రుల ఇట్టి ఇబ్బందులున్న ఉద్యోగస్తులకు ప్రభుత్వము తగు వసతులు గలుగచేసిన ఏలాంటి ఇబ్బందిలేకుండా న్యాయమ డ్యూటీ చేయించిన వారగుదురు ఉపాధ్యాయులు విద్యార్థులను క్రమశిక్షణలో తీర్చుదురు అట్టివారి మీదనే అందరి కక్ష! వసతులు కలుగచేయాలంటే అధిక ఇబ్బందులు చెప్పుదురు పంచాయితీ రాజ్యాలలో స్వార్థపరులు ఎక్కువైనారు ప్రభుత్వ ఆశయాలు వేరు అనుసరించే విధానాలు వేరు.

ఉపాధ్యాయినులను ఎక్కువగా పల్లెలలో నివసించువారము కొంటి గ్రామపాలకులు చేయుపనులను గుర్తించి మేము యదార్థమే వ్రాయుచున్నాము.

ఒక సమితి ప్రెసిడెంటు పెళ్లి నిశీదరను డ్యూటీకి తీసుకొనిపోయి అసు ఎడల అవిధీతిగా ప్రవర్తించి నిర్బంధించినాడు అట్టి దుర్యలు పొందుతున్న ప్రజలెట్లుండురో గుర్తించుదురుగాక!

—ఒక ఉపాధ్యాయిని

అధికారులకు తెలియజెప్పడం మన విధి

చర్చావేదిక

ప్రస్తుత పరిస్థితులలో మనదేశం కరువుతో కటకట లాడుతున్నదన్న విషయం మనందరకు విదితమే. ఈ క్లిష్టపరిస్థితులను తోడుగా, వ్యాపారస్తులు దురాశకులోనై అధిక లాభార్జనకు పాల్పడి ప్రజారోగ్యమునకు ప్రాణహానికి సైతంలెక్క చేయకుండ ప్రమాదకరమైన పదార్థములతో కల్తీచేసిన మిశ్రమ పదార్థములను విక్రయించుటకు వెనుకంజ వేయడం లేదు వీరు తమ శత్రువులకు కూడా తలపెట్టరానట్టి హానిని చేయుటకు పూనుకుంటున్నారన్న సత్యాన్ని ఎవరూ మరువరాదు ఈ మిశ్రమ వ్యాపారస్తుల విషయంలో ప్రభుత్వ అధికారులు ఏవేవో కట్టుదిట్టాలు చేస్తున్నారా అంటే లేదు ప్రత్యక్షంగా కనబడుతున్నా చూచీ చూడనట్లు అశ్రద్ధ వహిస్తున్నారు. వీరు చూపుతున్న ఈ అశ్రద్ధకు ఏదో ఒక కారణం ఉండాలి. దేశద్రోహ చర్యలకు పూనుకున్న ఈ వ్యాపారులకు ఆటు ప్రభుత్వ అధికారులకు మధ్య ఏదో అవినాభావ సంబంధం ఉండకపోవాలి లేదనో వారు తమ కర్తవ్యాన్ని విస్మరించుటకు కారణం?

వీరు ప్రజలకు దేశానికి చేస్తున్న ద్రోహాన్ని అరికట్టాలంటే మన సోదరీ మణులు తా పదార్థములను అందుబాటులో అన్నంతవరకు పరిశీలించి తెలియవలెనని ఇలాంటి దేశద్రోహకర చర్యను రూపుమాపడానికి తమ తమ జిల్లా తాలూకా గ్రామాధి కారులదృష్టికి తీసుకు రావాలన్న మన ఏ పరిస్థితులలో కూడ మన కర్తవ్యాన్ని మరువరాదు

—కుమారి సవిత

ఒక ఉద్యమంగా ఎక్కువ ఫలప్రదం

స్త్రీలు ఎక్కువగా విద్యనభ్యసించి ఉద్యోగములు చేసిననంత మాత్రమున సంపు దురాదారమును మానిపోయాయనుకొనుటకు వీలులేదు అందుబాటులో లేని ఆర్థిక దుస్థితిని ఎదుర్కొని ఏ కొందరు స్త్రీలు ఉన్నత విద్యనభ్యసించగలరు నేటి సమాజములో ఉన్నత విద్య నభ్యసించ గల స్త్రీలు చాల తక్కువ ఇందుకు ముఖ్యంగా ఆర్థిక పరిస్థితి ఆటంకము ఆర్థిక పరిస్థితి బాగుగా ఉన్నవారే ఉన్నతవిద్య నభ్యసించడానికి అర్హులగుచున్నారు స్వాతంత్ర్యం వచ్చి 17 సంవత్సరములైనా నాటివరకు వ్యక్తిగతకృషివల్ల రాష్ట్రమునగాని లేకకేంద్రరాజధాని నగరమువంటి పట్టణములో గాని స్త్రీలయొక్క ఆర్థిక వ్యక్తిత్వమును గుర్తించలేనట్టు హైదరాబాదు సోదరి అభిప్రాయమువల్ల తెలిసింది 17 సంవత్సరముల కాలములో సాధించలేని వ్యక్తిగత విలువలు ఇకముందుసాధించగలమన్నగ్యారంటీ ఏమిటి? స్త్రీ ఉద్యోగము వేయుచున్నది ఆ వేళ ఒకనాటి సమతిశమైన ఆధార సాంప్రదాయములను ఎదుర్కొని పురుషులతో సమానముగా ఆమె కూడ అన్ని రంగములలోను పాల్గొనుటకు అర్హురాలని నిరూపించుకొను పట్టంగాభావించాలి

అంతేకాని, వస్త్వల్పం, వచ్చే ఆర్థిక లాభ నేటి సమాజంలో కనీస జీవితావసరములు కూడ సాధారణంగా తీరవు ఒకవేళ తీరినట్టయితే ఏ కొద్దిమందికో మాత్రమే. ఆ అవకాశం లభించుచున్నది అలాంటి అవకాశం లభించిన స్త్రీలు నూటికి పదిమందికూడ ఉండక పోవచ్చు మిగిలిన తొంభైమంది మాటేమిటి? అందుచేత ఒక పెద్ద ఎత్తున ఉద్యమం వంటి కృషి అవసరం స్త్రీల వ్యక్తిగతదృష్టిలో ఆర్థిక స్వాతంత్ర్యం సాధించాలంటే స్త్రీపురుష సమాన ఆస్తి హక్కు గురించి రాష్ట్రవ్యాపిత ఆందోళన రూపంలో దీన్ని వ్యక్తపరచాలి ఇందుకు ముఖ్యంగా ఉన్నత విద్యావతులైన స్త్రీలు ముందుకు వచ్చి అవిద్యావతులయిన అజ్ఞానులయిన కోటి సోదరీమణులకు వారి హక్కులను గుర్తించేలాగు చెయ్యవలసిన గురుతరబాధ్యత వుంది దీనికి ప్రభుత్వము తోడ్పడిన యెడల గ్రామసేవికా శక్తులైన స్త్రీలు ప్రచారముచేయాలి సమాన వారసత్వ హక్కును అమలుజరుపమని ప్రభుత్వాన్ని కోరాలి అది అమలు జరిగేవరకు కృషి చెయ్యాలి. స్త్రీ పురుష సమాన వారసత్వ ఆస్తి హక్కు అమలు జరిగిననాడే స్త్రీ నిజమైన ఆర్థిక స్వాతంత్ర్యం పొందగలదు ఉండవలసిన ఆర్థిక స్వాతంత్ర్యము ఉన్నప్పుడు స్త్రీలు వ్యక్తిత్వము నిలుపుకొందురు.

అలాగునే స్త్రీల ప్రతిపత్తి మారడానికికూడా తగు శ్రద్ధ వహించాలి దీనికి చైతన్యవతులైన స్త్రీలు పురుషులు పెద్దఎత్తున నిరక్షరాస్యతానిర్మూలనకు పాటుపడి కృషిచేయవలసిన బాధ్యత ప్రభుత్వానిదేనన్న భావనను ప్రజలలో కలిగించవలసి యున్నది. 40 సంవత్సరముల లోపు స్త్రీ లందరికీ నిర్బంధ వయోజన విద్య అమలు జరుపుటకు రాష్ట్ర వ్యాపిత కృషి చెయ్యాలి మురిగి కుళ్ళిపోయే పాత అనాచారములను నిరంపచేసి సంస్కారయుతమైన నవజీవన చైతన్యాన్ని కలుగజేసే విజ్ఞానమును వారికి వయోజన విద్య ద్వారా బోధించాలి అప్పుడే వరకట్న నిషేధములు, వర్ణాంతర వివాహములు కొంతవరకు సద్వినియోగం అవగలవనినా తలంపు వీటిని గురించి కూడ ఉద్యమం నడపవలెను ఒక్క రాజధాని నగరమును దృష్టిలో పెట్టుకొని ఊహించే బదులు. ఒక గ్రామమును దృష్టిలో పెట్టుకొని కోటి సోదరీ మణుల జీవితగాథలను మననం చేసుకొనగలశక్తి మనలో కలిగినప్పుడే మనము నిజమైన వ్యక్తిత్వమును ఆర్థిక స్వాతంత్ర్యమును కలిగి మన ప్రతిపత్తిని మార్చుకొనగలం

—వేల్ల సీతాలక్ష్మిరాజు

కల్తీవ్యాపారం చేసేవారు భయంకరమైన శత్రువులు!

వీరిపై జరిపే పోరాటంలో స్త్రీలు ప్రథమ శ్రేణిలో ఉండాలని పిలుపు

ఆహారపదార్థాలను, మందులను కల్తీ చేయడం అమ్మకం ద్వారా దేశంలోని ప్రజలను అనారోగ్యాలకు, అనేక రకాల వ్యాధులకు గురిచేస్తున్న వ్యాపారస్తులు, అక్రమ లాభార్జనాపరులు సంఘానికి చీడపురుగులవంటి వారనీ ఇటువంటి సంఘ వ్యతిరేకులపైన సంఘ శత్రువులపైన ప్రజలందరు తమ స్వశక్తిపై ఆధారపడి యుద్ధాన్ని ప్రకటించాలనీ ఈ పోరాటంలో స్త్రీలు ప్రథమ శ్రేణిలో నిలబడి మిగిలిన వారికందరికీ ఆదర్శప్రాయులు కావాలనీ అఖిలభారత కాంగ్రెస్‌కమిటీ మహిళా విభాగం పత్రిక "ఉమెన్ ఆన్ ది మార్చ్" ఒక వ్యాసంలో ఉద్బోధించింది

—సం.

ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యం వల్ల న్యాయాధిపతుల అలసత్వంవల్ల ఒకోసారి సంఘ వ్యతిరేకశక్తులు సమాజంలో స్వైర విహారం చేస్తాయి కేవలం లంచగొండితనమే కాదు. తర్కక వ్యాపారాల్లో దారుణమైన అవినీతి, అక్రమార్జన విచ్చలవిడిగా సాగిపోతాయి అందులో నేడు చాలా ఘోరంగా సాగిపోతున్నది కల్తీ సరకుల వ్యాపారం! ధరలను విపరీతంగా పెంచివేయడం లంచగొండితనం. అధిక లాభార్జన ఒక క్షణం సహించవచ్చునేమోకాని, ఆహార పదార్థాల కల్తీని ఒకక్షణం కూడా సహించడానికివీలులేదు కల్తీవ్యాపారస్తులను జాతికి ప్రథమ శత్రువులని శ్రీ గుల్జారి లాల్ నందా అనడంలో ఏ మాత్రం అతిశయం లేదు దీనిని ఎదుర్కొని పోరాడాలని అయన పిలుపు యిచ్చారు.

కొద్దికాలం క్రితం కేంద్ర ఆరోగ్య మంత్రి శ్రీమతి సుశీలానయ్యర్ ఆహార పదార్థాలను కల్తీ చేయడం యావజ్జాతికి విషం పెట్టడమేనని ఖండించారు ఇక మందులను కల్తీ చేయడం హీనాతి హీనమైన విషయమని ఆమె అన్నారు ఇది మానవులను హత్య చేయడమేనని కూడా శ్రీ నందా అన్నారు, కల్తీ మందులను తయారుచేసే వారిని తీవ్రంగా శిక్షించాలని శ్రీమతి సుశీలానయ్యర్ మరో సందర్భములో అన్నారు.

ఈ విధంగా కల్తీ వ్యాపార విరోధం విషయంలో మంత్రులు ఏకాభిప్రాయంలో ఉన్నప్పటికీ ఈ సంఘ వ్యతిరేక శక్తులు యధేచ్ఛగా తమ హీనమైన కృత్యాలను కొనసాగించుతూనే ఉన్నారు దీనివలన సమాజం అనారోగ్యానికి రోగాలకు కడకు మరణాలకు గురిఅవుతూంది

బలమైన ప్రజాభిప్రాయం ఈ దారుణమైన వ్యాపారానికి వ్యతిరేకంగా సమీకరించని లోపం కనబడుతూంది ఇటీవల ఢిల్లీలో ఏర్పడిన వినిమయదారులసంఘం సంయుక్త సదాచార సమితి ఈ కల్తీ వ్యాపారానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున ఆందోళన చేస్తున్నాయి మనందరం ఏయే వృత్తులకు చెందిన వారమైనప్పటికీ జీవితావసర వస్తువులను కొనవలసిన వారమే. అందుచేత మనందరికీ ఈ కల్తీ వ్యాపారం భయంకరమైన శత్రువే

కల్తీ వ్యాపారస్తులను కఠినంగా శిక్షించడానికి కేంద్రహోమ్ ఆరోగ్య శాఖలు ప్రత్యేక చట్టాలను తీసుకొని రావడానికి ప్రయత్నాలు జరుగుతూండటం హర్షదాయకమైన విషయం ఈ కొత్త చట్టాల క్రింద కల్తీ వ్యాపారులకు కేవలం జరిమానాలేకాక జైలు శిక్షనుకూడా విధించడానికి ఈ చట్టాలు అవకాశం కలిగిస్తాయి. చట్టాలలో కఠినమైన శిక్షలు విధించడానికి అవకాశాలులేక ఇటువంటి నేరస్తులు నేడు తప్పించుకొని పోవడంలేదు ఇటువంటి వారికి కఠినశిక్షలు విధించాలనే అభిప్రాయం ప్రభుత్వ అధికారులలోను న్యాయాధిపతులలోను లేకపోవడమే కారణం. ఆహారపదార్థాల కల్తీని అరికట్టడం పౌర సంస్థల బాధ్యత మందులు వగైరాలలో కల్తీని అరికట్టే చర్యలో ప్రభుత్వానిది కల్తీని కనిపెట్టడానికి తగినంత తనిఖీల సిబ్బంది. లేబొరేటరీలు మొదలైనవి కేంద్ర ప్రభుత్వం మరింత ఎక్కువ సంఖ్యలో నెలకొల్పాలి.

అన్నిటికంటే ముఖ్యం, ఎవరైతే బాధలకు గురి అవుతున్నారో వారు-అంటే ప్రజలు తమ శక్తిపై ఆధారపడి ఈ సంఘ వ్యతిరేక శక్తులపై శత్రువులపై యుద్ధాన్ని ప్రకటించాలి స్త్రీలు ఈ పోరాటంలో ప్రథమ శ్రేణిలో నిలబడి సమాజంలో మిగిలిన అందరికీ నాయకత్వం వహించాలని మేము అభిప్రాయ పడుతున్నాము. (1964 నవంబరు)

చర్చ ముగింపు

వ్యక్తుల కృషిని సంఘటిత పరచే ఉద్యమావశ్యకత

పత్రికలలో వ్యాసాలు వేదికలపైఉపన్యాసాలు సభలు. సమావేశాలు సంఘాలు - వీటన్నిటికంటే వ్యక్తులు పౌరసమూహ తాము చేయగలిగిన మేరకు అది ఎంతో పరిమితమైనప్పటికీ చేయడమే నేటి ప్రధాన కర్తవ్యమని విద్యార్థినులైన ఒక సోదరి యిచ్చిన అభిప్రాయంపై 'మహిళాభ్యుదయం'లో పలువురు సోదరీమణులు చర్చించారు అటు వ్యక్తిగత పౌరక కృషి కొనసాగించాలి ఇటు ఉద్యమమూ నిర్మించాలి రెండూ పరస్పరం విడదీయరాని విషయాలని ఎక్కువమంది వెలిబుచ్చిన అభిప్రాయంతో మహిళాభ్యుదయం ఏకీభవించుచుంది.

పదిమంది వ్యక్తులు ఒకచోట చేరి తమ తమ అనుభవాలను క్రోడీకరించి కార్యాచరణకు మరింత చేరువుగా రావడం అందరి శక్తియుక్తులను కేంద్రీకరించడమే ఉద్యమమని అంటాము

ఒకే వ్యక్తి భిన్న భిన్న కర్తవ్యాలకు, కార్యక్రమాలకు నిర్వహించడం కాక పదిమంది ఏక కాలంలో ఏక కర్తవ్యాన్ని నిర్వహించుకోవడమే ఉద్యమమని అంటాము

మన జాతీయోద్యమం మొదలు తెలుగు దేశంలో శ్రీ కందుకూరి వీరేశలింగంగారునిర్మించిన సాంఘిక సంస్కరణోద్యమం వరకు మనకు కన్పించే సత్యం ఇదే.

దేశానికి స్వాతంత్ర్యం సంపాదించడం ఏ వ్యక్తి కావ్యక్తి యితరులతో సంబంధం లేకుండా ఎంతకృషిచేసినా-అసాధ్యం తాత్త్వికవేత్తలు ఎంతమంది ఉద్భవించినా ఎన్ని ప్రమాణాలుచేసినా సమాజంలోమార్పు తీసుకురావడం అసాధ్యం.

ప్రజలశక్తిద్వారానే ప్రజలు సంఘటిత కృషిద్వారానే సమాజంలో మార్పులు సంభవం

అందుచేత వ్యక్తులకృషి సంఘంలో ఉద్యమానికి ఎన్నటికీ ప్రత్యామ్నాయ కాజాలదు ఆంధ్రలో మొదటసారిగాసాంఘిక సంస్కరణోద్యమాన్ని తీసుకొని వచ్చిన శ్రీ కందుకూరి వీరేశలింగం పంతులుగారు వ్యక్తి మాత్రంగానే ఆ సంస్కరణలను తీసుకొని రాలేదు అనాటి విద్యార్థులను, పురోగామి శక్తులన్నిటినీఆయన సమీకరించి సమాజంపై పెద్ద తిరుగుబాటు

(మిగతా 4 వ కాలంలో)

సోవియట్ మహిళ

మన దేశంలో ప్రతి పరిచారికైనా కూడా ప్రభుత్వ పరిపాలనా యంత్రాన్ని నిర్వహించ గలిగి వుండాలని లెనిన్ చెప్పి నలభై సంవత్సరాలకు పైగా అయింది రష్యన్ ప్రజల జీవితాన్నే మార్చివేసిన మహత్తర సాంఘిక మార్పులతోపాటు స్త్రీల పరిస్థితిలో కూడా బ్రహ్మాండమయిన మార్పులు సంభవించాయి ఈనాడు సోవియట్ యూనియన్ యద్గార్ నస్రిద్దినోవా అనే మహిళ ఉన్నత పార్లమెంటు సమావేశాలకు అధ్యక్షత వహించిందని గాని, తాష్కెంట్ లో జుల్ఫియా అనే కవయిత్రి సంపాదకత్వాన "ఉజ్బెకిస్తాన్ మహిళ" అనే పత్రిక వెలువడుతోందనిగాని నదెజ్దా జగ్గాదా అనే సామాన్య స్త్రీ సోషలిస్టు శ్రామిక వీర బిరుదాన్ని పొందిందనిగాని రోదసీ యాత్రికురాలు వాలెంటీనా తెరిష్కోవా పేర ప్రపంచ మంతటా మారుమోగిందనిగాని తెలియజేసే వార్తలు ఎవరికీ ఆశ్చర్యం కలిగించవు

ప్రఖ్యాతి వహించిన సోవియట్ మహిళల పేర్లు ఎన్నో చెప్పవచ్చు కాని ఆ పేర్లు చెప్పినంత మాత్రాన సోవియట్ స్త్రీలు ఎలాంటి వారో సమాజంలో వారు నిర్వహించే పాత్ర ఏమిటో పాఠకులకు సమగ్రంగా తెలియదు. అత్యంత ముఖ్యమైన విషయం ఏమంటే అక్టోబరు విప్లవం స్త్రీలకు పురుషులతో సమానమైన హక్కుల నిచ్చింది. దాని మూలంగా లక్షలాది సామాన్య స్త్రీలు చురుకైన సృజనాత్మకమైన జీవితాన్ని గడపడానికి అవకాశం ఏర్పడింది.

ఈనాడు స్త్రీలు అనేక అద్భుత కృత్యాలను నెరవేస్తున్నారు. వారి హస్తాలు బట్టలు నేస్తున్నాయి అణు భౌతిక శాస్త్ర సంస్థలలో అత్యంత క్లిష్టమైన యంత్రాలను నడుపుతున్నాయి వారు విమానాలను నడుపుతున్నారు కార్యక్రమాలను నిర్వాకపురవస్తు పరిశోధహిస్తున్నారు పిల్లలకు విద్యాబోధన చేస్తున్నారు రోగులకు సేవచేస్తున్నారు వంటలు వండిస్తున్నారు. ఖగోళశాస్త్రంపై ఉపన్యాసాలిస్తున్నారు షాపులలో అసిస్టెంట్లుగాను, ఫ్యాక్టరీలలో మేనేజర్లుగాను మంత్రులుగాను బాధ్యతలను నిర్వహిస్తున్నారు. ఏ శాఖలోనైనా స్త్రీని సహాయం చేయనిరంగమంటూ మన సమాజంలో లేదు. తాముచేసే కృషి ఫలితాలను చూసుకుంటే స్త్రీలకు పూర్తి సంతృప్తి మనతను చేకూరుస్తుంది. సోవియట్ యూనియన్‌లో నేడు విద్యా సాంస్కృతిక రంగంలో పనిచేసేవారిలో 82 శాతం వైద్య రంగంలో, 86 శాతం స్త్రీలేననేది ఎంతమాత్రం యాదృచ్ఛికమైన విషయం కాదు

షోకులు, ఫ్యాషన్లు సోవియట్‌లో తక్కువ

షోకులకోసం అలంకారాలకోసం ఫ్యాషన్ బుర్రగా వుండే ఇళ్ళకోసం మాత్రమే జీవ ప్రయపడేవారు మీకు సోవియట్ స్త్రీలలో ఎక్కడోగాని కనిపించరు ఎక్కడా ఏ ఉద్యోగం చేయని చాలా కొద్దిమంది స్త్రీలు మాత్రమే ఇంటిని కనిపెట్టుకుని వుంటారు వారుకూడా చాలా తరుచుగా పాఠశాలలో వుండే తల్లిదండ్రుల కమిటీలలో సభ్యులుగాను, తమతమ భర్తలు పనిచేసే ఫ్యాక్టరీ క్లబ్‌లలో విశిష్టులుగాను వారు నివసించే ప్రాంతంలో

ఎల్. ఇవనోవా

కూరగాయలను పెంచి ఇతర సదుపాయాలను కలిగించే కమిటీలలో సభ్యులుగాను వుంటారు నూతన కమ్యూనిస్టు సమాజ నిర్మాణం లో స్త్రీ కూడ చురుకుగా పాల్గొనే సభ్యురాలుగా వుండాలని లెనిన్ భావించారు ఈనాడు సోవియట్ మహిళ అలాగేవుంది సోవియట్ ప్రభుత్వమే ఆమెకు అవకాశాన్ని కలిగించింది అందుకామె ఆ ప్రభుత్వానికి ఎంతో ఋణపడింది

అయితే తన దేశానికి సేవచేయడమనే యీ పవిత్ర కర్తవ్యం ఆమెలోని స్త్రీత్వాన్ని గాని మాతృత్వాన్నిగాని నాశనం గావించలేదు ఏదో ఉద్యోగం చేస్తున్నా ఆమె తన ఇంటిని కుటుంబాన్ని చక్కబెట్టుకుంటూనే వుంటుంది ఈ రంగంలో కూడ సోవియట్ మహిళ పూర్తిగా మారిపోయింది ఆమె తన పిల్లలకు ఆదర్శంగా వుంటుంది వారికే గౌరవ పాత్రురాలవుతుంది. సోవియట్ యూనియన్‌లో కుటుంబ బాధ్యతలను చాలా వరకు ప్రభుత్వమే నిర్వహిస్తుంది. శిశుపోషణాలయాలు, బాలోద్యాన పాఠశాలలు, బోర్డింగు పాఠశాలలూ చాలా నెలకొల్పబడ్డాయి స్త్రీల వేతనాలు పురుషులతో సమానంగా వున్నాయి ఉద్యోగంలో వున్న స్త్రీకి ప్రసవ సమయంలో 112 రోజులు జీతంమీద సెలవు ఇవ్వబడుతుంది సమష్టి వ్యవసాయ క్షేత్రాలలో పనిచేసే స్త్రీలకుకూడా

(మిగతా 6 వ పేజీలో)

వ్యవసాయ వస్తు ధరలు

విజయవాడ జనవరి 11

విజయవాడ రీజినల్ అసిస్టెంట్ మార్కెటింగ్ డైరెక్టరు10-1-65న అందజేసిన ఉత్పత్తిదారులనుండి కొనుగోలు చేయబడిన టోకు ధరలు (ఒక క్వింటాల్ 100 కిలోగ్రాములు, లేక 220½ పౌనులు)

ధాన్యం

		75 కి	100 కి
నంబర్లు:	విజయవాడ	రు. 33-37	44 49
..	కాకినాడ	33 37	44 49
..	చిత్తూరు	29 00	38 67
అక్కుళ్లు	విజయవాడ	29 25	39 00
..	తాడేపల్లిగూడెం	28 58	38 00
..	కాకినాడ	29 73	39 64
..	ఆముదాలవలస	29 73	39 64
నన్నకృష్ణకాటుకలు:			
	తాడేపల్లిగూడెం	30 75	41 00
సన్నాలు:	ఆముదాలవలస	32 00	42 67
మొలకొలుకులు:	నెల్లూరు	35 65	47 58

మిల్లు బియ్యం

నంబర్లు:	విజయవాడ	రు 72 00
..	కాకినాడ	72 00
అక్కుళ్లు:	విజయవాడ	61 50
..	తాడేపల్లిగూడెం	61 83
..	కాకినాడ	61 50
..	ఆముదాలవలస	62 15
నన్నకృష్ణ కాటుకలు:		
.	తాడేపల్లిగూడెం:	68 39
నంబర్లు:	చిత్తూరు	79 67
సన్నాలు:	ఆముదాలవలస	69 00
మొలకొలుకులు:	నెల్లూరు	77 00

వేరుశనగ

కాయలు	విజయవాడ	86 08
..	నంద్యాల	88 25
..	ఆదోని	92 87
..	విజయనగరం	85 35
పప్పు	విజయవాడ	135 00
..	నంద్యాల	125 00
..	ఆదోని	123 00
..	విజయనగరం	134 00
నూనె	విజయవాడ	250 00
..	నంద్యాల	245 00
..	ఆదోని	233 00
..	విజయనగరం	256 67

అపరాలు

కందులు:	విజయవాడ	రు. 110 00
..	గుంటూరు	108 00
.	ఆముదాలవలస	—
మినుములు:	విజయవాడ	78 00
..	గుంటూరు	82 00
..	ఆముదాలవలస	75 28
పెసలు:	విజయవాడ	100 00
..	గుంటూరు	104 00
..	ఆముదాలవలస	98 25
శనగలు:	విజయవాడ	141 80

జొన్నలు

అనంతపురం:	తెల్లవి	58 00
నంద్యాల:	పచ్చవి	70 00

బెల్లం

అనకాపల్లి:	మొదటిరకం	72 60
..	మూడవరకం	54 70
చిత్తూరు	మొదటిరకం	68 01
..	మూడవరకం	58 01

జీడిపప్పు

మోరీ:	అమెరికన్‌రకం	రు 681 81
..	దేశవాళీ	690 80
..	బద్దలు	581 81
..	ముక్కలు	418 18

మిర్చి

ఎర్ర ఒకటవ రకం గుంటూరు	230 00
.. రెండు 2వ రకం ..	225 00
.. 2 దర్జా రకం	

నెయ్యి

	పల్నాడు	దేశవాళీ
గుంటూరులో	[illegible] 00	700 00

కొబ్బరికాయలు

(వెయ్యింటికి ధరలు)	కొత్తవి:	పాతవి
విజయవాడ:	200 00	290 00
రాజమండ్రి	170 00	220 00
పాలకొల్లు	170 00	240 00

పసుపు

దుగ్గిరాలలో:	కొమ్ములు	రు 155 00
..	కాన్పూరు	169 00
..	దుంపలు	127 50
కడపలో	కొమ్ములు	140 00
..	దుంపలు	124 00

రేడియో

బుధవారం, జనవరి 13
శక 1886 ★ పుష్య 23

విజయవాడ

357 1 మీ (840 కిలోసై)

ఉదయం: 4-30 నాదస్వరం దోలు 5 40 శ్రీ వేంకటేశ్వర సుప్రభాతం: 6-00 కలియుగ వైకుంఠం (రూపకం) రచన: బందా కనకలింగేశ్వరరావు: 6-30 శుభోదయం ప్రసారవిశేషాలు, తిరుప్పావై, సప్తపది 6-40 అం. వా: 6-45 హై రిలే: 6-55 సూక్తిముక్తావళి 7-00 తె. వా: 7-15 చతురంగ: 7 30 ద్వారం భావనారాయణ రావు 8-00 అం వార్తలు: 8-15 హై రిలే: 8 30 హై వరెలే, 9-00 సమాప్తి

మధ్యాహ్నం: 12-30 కార్మికులకు 1-00 హై రిలే: 1-30 లలితసంగీతం: 1 40 హిం. వా: 1-50 తె. వా: 2-00 సమాప్తి

సాయంత్రం: 5-00 వైజయంతి: 6-00 స్థానిక ప్రకటనలు: 6 05 ప్రాం. వా: 6-15 హై రిలే: 6-20 గ్రామస్థులకు: 7-00 తె వా 7-15 గ్రామస్థులకు: 7-30 సరస వినోదిని 7-45 వాద్యసంగం: 8-00 హై రిలే: 8-30 ఫిల్మ్ సంగీతం: 8-45 వాద్య బృందం: 8-55 ప్రస్తుతాంశం: 9-00 అం వా 9-15 ఆంగ్లమున: 9-25 విరామసంగీతం: 9-30 ఢి రిలే: 9-50 ఏకాదశి మహాత్మ్యం: ఎస్ సిహెచ్ కృష్ణమాచార్యులు హరికథా కాలక్షేపం: 10-35 సమాప్తి - జన గణ మన

హైదరాబాద్ - ఎ

405 4 మీ (740 కిలోసై)

ఉదయం: 6-30 సుప్రభాతం కార్యక్రమ వివరణ: 6-40 అం వా: 6-45 భక్తిరంజని- అన్నమాచార్య కీర్తనలు: 6-55 సూక్తి ముక్తావళి: త్రివర్గ ప్రదీపిక (తిరుక్కురల్). 7-00 తె వా: 7-15 సంకీర్తనం: 7-30 ఎస్ రామకృష్ణ అయ్యర్: 7 45 సారంగి: 8-00 అం వా 8-15 సంక్రాంతి గీతమాల బృందగానం: 8-30 ఎస్ పద్మ ఎస్ రాజకుమారి: 9-00 ప్రసార సమాప్తి

మధ్యాహ్నం: 12-30 కార్మికులకు - ఢి రిలే 1-00 మహిళా సమాజం: 1-30 వేణువు: 1-40 హిం వా: 1-50 తె వా: 2-00 కన్నడ శ్రోతలకు. 2-10 ఉ వా 2-20 తబ్లా 2 30 ప్రసార సమాప్తి.

సాయంత్రం: 6-00 స్థానిక ప్రకటనలు 6-05 ప్రాం. వా: 6-15 ప్రస్తుతాంశము: 6-20 హై బి వరెలే: 7-00 తె. వా: 7-15 హై బి వరె 7-30 చిత్రకదంబం: 8-00 మనోరథం (నాటిక) రచన: ఆర్ భరద్వాజ: 8-30 సారంగి: 8-55 ప్రస్తుతాంశం: 9-00 అం వా: 9-15 ఉ వా: 9-30 ఢి రిలే: 9-50 హిందీ నాటిక 10 15 సారంగి: 10-30 అం. వార్తలు: 10-35 ప్రసార సమాప్తి - జన గణ మన.

హైదరాబాద్ - బి

కడప

285 1 మీ (1130 కిలోసై)

విశాఖపట్నం

322.6 మీ (930 కిలోసై)

సాయంత్రం 6-00 నుండి రాత్రి 9-30 వరకు

89 42 మీ (3355 కిలోసై)
(హైదరాబాద్ మాత్రమే)

ఉదయం: 6 30 హై ఎ.వరెలే: 7-45 సమాప్తి

60 12 మీ (4990 కిలోసై)

8-00 హై ఎ. వరెలే: 9-00 సమాప్తి

42 02 మీ (7140 కిలోసై)
(హైదరాబాద్ మాత్రమే)

మధ్యాహ్నం: 12-30 హై ఎ. వరెలే 1-30 వయొలిన్ 1-40 హై ఎ వరెలే 2-01 ఎస్ రామకృష్ణ అయ్యర్: 2-30 సమాప్తి

సాయంత్రం: 6-00 హై ఎ. వరెలే: 6-20 గ్రామస్థులకు: 7-00 తె వా: 7-15 గ్రామస్థులకు: 7-30 హై. ఎ. వరెలే: 8-30 ఎస్ పద్మ ఎస్ రాజకుమారి: 9-50 వి రిలే: 10 30 హై. ఎ వరెలే: 10-35 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి - జన గణ మన

మద్రాస్ - బి

211 3 మీ (1420 కిలోసై)
60 98 మీ (4920 కిలోసై)

ఉదయం: 6-40 అం వా: 6-45 మంగళ గానం: 7-00 తె వా: 7-15 వాద్యగోష్ఠి 7-30 రామ్నాద్ కృష్ణన్: 8-00 అం. వా: 8-15 ప్రసార సమాప్తి

211 3 మీ (1420 కిలోసై)
41 90 మీ (7160 కిలోసై)

మధ్యాహ్నం: 12 00 కార్మికుల కార్యక్రమం: 12-30 సమాప్తి

1-00 కదంబం: 1-30 అం. వా: 1-40 గీతమంజరి: 1-50 తె. వా: 2-00 ప్రసార సమాప్తి.

సాయంత్రం: 5-30 పాశ్చాత్య సంగీతం: 6-00 అం. వా: 6-05 ప్రాంతీయ రౌండప్ 6-20 వాతావరణ సూచన స్థానిక ప్రకటనలు: ఆంగ్లం: 6-30 కార్యక్రమ వివరణ-తమిళం: 6-35 వీణ 7-00 తె. వా: 7-15 చిత్రగానం 7-30 మాధవీ రాజగోపాలన్: 7-45 ఆంధ్ర దేశపు జానపదగేయాలు: 8-00 మనోరథం (నాటిక): 8-30 మాధవీ రాజగోపాలన్: 8-55 ప్రస్తుతాంశం: 9-00 అం. వా 9-15 ఆంగ్లమున: 9-30 ఆంగ్లప్రసంగం - ఢి. రిలే: 9-50 పాశ్చాత్యసంగీతం: 10-35 ప్రసార సమాప్తి - జన గణ మన

ఇదివరకువలె రైల్వే పనివారికి గ్రెయిన్ షాపులు

ప్రతిసారీ రు. 2 రు 3 లు పెంచడం చాలదని గుంతకల్ హెచ్.ఓ బ్రాంచీల మహాసభ తీర్మానం

గుంతకల్లు జనవరి 10

ధరలు పెరిగినప్పుడల్లా ఏదో కన్నీటి తుడుపుగా రెండో మూడు రూపాయల డి ఏ ను పెంచినందువల్ల లాభంలేదనీ, అందువల్ల 1945 నాటివలె రైల్వే పనివారికి గ్రెయిన్‌షాపులు తెరవాలని కోరుతూ దక్షిణ రైల్వే ఎంప్లాయీస్ యూనియన్ గుంతకల్లు హెడ్‌క్వార్టర్సు - ఓపన్ లైన్ బ్రాంచీల మహాసభలో తీర్మానించారు

దక్షిణరైల్వే ఎంప్లాయీస్ యూనియన్ గుంతకల్ హెడ్‌క్వార్టర్ - ఓపన్‌లైను బ్రాంచీల మహాసభ గుంతకల్ యూనియన్ ఆఫీసు ఆవరణలో జనవరి 3 న జరిగింది ఉదయం శ్రీ జి లాజరస్ (గాంగిమెన్) జండాను ఎగురవేశారు కార్మిక నాయకులు శ్రీ పి. కె కుమారన్ (యమ్ పి.) గారు సభకు అధ్యక్షత వహించారు

గుంతకల్ టెక్స్టైలు ఎంప్లాయీస్‌యూనియన్ అధ్యక్షులు శ్రీ వి కె ఆదినారాయణరెడ్డి ఎం ఎల్ ఏ (అనంతపుర జిల్లా కమ్యూనిస్టు సమితికార్యదర్శి)గారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిసారి ధరలు పెరిగినప్పుడల్లా రెండుమూడు రూపాయలు కరువుభత్యం ఇస్తున్నది ఇందువల్ల కార్మికుల సమస్యలు పరిష్కారము కావనీ ఆహారసమస్య దీర్ఘకాలము వుండబోతున్న సమస్యగాన రైల్వేకార్మికు లందరూ ఐకమత్యముతో పోరాటంజరిపి గ్రెయిన్‌షాపులకై ఆందోళన చేయాలని విజ్ఞప్తి చేశారు

కుటుంబ సంఖ్యనుబట్టి జీతాల నిర్ణయం

శ్రీ కుమారన్‌గారు మాట్లాడుతూ రైల్వే నిర్వహణ ఒక స్వతంత్ర పారిశ్రామికసంస్థగా ఉండాలనీ ఇంజనీరింగు టెక్స్టైలు జూట్ డాక్ మొదలైన కార్మికులకు ఉన్నట్లు రైల్వే కార్మికులకు కూడ ఒక జీతాలబోర్డును నియమించాలనీ సూచించారు

ఫ్రాన్సు - ఇటలీ మొదలగు యూరప్ దేశాలవలె మన దేశంలోనూ కుటుంబసంఖ్యను బట్టి జీతాలు నిర్ణయించవలయునని కోరారు

కార్మికవర జీవితావసర వస్తువుల ధరలను ప్రస్తుతం 183 పాయింట్లు ఉందనీ రెండవ పేకమీషన్ సిఫారసుల ప్రకారం 183 పాయింట్లకు రూ 45 కరువుభత్యం ఇవ్వాలనీ కానీ రూ 20-50 పైసలు మాత్రమే ఇస్తున్నారనీ తెలిపారు. త్వరలో ఇంకొక మూడు కాక ఐదు రూపాయలు ఇవ్వవచ్చుననీ ప్రస్తుత ధరలను బట్టి అది ఎక్కడా చాలదు కాబట్టి 1945 కు పూర్వము పెట్టినట్లు గ్రెయిన్ షాపులు తెరవాలని ఆందోళన సాగించాలని కోరారు

ఆర్ యం. యస్ యూనియన్ ఉపాధ్యక్షులు శ్రీ జి. నాగభూషణం మహాసభ జయప్రదము గావాలని శుభాకాంక్షలు తెలిపారు

రైల్వే మజ్దూర్ యూనియన్ తరపున శ్రీ విజయరత్నము మాట్లాడుతూ ఐక్యతతో కోర్కెలను సాధించుకోంటామని అది ఈ మధ్య లోపించినందువల్ల మన సంఘాలు బలహీనపడుచున్నాయని చెప్పారు

శ్రీ కె ధనోజీరావు శ్రీ పి నారాయణ స్వామిగార్లు రెండు బ్రాంచీల కార్యదర్శి నివేదికలను సంవత్సరపు లెక్కలను సమర్పించారు. వీటినిసభ ఏకగ్రీవముగా ఆమోదించింది

రెండు బ్రాంచీలకు క్రింది కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకొన్నారు.

ఓపన్ లైన్సుబ్రాంచి

అధ్యక్షులు శ్రీ యం భరతన్ (పెయింటర్ కలాసి (నంద్యాల) కార్యదర్శి శ్రీ పి నారాయణస్వామి (డి యస్ కె గుంటకల్ కోశాధికారి ఈశ్వరప్ప (ఎ. టి యస్ లోకో షెడ్డు) సహాయకార్యదర్శులు షేక్‌పాబు (ట్రాలీమెన్ ద్రోణాచలం) నారపరెడ్డి (కీమెన్ వెంకటాంపల్లి) సి ఐ సి సభ్యులు శ్రీయుతులు శ్రీనివాసులు (ఫిట్టర్ లోకో షెడ్) డి. హనుమంతు (గాంగిమెన్ గుంతకల్) జి మరియదాస్ (కర్నూలు ఎలెక్ట్రికల్ డిపార్టుమెంటు) 12 మంది కార్యవర్గసభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు.

హెడ్ క్వార్టర్స్ బ్రాంచి

అధ్యక్షుడు శ్రీ షేక్ ఇబ్రహీం (టి. సి హమాల్ గుంతకల్)

కార్యదర్శి: శ్రీ జె బి మాథ్యూస్ క్లార్కు- డి. సి యస్ ఆఫీసు)

కోశాధికారి: శ్రీ పి నారాయణస్వామి (ఫిట్టర్ మేస్త్రీ లోకో షెడ్)

సహాయ కార్యదర్శులు: శ్రీ వై. తిప్పయ్య (టి యస్సు అర్ డిపార్టుమెంటు) శ్రీ ఆరోగ్యస్వామి (లోకో షెడ్)

సి ఐ సి సభ్యులు శ్రీ సి రామలింగారెడ్డి (సీనియర్‌క్లార్కు- డి ఎ. ఓ ఆఫీసు) శ్రీ లాజర్ (గాంగ్ మన్ గుంతకల్) శ్రీ బి ఎ. పైమన్ (క్లార్కు- డి యం ఇ ఆఫీసు) మరియు 15 మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు

తరువాత క్రింది తీర్మానములు ఏకగ్రీవముగా ఆమోదించబడినవి గ్రెయిన్ షాపులు రైల్వే సిబ్బందికి వెంటనే తెరవాలి గుంతకల్లు డివిజన్‌ను క్రొత్త రైల్వేజోనులోచేర్చించాలి అధిక ధరల కనుగుణ్యంగా కరువు భత్యం పెంచాలి. రైల్వేశాఖకు ప్రత్యేకంగా వేజ్‌బోర్డు నియమించాలి

తదితర డిపార్టుమెంట్లవారీగా తీర్మానములు ఏకగ్రీవంగా ఆమోదించబడినవి

ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయసంఘ సర్వసభ్య సమావేశము 26-1-65 వ తేదీ మంగళవారం మధ్యాహ్నం 1 గంటకు విజయవాడ (పటమట లంక)లోని శ్రీ సర్వోత్తమ భవనమున జరుగుతుంది.

'రాళ్ళు - రత్నాలు'

విజయవాడ జనవరి 9

విజయవాడ శ్రీ వెలిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయములో జనవరి 2 వ తేదీన చాటపర్రు జాతీయ నాట్యమండలి వారిచే రాళ్లు రత్నాలు' నాటిక ప్రదర్శించబడింది,

ఈ సందర్భంలో శ్రీ వల్లూరి పూర్ణచంద్రరావుగారి అధ్యక్షతను ప్రముఖరంగస్థల ప్రయోక్త శ్రీ కోనేమాధవరావుగారికి నూతన వస్త్రాలిచ్చి సన్మానించారు ఈ సభలో నాట్యాచార్య శ్రీ కోరాడ నరసింహారావుగారి నాట్యం గురించి ప్రసంగించారు శ్రీ ఆంధ్ర సుబ్రహ్మణ్యంగారు పద్యరూపంలో ఆశీర్వాదం చదివారు అభినవ శ్రీ మాధవరావు కృతజ్ఞత తెలిపారు

సభానంతరం రాళ్ళు రత్నాలు" నాటకం ప్రదర్శించారు

నాటకబృందానికి శ్రీ జి వి ఎన్ రంగారావు (శ్రీ విజలక్ష్మి క్రోకరీ సెంటర్), రజత పాత్రను బహూకరించారు.

సోవియట్ మహిళ

(3 వ పేజీ తరువాయి)

యీ సదుపాయాలున్నాయి హోటళ్ళు వంటశాలలు భోజనశాలలు దేశమంతటా నెలకొల్పబడటంతో స్త్రీలకు ఇంటివద్ద వంటపని ఇంటి చాకిరీ చాలావరకు తగ్గిపోయాయి దీనివల్ల స్త్రీలు ఎమెచ్యూరు కళా కార్యకలాపాల్లో పాల్గొనడానికి సినిమాలకూ నాటకాలకు పోవడానికి టెలివిజన్‌లు చూడటానికి మ్యూజియంలు మొదలయినవి సందర్శించడానికీ అల్లిక పనులు కుట్టుపనులు మొదలయిన స్త్రీలకళలను అభివృద్ధి చేసుకోడానికి తీరిక లభిస్తుంది.

భర్తతోపాటు ప్రవాసానికి వెళ్ళిన రాకుమారి

తిరుగుబాటులో పాల్గొన్నందుకు తన భర్తను జారు చక్రవర్తి సైబీరియా ప్రవాసానికి పంపితే ఆయనతోపాటు తానుకూడా సైబీరియాకువెళ్ళిన రాకుమారి త్రుబెట్‌స్కయా పేరు చరిత్రలో ఇంకా నిలిచే వుంది ఆ రోజులలో సైబీరియాకు పోవడమనేది వీరోచిత చర్యగా పరిగణింపబడేది

"సోవియట్ వీర" బిరుదాంకితురాలైన లూడ్‌మిల్లా పాల్లిచెంకో గత యుద్ధంలో స్నైపరుగా పనిచేసి అనేకమంది ఫాసిస్టులను హతమార్చింది.

లెనిన్‌గ్రాడ్ నగరాన్ని నాజీలు ముట్టించినప్పుడు ఆకలితోను చలితోను క్రుంగిపోతున్న స్త్రీలను పిల్లలను వృద్ధులను ఓలా నెరోబెట్స్ తన దేశభక్త సేవలతో ఉత్తేజపర్చింది

దయ అణకువ పట్టుదల ఇవి సోవియట్ స్త్రీల ప్రత్యేక లక్షణాలు జీవితంపట్ల బాధ్యతతో కూడిన దృక్పధాన్ని కలిగివుండటం, దయార్ద్ర హృదయులై వుండటం ఇవి సోవియట్ మహిళలు తమ యువతరం వారికి అందిస్తున్న వారసత్వాలు విప్లవం సాధించిన విజయాలపట్ల గొప్ప అనురక్తిని కలిగి వుంటటం తమ తండ్రులు తాతలు ప్రాణాలను ధారవోసి కాపాడిన మాతృభూమిపట్ల భక్తిని కలిగి వుండటం అనే లక్షణాలను యువకులు తమ పెద్దలనుండి అలవర్చుకుంటున్నారు

సోవియట్ దేశంలో జీవితం ఏ యేటికా యేడు మెరుగవుతోంది ఈ క్రింది అంకలే ఆ విషయాన్ని తెలియజేస్తాయి గత ఆరేళ్ళలోనూ 7 కోట్ల 50 లక్షల మంది సోవియట్ ప్రజలు నూతన గృహ ప్రవేశాలను చేశారు.

యుద్ధం, బాంబులు మన కాలంలో గత విషయాలు

యుద్ధాన్ని గురించీ, బాంబులను గురించి రేషన్ కార్డులను గురించి - లెనిన్‌గ్రాడ్‌లో ప్రజలు రోజుకి 125 గ్రాముల రొట్టె మాత్రమే తినేవారన్న విషయాలను గురించి తమ పెద్దల ద్వారాను పుస్తకాల ద్వారాను చలన చిత్రాల ద్వారాను మాత్రమే తెలుసుకునే కొత్త తరం వచ్చింది.

సోవియట్ స్త్రీలు ధరించే దుస్తులు అందమైనవిగాను ఆకర్షణీయమైనవిగాను తయారయాయి వారికి రోజాలంకరణముకూడా అభివృద్ధి చెందాయి పై వాటికన్నిటిబట్టి ఈ నాడు గ్రామంలో నివసించే స్త్రీ ఎవరో, నగరంలో నివసించే స్త్రీ ఎవరో చెప్పడం కష్టం. రోదసీని గురించి ఉపన్యాసం వినడానికిగాని, పుస్తకాల షాపుల్లో పుస్తకాలు కొనడానికిగాని ఒక బొమ్మ చిత్రాన్ని చూడడానికిగాని గ్రామీణస్త్రీలు పట్టణస్త్రీలు కూడా ఒకలాగే గుమిగూడుతున్నారు

సోవియట్ మహిళలలో మారకుండా వున్న లక్షణం ఒకటే అదేమిటంటే అమెలోని కార్య దక్షత అమెలోని చురుకుదనం తన చుట్టూ జరిగే కార్యకలాపాలన్నిటికీ అమె తాను బాధ్యురాలుగా భావించుకుంటుంది. తల్లిగా, స్రష్టకర్తగా, నిర్మాతగా అమె యీ భూగోళంమీద శాంతిని సంరక్షించడానికి కంకణం కట్టుకున్న తల్లులందరితోనూ ఒక తెగా వుంటుంది, ఎందుచేతనంటే అదిఅమెకు సహజమైన వాంఛ.

— (నొవోస్తీవార్తా సంస్థ)

నాల్గవ ప్రణాళికలో టెలిఫోన్ పరిశ్రమ

బెంగుళూరు జనవరి 10

ప్రభుత్వ యాజమాన్యాన నడుస్తున్న బెంగుళూరు టెలిఫోను పరిశ్రమకు నాల్గవ పంచవర్ష ప్రణాళికలో 258కోట్లరూపాయలు పెట్టుబడి పెట్టడానికి నిర్ణయమైందనీ 126 కోట్ల రూపాయల విలువచేసే టెలిఫోను భాగాల అమ్మకం లక్ష్యంగా పెట్టుకోవటం జరిగిందని పరిశ్రమ మేనేజింగ్ డైరెక్టరు శ్రీ ఉమాశంకర్ తెల్పారు

నాలవ పంచవర్ష ప్రణాళికలో ఇకా ఈ పరిశ్రమకు సంబంధించిన వివరాలను రూపొందించవలసి వుందని నేడు దుర్వాని నగర్‌లో 1962 - 63 సంవత్సరంలో ప్రభుత్వ పరిశ్రమలన్నింటిలోనూ మిక్కిలి సమర్థవంతంగా పనిచేసినందుకు ఈ సంస్థకు రాష్ట్రపతి రజత పతకాన్ని బహూకరించారు

నాలవ పంచవర్ష ప్రణాళికా కాలంలో 40 లక్షల టెలిఫోన్లను 16 లక్షల ఎక్స్చేంజి లైన్లు 65 కోట్ల రూపాయల విలువచేసే ట్రాన్స్‌మిషన్ సామగ్రి 12 కోట్ల రూపాయల విలువగల రక్షణశాఖ ట్రాన్స్‌మిషన్ సామాగ్రి ఉత్పత్తి చేయవలసివుంటుంది

బీహార్ మంత్రివర్గంతో టి. టి. కె. చర్చలు

పాట్నా జనవరి 10

దుర్గాపూర్ నుండి కేంద్ర ఆర్థికశాఖ మంత్రి శ్రీ టి టి కృష్ణమాచారి నేడు పాట్నాకు చేరుకున్నారు ఢిల్లీనుండి ప్లానింగ్ కమిషన్ ఉపాధ్యక్షులు శ్రీ అశోక మెహతా కూడా యిక్కడికి వచ్చారు

65-66 సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వ 70 కోట్ల పెట్టుబడితో ప్రణాళికను సిద్ధం చేసింది అయితే, రాష్ట్ర ఆదాయం కేంద్ర సహాయంతో కల్పుకొన్నప్పటికీ ఈ మొత్తానికి 6 లేక 7 కోట్ల రూపాయలు తగుతుంది ఈ చర్యలవల్ల రాష్ట్ర ఆదాయాలను ప్రస్తుత పరిస్థితిని తారుమారు చేయకుండా అదనపు నిధులను సేకరించగల రాష్ట్ర ప్రభుత్వ శక్తిని కేంద్రప్రభుత్వం అంచనా వేయటానికి వీలు కల్గుతుందని అధికారులు చెపుతున్నారు

లాలాలజపతిరాయ్ శతజయంతి కార్యక్రమం

కమిటీ సమావేశంలో చర్చ

దుర్గాపూర్ జనవరి 10

ప్రధానమంత్రి శ్రీ శాస్త్రి అధ్యక్షతన నిన్న రాత్రి ఇక్కడ లజపతిరాయ్ శతజయంతి కమిటీ సమావేశం జరిగింది

ఈ నెల 28 నుండి నవంబరు 17 వరకు దేశ వ్యాపితంగా లజపతిరాయ్ శత జయంతి ఉత్సవ కార్యక్రమాన్ని గురించి ఈ సమావేశంలో చర్చించారు

విద్యార్థులకు పోటీలు పెట్టాలని మద్రాసు ముఖ్యమంత్రి భక్తవత్సలం సూచించారు.

ఆ మహోన్నత దేశభక్తుడు స్వాతంత్ర్యోద్యమంలో నిర్వహించిన పాత్రను ప్రజలకు అందజేయడానికి గ్రామాలు మున్నగు వైజ్ఞానిక కార్యక్రమం చేపట్టాలని అయనను గురించిన సారస్వతం ప్రకటించాలని కూడా ఈ సమావేశంలో ఆయన సూచించారు

'ఉపాధ్యాయుల జీతనాతాలుచాలాతక్కువే'

ఆంధ్ర గవర్నర్ శ్రీ పిళ్ళే సానుభూతి

కర్నూలు, జనవరి 10

వివిధ తరగతుల ఉపాధ్యాయులు ఈనాడు పొందుతున్న జీత - నాతాలు చాలా తక్కువ ప్రభుత్వం వారి సమస్యలపట్ల మరింత ఉదారత చూపడం అవసరం అని ఆంధ్ర ప్రదేశ్ గవర్నరు శ్రీ పట్టం థానుపిళ్ళె నిన్న ఇక్కడ జిల్లా పరిషత్తువారు తమకు సన్మానం జరిపిన సందర్భంలో చెప్పారు

అయితే యిది తమవ్యక్తిగత అభిప్రాయం మాత్రమేనని అయన స్పష్టంచేశారు.

గణితశాస్త్రం సైన్సు వంటి విషయాలు బోధించే వుపాధ్యాయులు పట్టణవాస జీవితపు ప్రలోభాలకు లోనుగాకుండా గ్రామసీమల్లోని పాఠశాలలకు వచ్చి సేవచేయడానికి సిద్ధపడాలని అయన వారికి హితవు చెప్పారు.

ఐ రా. స. ఆర్థిక చిక్కులు తొలగగలవని యుథాంట్ ఆశాభావం

ఐ రా స జనవరి 10

ఐక్యరాజ్యసమితికి యేర్పడిన ఆర్థిక చిక్కులు త్వరలోనే తొలగిపోగలవని తాను దృఢంగా విశ్వసిస్తున్నానని యుథాంట్ మొన్న ఇక్కడ చెప్పారు

ఆయన వారం రోజులుగా అస్వస్థతతోవుండి తిరిగి కార్యాలయానికి రావడం యిదే తొలిసారి

ఈ వారం యీ సమస్యా పరిష్కారానికి తాను మరికొంత కృషి చేయగలనని ఆయన అన్నారు.

నీలగిరులవద్ద లారీ ప్రమాదంలో 8 మంది మరణం

ముగ్గురికి తీవ్రంగా గాయాలు

కోయంబత్తూరు, జనవరి 10

జనవరి 8 వ తేదీన నీలగిరివద్ద ఒక మలుపుతిరుగుతుండగా లారీ 1000 అడుగుల అగాధంలో పడిపోయిందని అక్కడికక్కడే 4 గురు చనిపోయారని, మరో నలుగురు తర్వాత చనిపోయారని ముగ్గురి పరిస్థితి ప్రమాదకరంగావుందని నేడిక్కడ పోలీసులు ప్రకటించారు

ఈ లారీ ఇటుకను తోలుకొని పోతున్నదని కుందా జలప్రాంతంలోని పోర్తిమండ్ రిజర్వాయర్‌కు సమీపంలో ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు తమ ప్రకటనలో వివరించారు

దక్షిణ రైల్వే మజ్దూర్ యూనియన్ ప్రథమ వార్షిక సర్వసభ్య సమావేశం జనవరి 5 వ తేదీన విజయవాడలో జరిగింది

పంటపొలాల జప్తులను తక్షణం ఆపివేయించాలి

ధరలు పెరిగి, రైతుకు భుక్తిగడువక పనుల్లేని స్థితిలో జప్తులు జరగడం శోచనీయమని ఖండన

కోవూరు జనవరి 9

నెల్లూరుజిల్లా కోవూరు తాలూకా కమ్యూనిస్టుసమితి కార్యదర్శి శ్రీ గుసుపాటి రామచంద్రయ్యగారిలా ప్రకటిస్తున్నారు:

నెల్లూరుజిల్లా కోవూరు తాలూకాలోను నెల్లూరు తాలూకాలోనూ బంజరు సాగులపై విపరీత పెనాల్టీలు విధించారు ఎకరం 1కి 200 రూ ల నుండి రు 400 ల వరకూ వేసినారు ఈ దారుణమైన పెనాల్టీల రద్దుచేయమని అనేక దఫాలు జమాబందీలోను జిల్లా కలెక్టరు వద్దకు బంజరు సాగుదార్లు పోయి మొర పెట్టుకొన్నారు.

ది 1-1-65 న నెల్లూరుక్యాంపులోవున్న రెవెన్యూమంత్రి శ్రీ రామచంద్రారెడ్డిగారివద్దకు వేలాది బంజరు సాగుదార్లు పోయి బంజరు సాగులపై వేసిన పెనాల్టీలు రద్దు చేయాలనీ 419 జీ ఓ రద్దుచేయాలనీ మెమోరాండం యిచ్చినారు మంత్రి పి. డబ్ల్యు డి అధికార్లతోనూ కలెక్టరుతోనూ మాట్లాడి తగు సహాయం చేస్తామని చెప్పినారు

కానీ మంత్రి నెల్లూరు వదలిన వెంటనే గత 20 30 సం॥లుగా నిరుపేద ప్రజలు సాగుచేస్తున్న బంజరు భూములలోని పైర్లను జప్తు చేస్తూ నోటీసు లిచ్చారు నిరుపేద వ్యవసాయ కార్మికులు అనేక కష్టనష్టములు కోర్చి సాగుచేశారు, పంటపండితే తీరుస్తామని విపరీతమైనవాములకు అప్పులు తెచ్చుకొని బ్రతుకుతున్నారు

జిల్లాలో వ్యవసాయ కార్మికులకు పనులు లేవు వున్నచోట్ల మగవాళ్ళకు రు 1-0-0 కూలీ దొరకటం కూడా కష్టంగా వున్నది మార్కెట్‌లో సేరుబియ్యం రూపాయి అమ్ముచున్నది. నెల్లూరు జిల్లాలో డెల్టాతాలూకాల్లోనే వేలాది కుటుంబాలు వస్తులతో బాధపడుచున్నారు

ఇటువంటి పరిస్థితుల్లో నోటివద్దకు వచ్చిన పంటను ప్రభుత్వం జప్తుచేసి పెనాల్టీల క్రింద జమకట్టుకోవాలని చూడటం దారిదోపిడీ కన్న అన్యాయం.

నెల్లూరుజిల్లాలో చెరువు పోరంబోకుల్లోని బంజరు సాగులవల్ల చెరువులక్రిందిఆయకట్టులో ఒక ఎకరం భూమికూడా నీరు లేక ఎండి పోలేదు, పనులు దొరకని వ్యవసాయ కార్మికులు తలా కొంచెం కిరాయి భూములు ఆక్రమించి వారి కుటుంబ అవసరాలకు 2 3 మాసాల గ్రాసమైనా పండించుకొంటే అదీ నేరమేనా? పనులు చూపలేక చౌకధరలకు అందించక పండించినవారి నోటికాడ కొచ్చిన పంటను జప్తుచేయ బూనుతున్న కాంగ్రెస్‌ప్రభుత్వ పాశవిక చర్యను ప్రజాస్వామిక వాదులంతా ఖండించాలని కోరుతున్నాను జప్తులు వెంటనే విరమించి సాగుదారు తాత్కాలిక పట్టాలు కివ్వాలని నిరుపేద సాగుదార్లకు న్యాయం చెయ్యవద్దని ప్రభుత్వాన్ని కోరుతున్నాను"

విశాఖ పోర్టులో ట్రస్టు చౌకడిపోలు

ఐ యన్ టి. యు. సి. నాయకుని డిమాండ్

విశాఖపట్నం జనవరి 9

విశాఖపోర్టుట్రస్టు ఛైర్మన్ పోర్టులో చౌకడిపోలు కొనసాగిస్తూ బియ్యం తదితర వస్తువులు వాటిద్వారా సప్లయికి బాధ్యత వహించాలని కోరుతూ విశాఖపట్నం హార్బర్ పోర్టువర్కర్స్ యూనియన్ మొన్న జరిపిన సామూహిక నిరాహార వ్రతాన్ని పురస్కరించుకొని పోర్టుట్రస్టు సభ్యులు శ్రీ పి మసవాళ్ళయ్య నాయుడుగారు పోర్టు ఛైర్మన్‌కు ఒక లేఖ వ్రాశారు అందులో ఐ ఎన్ టి యు. సి కి చెందిన హార్బర్ పోర్టు కార్మిక సంఘం యీ సమస్యపై అవలంబిస్తోన్న ఆందోళనా వైఖరితో తమ కెంతమాత్రం సమ్మతం కాకపోయినా యీ ఆహారసమస్య తీవ్రత దృష్ట్యా చౌకడిపోలద్వారా ట్రస్టు బియ్యం వగయిరాలను సప్లయి చేయాలని కోరారు తమ సంఘాన్ని అందుకోసం తిరిగి సమ్మె చేసే స్థితికి నెట్టవలదని కోరారు. కాని యదార్థ మేమంటే యీయన సంఘాలు యీ సమస్యపై సమ్మె చేయలేదు. (వి. వి)

జాతీయ ఆహార విధానావశ్యకత

ఆహార కార్పొరేషన్ అధ్యక్షుని ప్రసంగం

మంగుళూరు జనవరి 10

ఆహార సమస్య పరిష్కారానికి ఉత్పత్తి పంపిణీకి సంబంధించిన అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి ఒక సమగ్ర జాతీయ విధానాన్ని రూపొందించుకోవాలని ఆహార కార్పొరేషన్ అధ్యక్షులు శ్రీ టి ఎ పాయ్ నేడిక్కడ అన్నారు

దక్షిణ కెనరా కోఆపరేటివ్ యూనియన్ ఏర్పాటుచేసిన గోష్ఠిలో ప్రసంగిస్తూ మనకు ఒక జాతీయ ఆహార విధానం వున్నప్పుడే దేశవ్యాపితంగా ఆహార ధాన్యాల సక్రమ పంపిణీ సాధ్యమని అన్నారు

ఆహార ధాన్యాల ఉత్పత్తి పంపిణీమీద మన ఆర్థిక వ్యవస్థ ఆధారపడివుందని మన దేశంలో ఆహార ఉత్పత్తి అధికం చేయడానికి చాలా అవకాశాలున్నాయనీ ఆయన అన్నారు

ఉత్పత్తిదార్లకు గిట్టుబాటయిన ధర లభించాలనే సూత్రాన్ని ప్రభుత్వం ఇప్పుడు మొదటిసారిగా అంగీకరించిందని చెప్పారు ఆహార ధాన్యాల కార్పొరేషన్ ఏర్పాటు అనేది ఒక రకంగా ఉత్పత్తిదార్లకు విజయం అని పేర్కొన్నారు

వ్యవసాయ ధరల కమిషన్ అనేది స్థిరమైన ఒక సంస్థ అనీ అది వివిధ ఆహార పదార్థాల ధరలను సూచిస్తుందని వివరించారు

రైతుల ఉత్పత్తికి న్యాయమయిన ధర లభించేటట్లు కార్పొరేషన్ చూడటంతో పాటు జాతీయ ఆహార ధాన్యాల నిల్వలను కూడా ఏర్పరచుతుందని అన్నారు.

ముందు రైతులకు కావలసిన ఋణాలు యిచ్చి తర్వాత వారి దగ్గరనుండి ధాన్యం తీసుకునే పద్ధతిని ముందుగా దక్షిణ కెనరా షిమోగా మధ్య మైసూరు కూర్గు జిల్లాలలో కార్పొరేషన్ అమలుజరుపుతుందనీ ఈ పథకం అమలుజరపడంలో జయప్రదం కావడానికి సహకార సంఘాలపాత్ర, సహకారం చాలా అవసరమని అన్నారు

మైసూరు కో-ఆపరేటివ్ రిజిస్ట్రార్ శ్రీ ఎ జె మనంది ప్రసంగిస్తూ కేవలం చట్టాలు చేసినంత మాత్రాన ఆహార సమస్య పరిష్కారం కాదని అన్నారు వ్యవసాయాభివృద్ధికి ఇప్పుడు ప్రభుత్వం దగరనుండి నిధులు పొందటం ఏమంత కష్టం కాదని అన్నారు.

నేపాల్ పంచవర్ష ప్రణాళిక

ఖాట్మండూ జనవరి 9

నేపాల్ జాతీయ ప్రణాళికా సంఘం నేడిక్కడ రాజు మహేంద్ర అధ్యక్షతన సమావేశమైంది పంచవర్ష ప్రణాళిక ఈ సంవత్సరం జులై నుండి అమలులోకి వస్తుంది ఇంతకు క్రితం నేపాల్‌లో 3 సంవత్సరాల ప్రణాళిక అమలు జరిపారు

ప్రస్తుత పంచవర్ష ప్రణాళిక పెట్టుబడి వ్యయం 2 వందల కోట్ల నేపాల్ రూపాయలు (భారతీయ మారకంలో 125 కోట్లు దీనిలో నూటికి 25 శాతం ప్రయాణపేటురంగం అభివృద్ధికి కేటాయించారు

తెనాలిలో 'అలంకార్ టాకీస్' ప్రారంభోత్సవం

తెనాలి జనవరి 9

తెనాలిలో నూతనముగా నిర్మించిన 'అలంకార్' సినిమా హాలుకు మొన్న ఉదయం ప్రముఖ సినీ డైరెక్టర్ శ్రీ బి యన్ రెడ్డి ప్రారంభోత్సవం చేశారు సభకు జిల్లాకలెక్టరు శ్రీ వి శ్రీనివాసాచారి అధ్యక్షత వహించారు అలంకార్ టాకీస్ పక్షాన శ్రీ తుమ్మల జగన్మోహనరావు ఈ ఉత్సవాన్ని జయప్రదం చేయటానికి తోడ్పడిన అధ్యక్షులు ప్రారంభకులు ప్రేక్షకులకు అభివందనములు తెలిపారు అనంతరం ఆహ్వానితులకు తేనీటివిందు జరిగింది సిమ్మట చాహా ప్రదర్శన జరిపారు. (వి వి)

ఐ. రా. స. నుండి అమెరికాకు సాలుకు 4 కోట్ల డాలర్ల ఆదాయం : 'ప్రావ్దా' వెల్లడి

మాస్కో, జనవరి 10

ఐ రా స కేంద్రం తమ దేశంలో వున్నందువల్ల అమెరికాకు సాలీనా 4 కోట్ల డాలర్ల ఆదాయంవస్తూవుంది ఆ ఆదాయం దృష్ట్యా అమెరికా తానే ఆ సంస్థకు ఉదారంగా విరాళాలిచ్చి కాపాడుతున్నానని చెప్పుకోవడం వట్టి బూటకమని, ప్రావ్దా పత్రిక నేడు రాసింది

ఐ రా స శాంతిరక్షణ చర్యల నే పేరుతో కాంగోలో తాము జరిపిన దారిదోపిడి చర్యలకు డబ్బివ్వనందుకు సోవియట్ యూనియన్‌ను బెదిరించడం అమెరికా కట్టిపెట్టాలి"

అమెరికా యేటేటా ఐ రా స కేంద్రం నుండి 6 కోట్ల 70 లక్షల డాలర్ల మొత్తాన్ని వివిధ వస్తువుల రూపంలో రాబట్టుకుంటూవుంది ఇంత పెద్దమొత్తాలు రాబట్టుకుంటూవున్న అమెరికా ఆ సంస్థకు చెల్లిస్తున్న వత్సర రుసుం 2 కోట్ల 40 లక్షల డాలర్లుమాత్రమే అని ఆ పత్రిక రాసింది

భారత దేశానికి ఖార్కోవ్ ట్రాక్టర్లు

మాస్కో జనవరి 9

సోవియట్‌లోని ఖార్కోవ్ ట్రాక్టర్‌ఫ్యాక్టరీ నుండి నేడు భారతదేశానికి ట్రాక్టర్లు రవాణా అయాయి భారతదేశానికి సోవియట్ ట్రాక్టర్ల ఎగుమతి చాల సంవత్సరాలుగా జరుగుతున్నా ఖార్కోవ్ ఫ్యాక్టరీ నుండి ఎగుమతి జరగడం ఇదే మొదటిసారి

భారత దేశంలోని ఉష్ణపరిస్థితులకు అనుగుణంగా నిర్మిస్తున్న ట్రాక్టర్లను ఈ ఏడాది మొత్తం 15 వందలు ఈ ఫ్యాక్టరీ ఎగుమతి చేస్తుంది.

హెచ్చించిన బోర్డింగ్ గ్రాంటు

గత జూలైనుండి అమలుకు

తూ॥గో॥ మేనేజర్ల విజ్ఞప్తి

రాజమండ్రి జనవరి 10

రాజమండ్రి శ్రీ పొట్టి శ్రీరాములు మెమోరియల్ బాలుర హాస్టలు ఆవరణముయందు శ్రీ బత్తిన సుబ్బారావు ఎం ఎల్ ఏ అధ్యక్షతను తూర్పుగోదావరిజిల్లా హరిజన హాస్టల్సు మేనేజర్ల సభ జరిగింది ఈ సభయందు ప్రధాన కార్యదర్శి ఎస్ ప్రేమనాథ్‌గారు రాష్ట్ర మేనేజర్ల కమిటీ తీర్మానములను నివేదికా పూర్వకముగా సమర్పించారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంవారు యిటీవల జారీచేసిన ఆర్డర్ (3074) హరిజనాభ్యుదయమునకు తీరని నష్టం గనుక ప్రభుత్వము దానిని రద్దుచేయించాలని తీర్మానించారు

1963 64 లో కొంతమందిద్వారా స్థాపింపబడి నడుపుచున్న నూతన వసతిగృహములకు నేటివరకు 2 సంవత్సరములైనను రికగ్నిషన్ యివ్వియుండలేదు. గనుక ప్రభుత్వంవారు తప్పక రికగ్నిషన్ యిప్పించవలసినదిగా కోరారు.

ప్రభుత్వం వారు 1-1-65 సంవత్సరం నుండి హాస్టల్ బోర్డింగ్ సబ్‌సిడీ రు 15 నుండి రు 17 లకు హెచ్చించినందుకు ధన్యవాదాలు తెలియజేస్తూ దానిని 1-7-64 నుండి యిప్పించవలసినదిగా తీర్మానించారు. (వి వి)

గ్వాలియర్, జనవరి 10

ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు బియ్యం అమ్మని కారణంగా ధాన్య వ్యాపారులు నలుగురిని అత్యవసర పరిస్థితుల చట్టంక్రింద పోలీసులు నేడిక్కడ అరెస్టుచేశారు

జూన్‌నెల మధ్యభాగంలో కామన్వెల్తు ప్రధానులసభ ఏర్పాటు చేయాలని బ్రిటిష ప్రధాని విల్సన్‌చేసిన సూచనపై మీరేమంటారు? అని విలేకరులు ప్రధాని లాల్‌బహదూర్‌శాస్త్రిని ప్రశ్నించగా ఇప్పుడు కాదు అని చెప్పి తప్పించుకొన్నారు.

* * *

వెంకట ప్రగడలో సబ్ పోస్టాఫీసుకు కృష్ణాజిల్లా పోస్టల్ సూపరిన్టెండెంటు హాథీగారి అధ్యక్షతను 4 వ తేదీన శ్రీ మాగంటి అంకినీడుగారు ప్రారంభోత్సవం చేశారు

కేంద్ర బడ్జెట్‌లో యీ యేడు రు. 86 కోట్లు లోటు

రక్షణ వ్యయం, ఆహార దిగుమతుల పెరుగుదల కారణంగా

న్యూఢిల్లీ జనవరి 10

కేంద్ర బడ్జెట్‌లో వర్తమాన ఆర్థిక సంవత్సరంలో రు 86 కోట్లు గానీ అంతకు కాస్త ఎక్కువగానీ లోటు పొందవచ్చు

ఈ కురవలా పూడ్చే వుద్దేశంతోనే గత సెప్టెంబర్ నాటికి రు. 70 కోట్ల వ్యయం తగ్గించడంజరిగినా యీలోటు తప్పనట్లుకన్పిస్తున్నది.

రక్షణ వ్యయం, ఆహార దిగుమతులు, కేంద్ర వుద్యోగుల కరువు భత్యం పెంపుదల యీ ఖర్చులన్నీ కలిసి రావడంతో యిది తప్పని సరైందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

ఈ సంవత్సరం రక్షణ వ్యయం బడ్జెట్ అంచనా రు 854 కోట్లపైన మరో 5-6 కోట్ల మేరకు వుండవచ్చునని అంచనా వేస్తున్నారు

ఆహార ధాన్యాల దిగుమతికి ప్రస్తుత బడ్జెట్ కంటే మరో 60 కోట్లు కేంద్ర ఉద్యోగుల కరువు భత్యం క్రింద రు 15 కోట్లు ఖర్చు అవుతుందని అంటున్నారు

అయితే గుప్తధనం వెలికి తీయడం ఆదాయపు పన్ను వసూళ్ను కట్టుదిట్టం చేయడం వంటి చర్యలవల్లనూ, విదేశ ఋణ సహాయంఅందే పరిస్థితి కొంతమెరుగుగా కన్పిస్తున్నందు వలనూ యీ సంవత్సరం బడ్జెట్‌ను సర్దుబాటు చేసుకోగల్గడం పెద్ద కష్టమేమీకాదని ఆశిస్తున్నారు.

చర్చా ముగింపు

(3 వ పేజీ తరువాయి)

నడిపించారు తాము పాత సమాజ వ్యవస్థను పాత సంప్రదాయాలను ఉల్లంఘించారు ఇతరులచే ఉల్లంఘింపచేశారు

ఈ నాడు వరకట్న దురాచారానికి బలి అవుతున్న యువతులలోగాని అందుకుకారకులవుతున్న యువకులలోగాని ఏమాత్రంసాంఘిక చైతన్యం కనబడటం లేదనీ ఈ దురాచారాన్ని అరికట్టడానికి ఒక ఉద్యమం నిర్మించడం సాధ్యం కావడం లేదనీ, అందుచేత ఎవరంతట వారు ఈ దురాచారాన్ని వ్యక్తిగతంగానే ఎదిరించి నిలబడి ఆత్మ గౌరవం చైతన్యం ముందు వారిలో కల్గించాలని హైద్రాబాద్ సోదరి తమ వ్యాసంలో తెలిపారు

అట్టి చైతన్యం యువతీ యువకులలో కలిగించవలసిందే అది వ్యక్తిగతంగా చేయవచ్చు కాలేజీలలో విద్యాలయంలో సామూహికంగానూ చేయవచ్చు అదే సమయంలో ఈ దురాచారానికి దోహదకరంగా ఉన్న ప్రస్తుత ఆర్థిక వ్యవస్థకు ఇతర భౌతిక పరిస్థితులకు వ్యతిరేకంగా సమాజంలోని పురోగామి శక్తులన్నిటిని కూడగట్ట వలసిన అవసరం ఉంది. కేవలం యువతీ యువకులలో ప్రబోధం కలిగించడంతోనే సరిపోదు. తల్లు లందరిలో వరకట్న దురాచారానికి వ్యతిరేక భావాలను కలిగించాలి కట్నాలు ఇవ్వను తీసుకోను అనే నిర్ణయంగావారు ప్రతిజ్ఞ చేయగల్గిన స్థితి స్త్రీలలో తీసుకొనివస్తే అది ఈ దురాచారాన్ని అరికట్టడానికి ఎంతో తోడ్పడుతుంది

అందుచేత సామాజికమైన ఒక దురాచారాన్ని ఎదుర్కొనడానికి సామూహిక శక్తితోనే, సంఘటిత కృషితోనే పూనుకోవాలి

పట్టణాలలో విద్యాధికులపరిస్థితులకుగ్రామీణ పరిస్థితులకు చాలాతేడాఉంటుంది. పెద్ద పట్టణాలలో నగరాలలో జీవితం ఒకరి కొకరికి సంబంధం ఉండదు ఎవరి గొడవ వారిది ఎవరి అభిమతం, సంస్కారం వారిది, సాంఘిక కట్టుబాట్ల స్వరూపమే లేదు అదే పరిస్థితి ఒక తాలూకా పట్టణంలో, ఒక గ్రామంలో ఉండదు క్రిందకు వచ్చేకొలదీ ఆర్థిక విధానం సాంఘిక జీవితం ఇంకా భూస్వామ్య సంస్కృతి ఫ్యూడల్ ఆచార వ్యవహారాలకు లోనై ఉంటుంది

పునర్వివాహం చేసుకోవడం లేక విడాకు లివ్వడం హైద్రాబాదులోనే తప్పుగా చూడక పోవచ్చును కాని ఒక గ్రామంలో పునర్వివాహం చేసుకోవడం ఈనాటికీ సాధ్యంకాని పరిస్థితులున్నాయి

అందుచేత నగర జీవితానికి గ్రామీణ జీవితానికి ఎంతో అంతరం ఉంది. హైద్రాబాద్ సోదరి నగర జీవితాన్ని మాత్రమే దృష్టిలో పెట్టుకొని తమ అభిప్రాయాలను, అనుభవాలను చెప్పినమాట స్పష్టం.

కాని ఈనాటికీ నూటికి 90 మందిగా ఉన్న స్త్రీలు గ్రామసీమలలోనే ఉన్నారు చిన్న చిన్న పట్టణాలలోనే ఉన్నారు. వారు విద్య నభ్యసించడమే ఒక పెద్ద సమస్య అందువల్ల గ్రామసీమలలో అనేక యిబ్బందులు ఆటంకాలు అసౌకర్యాలు. ఈనాటికిఉన్నాయి ఇప్పుడిప్పుడు హైస్కూళ్ళు మేరకు ఉచితవిద్య అవకాశం ఏర్పడటం వలన కొంతముందుకు రాగల్గుతున్నారు. అదైనా ప్రస్తుతం బాలికలుగా ఉన్న వారితరం

అంతకు ముందుతరాల యువతుల పరిస్థితి ఏమిటి? సాంఘికంగా విద్యావిషయకంగావారు ఎంతో వెనుకబడి, నేటి సమాజంలోని అభివృద్ధి నిరోధక కట్టుబాట్లకు లోబడి అజ్ఞానంలోను అంధకారంలోను ఆర్థిక పరాధీన స్థితిలోను, కుములుతున్నారు

అత్యధిక సంఖ్యాక స్త్రీలు ఇకా మన దేశంలో ఆర్థికంగా, సాంఘికంగా దాసిత్వం అనుభవించుతున్నారు. వారి నందరిని సముద్ధరించాలంటే ఒక బ్రహ్మాండమైన ఉద్యమం నిర్మించాలి

దేశం స్వాతంత్ర్యం పొందిన తరువాత స్త్రీలకు ఇదివరకులేని అనేక హక్కులు లభించిన మాట యధార్థమే కాని ఈ హక్కులు ఆచరణలో ఎంతవరకు వచ్చాయి? పరిమితంగానైనా వారసత్వం హక్కు స్త్రీలకు ఎంతవరకు అమలు జరుగుతూంది? రాజ్యాంగ చట్టం స్త్రీ పురుషుల సమానత్వాన్ని గుర్తించుతూంది ఆచరణలో ఇది ఎంతవరకు జరుగుతూంది ఇంకా ఎన్ని సాంఘిక దురాచారాల క్రిందపడి స్త్రీలు నలిగిపోతున్నారు

అందుచే కొద్దిమంది విద్యాధిక స్త్రీలు, తాము ఆదర్శవంతంగా సంస్కరణలను అమలు జరిపి ఆర్థిక స్వాతంత్ర్యం పొందినప్పటికీ అశేష స్త్రీ సామాన్యంలో అట్టి మార్పు రావాలంటే వ్యక్తిగత కృషితోపాటుఅటువంటి వ్యక్తులందరి కృషిని కేంద్రీకరించి యావత్తు సమాజంలో అట్టి పరివర్తన తీసుకురావడానికి ప్రయత్నం జరగాలి

అయితే అట్టి ఉద్యమ నిర్మాణానికి నేడు అనేక ప్రతిబంధకాలు, యిబ్బందులు ఉన్న మాట నిజం

ప్రభుత్వానికి నాయకత్వం వహించుతున్న వారు చట్టాలు చేసి పథకాలు వేసి తమబాధ్యత తీరిపోయిందనే మనస్తత్వంలో ఉన్నారు. కాని అట్టి మార్పులు ఆచరణలో తీసుకొని రావడానికివీరుప్రయత్నించడంలేదు వారుప్రయత్నిస్తారని అనుకోవడం కూడా భ్రమే.

కాని సమాజంలో ఈ మార్పులు తీసుకు రావాలనే చైతన్యదృష్టి కలినవారిలో సమైక్యభావం లేకపోవడం కూడా యథార్థమే.

అందుచేత అటువంటి పురోగామి భావాలు కల వారందరూ ఒకచోట చేరి ఇందుకు తగు కార్యక్రమాన్ని నిర్ణయించు కోవడం అవసరం, అటు సమీకృతమైన కృషి సంఘటితమైనకృషి ఎంత స్వల్పమైనదైనా ఎంత తక్కువ స్థాయిలో ఉన్నా నిరుత్సాహ పడకుండా ముందుకు సాగడమే కర్తవ్యం.

—హైశ్రీ

విముక్తి పోరాటాలకు భారత్ సమర్థన

అంతర్జాతీయ వ్యవహారాల తీర్మానంపై ప్రసంగిస్తూ స్వరణ్‌సింగ్ ఉద్ఘాటన

దుర్గాపూర్ జనవరి 10

వలసదేశాల ప్రజానీకం స్వాతంత్ర్య సాధనకు కొనసాగిస్తున్న పోరాటాలను భారతదేశం పూర్తిగా బలపరుస్తున్నదని కాంగ్రెసు మహాసభలో అంతర్జాతీయ వ్యవహారాల తీర్మానంపై ప్రసంగిస్తూ విదేశాంగ మంత్రి శ్రీ స్వరణ్‌సింగ్ ఉద్ఘాటించారు

ఇండొనీషియా ఐక్యరాజ్య సమితి నుండి ఉపసంహరించు కొనకుండా చూడాలని భారత విదేశాంగ మంత్రి శ్రీ స్వరణ్‌సింగ్ ప్రపంచ రాజ్యాలన్నింటికి నేడు విజ్ఞప్తి చేశారు

ఇండొనీషియా ఐరాసనుండి నిష్క్రమించడ ద్వారా ప్రపంచ పరిస్థితిలో కల్లోలం కలిగించిందని ఆయన అన్నారు

ఇండొనీషియావారే ఫిర్యాదులు ఏమైనప్పటికీ మానవజాతి భవిష్యత్ ఆశలు పెట్టుకొన్న ఐరాసను బలహీనపరిచే ఏ చర్యనూ ఇండొనీషియా చేపట్టరాదనికూడా ఆయన అన్నారు.

శ్రీ స్వరణ్‌సింగ్ నేడిక్కడ కాంగ్రెస్ మహాసభ బహిరంగ సమావేశంలో అంతర్జాతీయ వ్యవహారాల తీర్మానంపై ప్రసంగిస్తూ పై విధంగా అన్నారు

ఆయన తన ఉపన్యాసంలో పాకిస్తాన్ గురించి ప్రస్తావించి ప్రస్తుతం పాకిస్తాన్ ఎన్నికలు ముగిసినందువల్ల భారత - పాకిస్తాన్ దేశాలమధ్య పరస్పర విభేదాల పరిష్కారానికి తిరిగి సంభాషణలు ప్రారంభం కాగలవన్న ఆశాభావాన్ని వ్యక్తీకరించారు.

భారతదేశంతో సామరస్య పూర్వకంగా సమస్యలను పరిష్కరించుకోవాలని పాకిస్తాన్ చిత్తశుద్ధితో వాంఛిస్తేనే ఈ సంభాషణలు ఫలప్రదమౌతాయని కూడా ఆయన అన్నారు

మనం ఎంతగా వాంఛించినా పాకిస్తాన్‌తో విభేదాలను ఏకపక్షంగా పరిష్కరించ లేమని ఆయన చెప్పారు

పాకిస్తాన్‌తో నిర్యుద్ధ సంధి చేసుకోవడానికి కీ॥శే॥ జవహర్‌లాల్‌నెహ్రూ చేసిన ప్రకటనను శ్రీ స్వరణ్‌సింగ్ నేడు పునరుద్ఘాటించారు

దక్షిణ రొడీషియా గురించి ప్రస్తావిస్తూ అక్కడ అల్పసంఖ్యాకులైన బ్రిటిష్ జాతీయుల ప్రభుత్వం తనకుతానై ఏకపక్షంగా స్వాతంత్ర్యం ప్రకటించుకొంటే అది భారతదేశానికి సమ్మతం కాబోదన్నారు

దక్షిణ రొడీషియా శ్వేతజాతి ప్రభుత్వం అధికసంఖ్యాకులైన ఆఫ్రికాజాతీయులపై తాను ఏకపక్ష స్వాతంత్ర్య నిర్ణయాన్ని రుద్దజూస్తే మనం గుర్తించబోమని స్పష్టం చేయదలచుకొన్నాను అని ఆయన అన్నారు

ఇండొనీషియా - మలేషియాల వైరుధ్యం ఆగ్నేయాసియాలో ఉద్రిక్తతలను పెంచిందని ఆయన చెప్పారు.

లావోస్, కాంబోడియా దక్షిణ వియత్నాం సమస్యలు ప్రపంచ ప్రజలను తీవ్రంగా ఆలోచింపజేస్తున్నాయని మలేషియా భూభాగంపై జరుగుతున్న ఘటనలు ఆందోళనను పెంచాయనీ ఆయన అన్నారు

ఆగ్నేయాసియా సమస్యలను శాంతియుతంగా పరిష్కరించడానికి కృషి చేయాలని ఈ విషయంలో భారతదేశం తన శక్తివంచన లేకుండా కృషి చేస్తుందనీ శ్రీ స్వరణ్‌సింగ్ తెలిపారు

కాంగో సమస్య

కాంగో సమస్యను ప్రస్తావిస్తూ కాంగో అంతరంగిక వ్యవహారాలలో ఏదేశీ జోక్యాన్నీ భారతదేశం వ్యతిరేకిస్తుందని ఆయన స్పష్టీకరించారు ప్రత్యక్షంగా గానీ పరోక్షంగా గానీ అలాంటి జోక్యం కాంగో ప్రజలకు మేలు కన్నా కీడే చేస్తుందని ఆయన అన్నారు

కాంగోలో జరుగుతున్న పరిస్థితికి తన బాధను వ్యక్తీకరిస్తూ కాంగోలోని ఈ బాధామయ పరిస్థితి అంతం కావాలని ఆయన అన్నారు

కాంగోలో జాతీయ సామరస్యం కొరకు విజ్ఞప్తిచేస్తూ ఈలక్ష్యసాధనకు జరిగే ఎలాంటి ప్రయత్నాన్నైనా భారతదేశం సమర్థిస్తుందని ఆయన అన్నారు

అరబ్ దేశాలతో స్నేహసంబంధాలు

అరబ్ రాజ్యాలతో స్నేహ సంబంధాలను పటిష్టం చేసుకోవాలన్న భారత ప్రభుత్వ కాంక్షను శ్రీ స్వరణ్‌సింగ్ పునరుద్ఘాటించారు

అరబ్ రాజ్యాలతో భారత సంబంధాలు అత్యంతమైత్రీ పూర్వకంగాను సుహృద్భావం గానూ ఉన్నాయని. అరబ్ దేశాలకు ఇంకా సన్నిహితంగా వుండాలనేది భారతదేశం ఆకాంక్ష అనే ఆయన అన్నారు.

శ్రీ స్వరణ్‌సింగ్ ఇంకా ఇలా అన్నారు:

"భారతదేశం ఎల్లప్పుడూ శాంతికోసం నిలబడింది. వలసవాదం నుండి స్వాతంత్ర్యం పొందడానికి పోరాటం సాగిస్తున్న దేశాలను సమర్థిస్తూ ఎల్లప్పుడూ తన గళాన్ని విప్పి వినిపించింది. ఈ విధానం ఏనాటూ బలహీన పడదు ఏమి జరిగినప్పటికీ మన మూల విధానాలను మనం విడనాడబోము" అని అన్నారు

శ్రీ స్వరణ్‌సింగ్ అంతర్జాతీయ పరిస్థితిపై ఉపన్యసిస్తూ అంతర్జాతీయ వ్యవహారాలపై ప్రవేశపెట్టిన తీర్మానం దాదాపు అటంబాంబు చర్చలకే పరిమితమైన దన్నారు.

చైనా అణ్వస్త్ర పరీక్షద్వారా ఉత్పన్నమైన పరిస్థితిని విస్మరించరాదనీ అయితే దేశం దృష్టినీ, కాంగ్రెస్ దృష్టినీ ఆకర్షించవలసిన మరిన్ని ప్రధానమైన సమస్యలు కూడా ఉన్నాయనీ ఆయన అన్నారు.

ప్రపంచ ప్రజాభిప్రాయాన్ని ధిక్కరించి చైనా అణుబాంబు పరీక్ష జరపడం ద్వారా శాంతి లక్ష్యానికి విఘాతం కలిగించిందన్నారు. అయితే భారతదేశం ఈ పరిస్థితిని ప్రశాంతంగా ఆలోచించాలన్నారు

భారతదేశ గౌరవానికి సార్వభౌమాధికారానికి భంగకరంగాని చైనా-భారత సరిహద్దు సమస్య పరిష్కారం ఉండబోదని ఆయన ఉద్ఘాటించారు.

అంగోలా మొజాంబిక్ ప్రజాపోరాటాలకు మద్దత్తు

అంగోలా మొజాంబిక్‌లలో పోర్చుగీసు నియంతృత్వానికి వ్యతిరేకంగా కొనసాగుతున్న ప్రజాపోరాటాన్ని భారతదేశం బలపరుస్తున్నదని చెబుతూ శ్రీ స్వరణ్‌సింగ్ ఇలా అన్నారు

పోర్చుగీసు బర్బర పరిపాలనకు వ్యతిరేకంగా అంగోలా మొజాంబిక్ వీర పుత్రులు సాగిస్తున్న పోరాటాన్ని భారతదేశం సమర్థిస్తున్నది పోర్చుగీసువలసప్రాంతాల ప్రజానీకంతమ స్వాతంత్ర్యాన్ని సాధించుకొనేవరకూ మనకు విశ్రాంతి ఉండదు అని అన్నారు.

దక్షిణాఫ్రికాపై ప్రపంచ దేశాలన్నీ ఆంక్షలు విధించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

దక్షిణ ఆఫ్రికా అనుసరిస్తున్న మాలపల్లి విధానాన్ని అంతం చేయాలంటే ఆ దేశానికి ప్రపంచ రాజ్యాలన్నీ సైనిక సహాయాన్నీ, తదితర సప్లయిలనన్నింటినీ నిలుపుదల చేయడమే మార్గమని అన్నారు.

దక్షిణాఫ్రికా పట్ల ఒక పర్యాయం ఈ విధానం ప్రారంభమైతే ఆదేశం ఆఫ్రికా జాతీయుల పట్ల నాగరికతతో వ్యవహరించగలదన్నారు.

డాక్టర్ ప్రకాశ్‌చంద్ర చుందేర్ (ప బె) తీర్మానాన్ని ప్రతిపాదిస్తూ, అది తటస్థ విధానం మీదా శాంతియుత సహజీవనం మీదా సంపూర్ణ నిరాయుధీకరణ మీదా అణ్వస్త్రాల వ్యాప్తి నిరోధంమీదా భారత దేశానికి గల ప్రగాఢ వాంఛను విస్పష్టం చేస్తూందన్నారు.

ఆయన తమ ప్రసంగంలో చైనా అణ్వస్త్రం ఏర్పడడం భారతదేశానికి ప్రమాదం అంటూ ఇలా అన్నారు.

"ఈ ప్రమాదాన్ని నివారించేటందుకు ఏంచెయ్యాలో ఈతీర్మానం వివరిస్తుంది. చైనా చర్యను నిరసించవలసిందిగా ప్రపంచ ప్రజలకు విజ్ఞప్తి చేస్తుంది. నిరాయుధీకరణకు, అణుశక్తిని శాంతియుత ప్రయోజనాలకే పరిమితం చేసేటందుకు విజ్ఞప్తి చేస్తుంది

"సమస్యను అన్ని దృక్కోణాలనుంచీ, వాస్తవిక దృక్పథంనుంచీ ఆదర్శవాద దృక్పథంనుంచీ కూడ పరిశీలించాలి చైనా మనమీద ఒక అణుబాంబువేస్తే మనమూ వారిమీద ఒక అణుబాంబు వేయవచ్చు నిజమే. కాని, ఎదురుదెబ్బ తియ్యాలనే ఈ ధోరణి అనాగరికం

ప్రపంచ ప్రజాభిప్రాయాన్ని అణ్వస్త్రప్రయోగాలకు విరుద్ధంగా సమీకరించడం మంచిపద్ధతి.

"ప్రపంచంలో భారతదేశం మంచి కీలక స్థానంలో వుంది. అందుచేత చైనా మనదేశం మీద అణుబాంబు దాడి ప్రారంభిస్తే అది ప్రపంచ యుద్ధంగా మారుతుంది ఏమంటే ప్రపంచ దేశాలన్నీ దానికి సాయపడతాయి మనదేశం ఓడిపోతే ప్రపంచంలో స్వతంత్ర దేశం అంటూ మిగలదు

ఈ విషయంలో మనకి ఒకరు హామీ ఇవ్వవలసిన పనిలేదు పెద్ద యుద్ధం వచ్చినప్పుడు పెద్ద రాజ్యాలు దూరంగా కూర్చోలేవు అంతర్జాతీయ పరిస్థితులు రాజకీయాలు, రెండో ప్రపంచయుద్ధానుభవమూ మనకీ విషయాన్ని బోధిస్తున్నాయి

సాంప్రదాయక ఆయుధాలతో సైన్యబలాన్ని పెంచుకోవడం ఒక్కటే చైనా ప్రమాదానికి మంచి విరుగుడు ఆసేతు జాతీయ సమైక్యతాభివృద్ధీ కొనసాగుతూనే వున్నాయి

సరిహద్దులలో అల్లర్లురేపి, దొంగదాడులు జరిపి విచ్ఛిన్నకర శక్తుల సహాయంతో దేశంలో తమ ప్రాభవాన్ని పెంచుకోవడం చైనావారి ఎత్తు అని శ్రీ చుందేర్ అన్నారు.

ఈ సందర్భంగా పోటీ కమ్యూనిస్టుల అరెస్టులనుసమర్థిస్తున్నానని ఆయన చెప్పారు

శ్రీ అజిత్ ప్రసాద్ జైన్ (ఉ.ప్ర) ప్రసంగిస్తూ నేడు ఏ యుద్ధమూ ఒంటరిదేశాల మధ్య యుద్ధంగా జరగదనీ ఒక దేశం అణుబాంబును ఉపయోగించాక అది ప్రపంచయుద్ధంగా పరిణమించక తప్పదనీ అన్నారు

ఈ పరిస్థితులలో భారతదేశం అణ్వస్త్ర దేశాలలో ఒకటిగా అవకపోవడం వలన శాంతి శక్తులు బలపడతాయి, మనం కూడా అణుబాంబును నిర్మించాలనుకుంటే అంతర్జాతీయ ఉద్రిక్తతలకు తోడ్పడినవారమే అవుతాము

అలాగని మనం సైన్యబలాలను వృద్ధి చేసుకోవడం మానకూడదు దేశ ఆర్థిక వ్యవస్థను దృఢతరం చేసుకోవాలి పరిశ్రమలలోను వ్యవసాయంలోను వుత్పత్తి పెంచడం వలన దేశ దారిద్ర్యం తొలగడమేకాదు దేశరక్షణకు దృఢపడతాయికూడా అన్నారు

ఆసియా - ఆఫ్రికాదేశాలు కొన్ని భారతదేశానికి దూరంఅయి చైనాఅండన చేరుతూండడం విచారకరమని షామహమ్మదు (బీహార్) అన్నారు.

ఇండియా-పాకిస్తాన్ సరిహద్దు ఘర్షణలు ఉభయ దేశాలకూ నష్టకరమే అనీ పాకిస్తాన్ భారతదేశంతో సఖ్యానికి కృషి చేయాలనీ అన్నారు

శ్రీ చేతన్‌రామ్ (ఉ ప్ర) తీర్మానాన్ని సమర్థిస్తూ భారత దేశం అణ్వస్త్రసంపూర్ణ నిషేధానికి కృషిచేయవలెనన్నారు.

భారత దేశాన్ని సైనికంగా దుర్భేద్యం చెయ్యాలని శ్రీ ఉమాకాంతమిశ్రా (ఉ. ప్ర.) అన్నారు

చైనా అణుబాంబు పేల్చిన విషయాన్ని విస్మరించరాదుగాని, అది చూసి అదురుపడవలసిన అక్కరలేదు శ్రీ రఘునాథసింగ్ (ఉ ప్ర.) అన్నారు

ఆయుధ బలంకన్న మానవబలం మహత్తరం తీరా చూస్తే ఆయుధాలను రూపొందించేది మానవుడు ఆయన తలవంచ నిరాకరిస్తే ఆయన చేత తల వంచుకొన చేయగల శక్తి ఈ భూమి మీద లేదు"

అణుబాంబు విధ్వంసక ఆయుధమనీ అది దేశ రక్షణకు సాయపడదనీ ప బెంగాల్ ఆరోగ్య మంత్రిణి శ్రీమతి పూరబీ ముఖర్జీ అన్నారు.

దేశానికి వెన్నెముక ఆర్థిక బలమేననీ, ఆ విషయంలో మనదేశం వేగంగా పురోగమిస్తున్నదనీ అన్నారు

ప బెంగాల్ ప్రతినిధి శ్రీ నిమాయ్‌సాద్ చౌదరి ప్రసంగిస్తూ శ్రీ నెహ్రూ భారతదేశ విదేశాంగ విధానాన్ని నిర్ణయించేశారనీ దానిని అనుసరించడమే కర్తవ్యమనీ అన్నారు.

నిర్దిష్ట ఆహార విధానంయేర్పాటుకు మరికొంత వ్యవధి

ప్రధాని ప్రసంగం

దుర్గాపూర్, జనవరి 10

వచ్చే కొద్ది మాసాల్లో మనం తప్పనిసరిగా ఆహార దుస్థితినుండి బయటపడగలమనే విశ్వాసం తన కున్నదని ప్రధాని శాస్త్రి నేడు కాంగ్రెసు మహాసభలో చెప్పారు

ఈ సవత్సరం పంట చాలా సమృద్ధిగా వుంది గోధుమ రాబీపంట గూడా ఆశాజనకంగావుంది. మరి ఒకటి రెండు మాసాలుచేసి చూచిన తరువాత ఆహారరంగంలో మనం నిశ్చితమైన స్పష్టమైన విధానాన్ని యేర్పాటు చేసుకుంటాం అని ఆయన అన్నారు

ప్రభుత్వం ముందుగా తగినంత ఆహార ధాన్యాల నిలవలను యేర్పాటు చేసుకుంటే అప్పుడు దొంగ నిల్వదారుల అక్రమలాభార్జన పరుల ఆట కట్టించవచ్చు పరిస్థితి పుష్కలంగా వున్నా, మార్కెట్‌లో కావలసినంత బియ్యం లభించడం లేదు రైతులూ వ్యాపారస్థులూ పంటను దాచేస్తున్నారు. అయినా వారెకాలం యిలా చేయగలుగుతారు? ఇది దేశభక్తి రహితమైన జాతీయ వ్యతిరేక చర్య అని వారిని హెచ్చరిస్తున్నాను అన్నారు

ఒకటి రెండు నెలల్లో ఆహార పరిస్థితి కుదుటపడుతుంది అప్పుడు పట్టణాలకు తగుమాత్రం ఆహారం లభించే విధంగా ప్రభుత్వం కట్టుదిట్టం చేస్తుంది అని ఆయన అన్నారు

రైతులు అధికోత్పత్తి సాధన ద్వారా తమ పరిస్థితిని మెరుగుపరచుకోవాలి కోట్లాది దేశాభ్యుదయానికి గూడా తోడ్పడాలి అని ఆయన విజ్ఞప్తి చేశారు.

దేశ పారిశ్రామికీకరణ ఉద్యోగ వసతిని పెంపొందించే విధంగా వుండాలి. సాధారణ ప్రజలకు జీవితావసరాలు సమకూర్చలేని ప్రణాళికలు నిరుపయోగం అని శ్రీ శాస్త్రి అన్నారు

కాంగ్రెస్ వాదులు ముఖ్యంగా ఆ సంస్థను అభిమానించే యువకులు గ్రామసీమల్లోకి వెళ్ళి అధికోత్పత్తి సాధనకు రైతాంగాన్ని ఉత్తేజ పరచాలని ఆయన చెప్పారు

ఎ. ఐ. సి. సి.కి రు. 50 వేల విరాళం

ఆహ్వాన సంఘంచే

దుర్గాపూర్ జనవరి 10

కాంగ్రెసు మహాసభ సందర్భంలో సేకరించిన నిధిలో రు 50 వేలను ఎ ఐ సి సి కి ఆహ్వాన సంఘం నేడిక్కడ సమర్పించింది

ఈ నిధిని కాంగ్రెసు అధ్యక్షుడు శ్రీ కామరాజ్‌కు ఆహ్వానసంఘ అధ్యక్షుడు శ్రీ అజయ్ కుమార్ ముఖర్జీ అందచేశారు.

కాంగ్రెస్ మహాసభ విశేషాలు-విచిత్రాలు

దుర్గాపూర్ జనవరి 9

తీవ్రమైనచలి, కారుమేఘాలు కమ్మిన ఆకాశం అర్థంకాని భాష వీటితో కాంగ్రెసు మహాసభ గందరగోళ పూరితమైంది

• • •

కాంగ్రెసు మహాసభ మొదటి రోజు మిట్ట మధ్యాహ్నంనుంచి తండోపతండాలుగా వచ్చిన జనం మహాసభ ప్రారంభమైన మరుక్షణం నుండి తండోపతండాలుగా లేచి తిరుగుముఖం పట్టారు

• • •

కారు మేఘాలు కమ్మిన ఆకాశం చిమ్మిన చిమ్మ చీకటిని పారద్రోలడానికి కాంగ్రెసు మహాసభ నిర్వాహకులు ఎన్ని విద్యుద్దీపాలను ఏర్పాటు చేసినా ప్రయోజనం లేక పోయింది

• • •

'సమయాన్ని బట్టి రేట్లు హెచ్చింపబడును' అన్న సూక్తానికి కాంగ్రెసు మహాసభలో విఘాత మేర్పడింది. జనం తండోపతండాలుగా లేచి పోవటం మొదలెట్టగానే, కాంగ్రెసు మహాసభ నిర్వాహకులు గేట్లను బాహాటంగా తెరచి నిర్బంధాలు తొలగించి, ఎవరు బయిటి వారు లోపలకు రావచ్చునని ఆహ్వానించారు

• • •

అధిక ధరలకు నిరసనగా దుర్గాపూర్ రైల్వేస్టేషన్ ఎదుట ఫార్వర్డుబ్లాక్ వారు జరిపిన ప్రదర్శన సందర్భంలో పోలీసులు శాసన సభ్యుడు శ్రీ సిద్ధేశ్వర్ పంపన్‌తోసహా 50 మందిని అరెస్టు చేశారు.

• • •

ఈ మహాసభకు హాజరైన పాత్రికేయులు 1,20,000 పదాల ప్రెస్ టెలిగ్రాములు పంపారు

• • •

తంతి తపాలాశాఖ అధికారులు దుర్గాపూర్‌ను వివిధ నగరాలతో కలుపుతూ, టెలిఫోన్ టెలిగ్రాఫ్ కార్యాలయాలతోబాటు, ప్రెస్ యేర్పాట్లు కూడా చేశారు.

• • •

సోవియట్ యూనియన్, బ్రిటన్, జపాన్ జెకోస్లోవేకియా, అమెరికా దేశాల విలేకరులు తమ తమ పత్రికలకు 12 వేల పదాలకుపైగా తంతులు పంపారు.

తంతి తపాల శాఖ పత్రికలకోసం 14 టెలిప్రింటర్ లైన్లనుకూడా యేర్పాటు చేసింది.

'గ్రామీణ ప్రాంతాలలో ఉప పరిశ్రమలను నెలకొల్పాలి'

కాంగ్రెసు మహాసభ తీర్మానం

దుర్గాపూర్ జనవరి 10

గ్రామీణ ప్రాంతాలలో నిరుద్యోగాన్ని పరిష్కరించేందుకు ఉప పరిశ్రమలను నెలకొల్పాలని కాంగ్రెసు మహాసభలో ఆర్థిక సాంఘిక తీర్మానాన్ని ప్రతిపాదిస్తూ మద్రాసు రాష్ట్ర పరిశ్రమలమంత్రి శ్రీ ఆర్ వెంకట్రామన్ అన్నారు

చర్చజరిగిన అనంతరం కాంగ్రెస్ మహాసభ ఈ తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించింది

కాంగ్రెస్ మహాసభ నేటి మధ్యాహ్నం 3 గంటల 30 నిమిషాలకు ప్రారంభమయింది.

దేశ పారిశ్రామిక పెరుగుదలను సమన్వయ పరచాలని ఆయన అన్నారు భారీపరిశ్రమలతోపాటు ఉప పరిశ్రమలు స్థాపించడంవల్ల గ్రామీణ ప్రాంతాలలో నిరుద్యోగాన్ని నిర్మూలించడమే గాక దేశ ఆర్థిక రక్షణ పాటవాన్ని కూడ పెంపొందించగలమని ఆయన అన్నారు. పటిష్టమైన ఆర్థిక పునాది లేనిదే మన రక్షణ పాటవం బలపడదని ఆయన అన్నారు

ఐద పారిశ్రామిక కార్పొరేషన్ల ద్వారాను, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇతర సంస్థలద్వారానూ ప్రయివేటు పరిశ్రమల యజమానులు అనేక సౌకర్యాలుపొందుతున్నందున ప్రభుత్వంపై ప్రయివేటురంగానికి యేలాంటి ద్వేషమూ వుండనవసరం లేదు

నాల్గవ ప్రణాళికలో ఏడాదికి రు 4,300 కోట్ల అప్పు పెట్టుచున్నందున నిత్యజీవితావసరవస్తువుల ధరలను అదుపులో పెట్టే ఎడ తగుజాగ్రత్త వహించాలని ఆయన అన్నారు ఒకవేళ అది జరగనిపక్షంలో ఆర్థిక వ్యవస్థ తారుమారయ్యే ప్రమాదము దని హెచ్చరించారు.

మూడవ ప్రణాళికలో అనుకున్న లక్ష్యాలను సాధించనందున ఆహార పరిస్థితి క్లిష్ట రూపం ధరించిందని ఆయన అన్నారు నాల్గవ ప్రణాళికలో 12 కోట్ల టన్నుల ఆహారోత్పత్తి సాధన లక్ష్యంగా పెట్టుకున్నామని అది సాధించగలిగితే ఆ సమస్య పరిష్కారం కాగలదని ఆయన అన్నారు

ఆహార ధాన్యాల పంపిణీలో ప్రయివేటు వాణిజ్యం ఎత్తివేయాలని ఆయన అన్నారు

శ్రీ హెచ్ ఎన్ బహుగుణ (ఉ ప్ర) తీర్మానాన్ని సమర్థిస్తూ నెహ్రూ ఆర్థిక ఆశయాలు వాస్తవరూపం దాల్చేందుకు ఇది మరొక అడుగు ముందుకు వేస్తున్నదని అన్నారు ఈ తీర్మానాన్ని అమలుపరచే పక్షంలో ఆహార సమస్య పరిష్కారమవుతుందని ప్రజాస్వామ్య సోషలిజానికి ఇది ప్రాతిపదిక కాగలదని ఆయన అన్నారు

శ్రీ ఆర్ ఎన్ తివారి (ఉ ప్ర) ఒక సవరణ ప్రతిపాదిస్తూ చిన్న రైతులను అలక్ష్యం చేయటం జరిగి దని మేలు రకం విత్తనాలను తదితర సౌకర్యాలను వారికి కల్పించాలని డిమాండ్ చేశారు

శ్రీ జె ఎన్ శాహూ (బీహారు) ప్రసంగిస్తూ వ్యవసాయోత్పత్తిని పెంచేందుకై రైతులకు మరింత ప్రోత్సాహం ఇవ్వాలని అన్నారు.

శ్రీ ఎమ్ ఎస్. పాండే (ఉ ప్ర) ప్రసంగిస్తూ దారిద్ర్యాన్ని తొలగించడమే కాంగ్రెసు లక్ష్యమైన సంక్షేమ రాజ్యాన్ని సాధించటం అసంభవం అని హెచ్చరించారు

శ్రీ అగల్‌సింగ్ (ఉ ప్ర) ప్రసంగిస్తూ ఆహారధాన్యాలను సక్రమంగా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

మతసామరస్యంపై కామరాజ్, శాస్త్రిగార్లతో ముస్లింకాంగ్రెస్‌వాదుల చర్చ

దుర్గాపూర్ జనవరి 9

ప్రముఖ ముస్లిం కాంగ్రెసువాదులు పలువురు నేడిక్కడ కాంగ్రెసు అధ్యక్షుడు కామరాజ్ ప్రధాని శాస్త్రి గార్లను కలుసుకొని, దేశంలోని మతసామరస్య సమస్యపై చర్చలు జరిపారు కేంద్రహోంమంత్రిశ్రీనందాకాంగ్రెస్ కార్యవర్గసభ్యులు శ్రీ ఫక్రుద్దీన్ అలీ అహ్మద్ గార్లు కూడా ఆ చర్చలో పాల్గొన్నారు

రాజమండ్రి ప్రెస్‌వర్కర్సు యూనియన్

రాజమండ్రి జనవరి 8

రాజమండ్రి ప్రెస్ వర్కర్సు యూనియన్ కార్యవర్గ సమావేశం మొన్న జిల్లా లేబర్ యూనియన్ కార్యాలయంలో శ్రీ దొడ్డి సింహాద్రిగారి అధ్యక్షతను జరిగింది

1965 ఫిబ్రవరి 21 వ తేదీన ప్రెస్ వర్కర్సు యూనియన్ 12 వ వార్షిక మహాసభను జరుపుటకు మహాసభకు వర్కర్సు వద్ద 0-50 న పైసల చొప్పున విరాళం వసూలు చేయుటకు నిర్ణయించారు.

యు-2 కూల్చివేత

చైనా వైమానిక దళాలచే

పెకింగ్ జనవరి 10

చైనా సరిహద్దులను అతిక్రమించి ఉత్తర చైనా భూభాగంపై ఎగురుతున్న అమెరికా నిర్మిత యు-2 విమానాన్ని చైనా వైమానిక దళాలు నేటిరాత్రి కూల్చివేశాయి

చాంగ్‌కైషేక్ ముఠా ఈ విమానాన్ని చైనా భూభాగంపైకి పంపిందని నవచైనా వార్తాసంస్థ తెలిపింది,

ఇంతవరకు చైనా వైమానిక దళాలు నాలుగు యు-2 విమానాలు కూల్చివేశాయి

'సరైన విప్లవకర చర్య'

ఐ రా స నుండి జకార్తా నిష్క్రమణపై చైనావ్యాఖ్య

హాంకాంగ్, జనవరి 10

ఇండొనీషియా ఐ రా స నుండి వైదొలగడం న్యాయమైన సరైన విప్లవ చర్య" అంటూ చైనా ప్రభుత్వం నేడు అధికారయుతంగా వ్యాఖ్యానించి ది

ఈ వ్యాఖ్యను నవచైనా వార్తాసంస్థ విడుదల చేసి ది

ఇండొనీషియా ప్రజలను సంబోధిస్తూ చేసిన ఆ ప్రకటనలో యీ విధంగా వుంది

65 కోట్ల మంది చైనీయులు ఇండొనీషియన్ సోదరులు తీసుకున్న యీ చర్యను హర్షిస్తున్నారు

మీరు సరైన పని చేశారు; సరైన పద్ధతిలో చేశా —

మలేషియా సమూహం మీకూ యావత్తు ఆగ్నేయాసియాకూ పక్కలోబల్లెం సామ్రాజ్యవాదులు యీ ప్రమాదాన్ని తెచ్చిపెట్టారు అరబ్ ప్రపంచానికి ఇజ్రాయిల్‌నూ, ఆఫ్రికా రాజ్యాలకు దక్షిణాఫ్రికా వేదనను కల్పించిన రీతిలోనే యీ పని చేశారు

"అంతర్జాతీయ సహకారానికి ఐ రా స ఒక్కటే వేదిక అని వాదించడం కేవలం బూటకం ఆసియాకు సంబంధించిన ప్రముఖ సమస్యలన్నీ ఆ సంస్థ వెలుపలనే పరిష్కారమౌతున్నవి

ఐ రా స లో చైనాకు సభ్యత్వం లేదు; ఇండొనీషియా ఆ సంస్థనుండి విరమించుకున్నది. కాగా ఐ రా స ప్రతిపత్తి యేమిటిగా వుంటుందో అన్ని దేశాలూ తీవ్రంగా యోచించాలి. ఐ రా స నిర్ణయాలు అనుల్లంఘనీయమనీ యేమీకాదు ఆ సంస్థ లేకపోయినంత మాత్రాన మరేమీ మునిగిపోదు"

దుర్గాపూర్ కాంగ్రెసు మహాసభ సమాప్తం

దుర్గాపూర్, జనవరి 10

కాంగ్రెస్ 69 వ మహాసభ నేడిక్కడ సాయంత్రం 6 15 గంటలకు సమాప్తమైంది

భారత జాతీయ కాంగ్రెసు 69 వ మహాసభ నేడిక్కడ ఆర్థిక తీర్మానం ఆమోదించటంతో సమాప్తమయింది. వ్యవసాయోత్పత్తిని పెంచాలని, గ్రామీణ ప్రాంత అభివృద్ధిపై కేంద్రీకరించాలని ఆ తీర్మానం నొక్కిచెప్పింది

జమ్ము, కాశ్మీరు రాష్ట్రానికికూడ కాంగ్రెస్ కార్యకలాపాలను విస్తరింపచేస్తూ కాంగ్రెసు మహాసభ తీర్మానించింది.

నేటి సమావేశంలో శ్రీమతి ఇందిరాగాంధి బెంగాలీలో ప్రసంగిస్తూ కాంగ్రెసు పార్టీ సందేశాన్ని దేశం నలుమూలలకూ తీసుకు వెళ్ళవలసిందిగా కాంగ్రెసు వాదులకు విజ్ఞప్తి చేశారు.

ప్రధాని శాస్త్రి ప్రసంగిస్తూ సోషలిజం లక్ష్యాన్ని సాధించేందుకై అందరూ సమష్టిగా గట్టి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

చర్చల అనంతరం జనగణమన గేయం పాడటంతో "జైహింద్" అనేనినాదాల మధ్య మహాసభ సమాప్తమయింది.

పౌర ప్రభుత్వానికి నిర్బంధితుల అప్పగింత

సైగాన్ జనవరి 10

డిసెంబరు 20 వ తేదీన తాము నిర్బంధించిన ఉన్నతాధికార జాతీయసమితి సభ్యులు ఏడు గురిని సైనికాధికారులు నేడు దక్షిణ వియత్నాం పౌర ప్రభుత్వాధికారులకు అప్పగించారు.

కాశ్మీర్‌ను విముక్తి చేస్తానని పాక్ కొండజాతి నాయకుని ప్రగల్భాలు

కరాచీ, జనవరి 11

"భారత ఆక్రమిత కాశ్మీర్‌ను విముక్తి చేయడానికి గెరిల్లా పోరాటంలో ఆరితేరిన 25 లక్షల మంది కొండజాతి ప్రజల్ని నడపగల శక్తి తనకు వున్నదని కొండజాతి నాయకుడు మాలి ఇస్పన్‌గల్ నేడు ముజఫరాబాద్‌లో అన్నారు

భారత ఆక్రమిత కాశ్మీర్ విముక్తికి కరాచీ ప్రభుత్వంకానీ పాక్ ఆక్రమిత కాశ్మీర్ ప్రభుత్వ కానీ అడ్డురాకూడదని అన్నారు

భారత ఆక్రమిత కాశ్మీర్ విముక్తికిగల అవకాశాలన్నింటిని పాకిస్తాన్ పరిశీలిస్తున్నదని కమ్యూనికేషన్‌శాఖమంత్రి శ్రీ ఖాన్ రావల్పిండిలో అన్నారు.

కాశ్మీర్ విముక్తికి అయూబ్‌ఖాన్ అనుసరిస్తున్న విధానాన్ని కొనసాగించగ దానికి అయన్ను గెలిపించటం ద్వారా పాక్ ప్రజలు తమ ఆమోదాన్ని తెలిపారని అన్నారు.

33 సీట్లకు లీగు పోటీ

తిరుగుబాటుకాంగ్రెస్‌తో ఎన్నికల పొత్తు

కాలికట్ జనవరి 10

కేరళలో జరుగనున్న జనరల్ ఎన్నికలలో ముస్లింలీగు 33 స్థానాలలో పోటీచేయటానికి నిర్ణయించింది నేడిక్కడ సమావేశమయిన ముస్లింలీగు పార్లమెంటరీ బోర్డు ఈ నిర్ణయాన్ని తీసుకొంది రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ రెహమాన్ బహాఫకి తంగళ్ ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు

తిరుగుబాటు కాంగ్రెసు వాదులు ఏర్పాటు చేసిన కేరళ కాంగ్రెసు అభ్యర్థులను బలపరచేదుకు కూడ ముస్లిం లీగు నిర్ణయించింది

కేరళ కాంగ్రెస్ ముస్లింలీగు పార్టీల అభ్యర్థుల ఎంపికను నియోజక వర్గాల కేటాయింపు జరిగిన తరువాత నిర్ణయించుకుంటామని లీగు ప్రతినిధి ఒకరు తెలియజేశారు

కరవు భత్యం వెంటనే పెంచాలి

ప్రభుత్వ నిష్క్రియను నిరసిస్తూ ఎన్ జి వో సంఘాధ్యక్షుని ప్రకటన

హైదరాబాద్ జనవరి 11

జీతాల కమీషన్‌ను వేసామని ఉత్త వాగ్దానాలతప్ప ప్రభుత్వోద్యోగుల దుర్భర పరిస్థితులను పరిష్కరించేటందుకు ప్రభుత్వం ఏమిచేయ లేదని ఆం. ప్ర. ఎన్. జి. వో.ల సంఘాధ్యక్షులు శ్రీ పి. శ్రీరాములుగారు ప్రకటన చేశారు.

1964 అక్టోబరులో 5 రూ. లు. పెంచారు గాని ధరల పెరుగుదల దృష్ట్యా అది ఏ మూలకూ చాలదని ఆయన అన్నారు.

జీతాల కమిషన్‌ను నియమిస్తామంటూ వాగ్దానం చేసి మూడు నెలలు గడిచినా ఇంత వరకు అసలు జరగలేదనిచెప్తూ దీనిని చూస్తే వుద్యోగుల ఇబ్బందులు ప్రభుత్వానికి పట్టలేదను కోవలసివుందని కేవలం ఆశలు చూపుకొని ఎంతో కాలం జీవించ గలగడం సాధ్యం గాదనీ ఆయన అన్నారు

వెంటనే ప్రభుత్వం దాస్ కమిషన్ సూచనలను అమలు జరిపి కరవు భత్యం పెంచాలనీ ఆయన తెలిపారు వుద్యోగులు ఆందోళన చేసి ఉద్యమాలకు దిగకుండా వుండాలంటే కనీసం ఈ మాత్రమయినా చేయాలనీ ప్రభుత్వం త్వరపడక పోతే పరిస్థితులు విషమిస్తాయని అందుకు ప్రభుత్వమే బాధ్యతను వహించవలసి వస్తుందనీ అన్నారు.

విద్యుత్కార్మికుల రిట్రెంచిమెంటు

శ్రీ జె. వి నరసింగరావు సమర్థన

హైదరాబాద్, జనవరి 7

ఆంధ్రప్రదేశ్ విద్యుచ్ఛక్తి వర్క్‌షాపు ఆఫీసర్లు అందగొండ్రుని వారు బయటివర్క్‌షాపులకు పనులు వప్పచెప్పి విద్యుచ్ఛక్తి వారి వర్క్‌షాపునూ, దానిలోని పనివారినీ ఖాళీగా వుంచడంచేతనే నష్టం వస్తూందిగాని దానికి కార్మికుల బాధ్యత లేదంటూ ఆంధ్ర విద్యుచ్ఛక్తి కార్మిక సంఘాధ్యక్షులు శ్రీ వి. ఎస్ మహదేవసింగ్ చేసిన ప్రకటనను ఖండించేటందుకు ఆంధ్రప్రదేశ్ విద్యుచ్ఛక్తి బోర్డు అధ్యక్షులు శ్రీ జె. వి. నరసింగరావు పత్రికా విలేకరుల సభ జరిపారు కాని విలేకరుల ప్రశ్నలకాయనవద్ద సమాధానాలులేక తయారు చేసుకువచ్చిన ప్రకటన యివ్వడంతో సంతృప్తి పడవలసి వచ్చింది.

1953 కు పూర్వంనుండి వుద్యోగాలలో వుండి 15 మొదలు 25 ఏళ్ళవరకూ సర్వీసుగల 247 మంది పనివారి తొలగింపును గురించిన ప్రశ్నల కాయన దిగాలు పడ్డారు

విద్యుచ్ఛక్తిబోర్డు వర్క్‌షాపుకి తగని పని యిచ్చామా,బయటివర్క్‌షాపుల కెంతపని వప్పచెప్పారన్న ప్రశ్నకు ఆయనవద్ద సమాధానం లేదు పనులెగకొట్టి క్రమశిక్షణకు విరుద్ధంగా కార్మికులు ప్రవర్తించారని ఆరోపించినప్పుడు, అటువంటివారిమీద చర్య ఏల తీసుకోలేదు పనివారిచేత పనులు చేయించలేకపోయిన ఆఫీసర్లమీద ఏల చర్యలు తీసుకో లేదని ప్రశ్నించగా శ్రీ నరసింగరావు సమాధానం ఇవ్వలేకపోయారు.

క్రమశిక్షణనమలు జరపబోయిన ఆఫీసర్లను పనివారు కొట్టబోయారని ఆయన పదే పదే చెప్పబోయారు

తప్పు, చేసిన కార్మికులమీదచర్య తీసుకోలేక పోవడం ఆఫీసర్ల చేతగానితనంగా ఒట్టుదిపరకు ఒప్పుకుంటూనే చేసేది లేక ఎలక్ట్రికల్ బోర్డు కార్మికులను రిట్రెంచి చేయవలసి వచ్చిందని శ్రీ నరసింగరావు అన్నారు.

ప్రస్తుతం పనివారి సంఖ్య ఎక్కువగా వున్నదని వారిని ఇతర వుద్యోగాలకు మార్చాలనుకొంటున్న సమయంలో పారిశ్రామిక కోర్టు తీర్పు తమకు బంధం వేసిందనీ చేసేది లేక రిట్రెంచిమెంటుకు పూనుకోవలసి వచ్చిందనీ ఆయన అన్నారు

పత్రికా విలేకరులతో శ్రీ నరసింగరావు మాట్లాడేటప్పుడు ఎలక్ట్రికల్ బోర్డుకు చెందిన ఒక వుద్యోగికూడా ఆయనతో వున్నారు, పని వారిచేత పని చేయించలేక పోయిన ఆఫీసర్లైనా 300 గురు పనివారిలో 247 మంది అనవసరంగా వున్నారని రిపోర్టువిచ్చి రిట్రెంచిమెంటుకు సలహాయిచ్చినదని ఒక విలేకరి ప్రశ్నించగా ఆ అధికారికి కోపం వచ్చింది. అయితే శ్రీ నరసింగరావు రిపోర్టు యిచ్చినది చీఫ్ ఇంజనీర్లని చెప్పారు.

ఆటంబాంబులకంటె అధికోత్పత్తిముఖ్యం

శ్రీమతి ఇందిరాగాంధి ఉద్ఘాటన

దుర్గాపూర్ జనవరి 11

దేశంలో ఆటంబాంబులను తయారు చేయటంకంటే పొలాల్లోను, కర్మాగారాల్లోను అధికోత్పత్తికై కృషిచేయటం ఎంతేని అవసరమని కేంద్ర రేడియో, సమాచారశాఖమంత్రి శ్రీమతి ఇందిరాగాంధి నిన్న సాయంత్రం ఆర్థిక సాంఘిక విధానం తీర్మానంపై చర్చ సందర్భంలో 69 వ కాంగ్రెస్ మహాసభలో ప్రసంగిస్తూ అన్నారు

ఈ విషయ నిర్ణయసభ ఆమోదించిన ఆర్థిక సాంఘిక తీర్మానాన్ని శ్రీమతి గాంధీ సమర్థిస్తూ అటంబాంబులను తయారు చేయటం వల్ల, ఏవిధంగాను ఉపయోగపడదని చెప్పారు

చైనా సవాలును క్రమశిక్షణతో కష్టించి కృషిచేయటంద్వారా మాత్రమే ఎదుర్కొనగలమని అన్నారు

ఆహార పదార్థాలను వివిధ రకాలయిన వస్తువులను మరింతగా ఉత్పత్తిచేయటానికి ప్రజలు ఉత్సాహం చూపేటట్లు కృషిచేయాలనీ ప్రజలందరు ఏ మహత్తర ఆశయాలు లేనిదే లక్ష్యాలు నెరవేరవని అన్నారు జాతీయ పునర్నిర్మాణం ఒక పెద్ద సవాలువంటిదని అందుకు ప్రతిఒక్కరూ కష్టించి పనిచేయాలని చెప్పారు

గడచిన 17 సంవత్సరాలనుండి ప్రజలు పరస్పర సహకారభావంతో పనిచేసి వున్నట్లయితే దేశ స్వరూపం ఈనాడు మరొకవిధంగా వుండేదని ఆమె అన్నారు.

భారతదేశ రాజకీయ సాంస్కృతిక పునరుజ్జీవనానికి బెంగాల్ చేసిన కృషిని శ్రీమతి ఇందిరా గాంధీ ప్రశంసిస్తూ దుర్గాపూర్ మహాసభ నవభారత నిర్మాణానికి నూతనోత్తేజాన్ని వారికి ఇవ్వగలదన్న ఆశాభావాన్ని వ్యక్తపరచారు

జపాన్ ప్రధాని అమెరికా రాక

కాన్‌ఫ్రాన్సిస్కో జనవరి 10

అమెరికాలో అధికార పర్యటన జరిపేందుకు జపాన్ ప్రధాని ఇసాకూ సాటో నేడిక్కడికి ప్రత్యేక విమానంలో వచ్చారు

సాటోతోబాటు జపాన్ విదేశాంగమంత్రి కూడా వచ్చారు.

అధ్యక్షుడు జాన్సన్‌ను కలుసుకునేందుకు సాటో రేపు వాషింగ్టన్‌కు బయలుదేరి వెళతారు

ఉభయ దేశాల మధ్యగల సంబంధాలను మరింత బలపర్చుకోవడానికి ఉభయుల సమస్యలను ఒకసారి సమీక్షించుకోవటం అవసరమని ఒక ప్రకటనలో అన్నారు

ఆగ్నేయాసియాలో అమెరికా వైఖరి ఏమిటో జాన్సన్ తనకు స్పష్టం చేస్తారని ఆశిస్తున్నానని అంతకుముందు విమానాశ్రయంలో పత్రికల వారితో మాట్లాడుతూ అన్నారు.

కరాచీలో విద్యాలయాలు తెరచేందుకు నిర్ణయం

కరాచీ జనవరి 10

విద్యార్థుల సమ్మె ఫలితంగా మూతబడిన కరాచీ విద్యాలయాలు రేపటినుంచి తిరిగి తెరవబడతాయని నేడొక అధికార ప్రకటన వెలువడింది. అయితే కళాశాలలు మాత్రం ఇంకా మూసివేసే వున్నాయని ఆ ప్రకటన తెలుపుతోంది

ప్రభుత్వ అధికార ప్రకటనపై విద్యార్థుల కార్యాచరణ సమితి వ్యాఖ్యానించేస్తూ తమ కోర్కెలు ఆమోదించేవరకు సమ్మె విరమించేదిలేదని ఖచ్చితంగా తెలిపింది

శుక్రవారంనాడు రావల్పిండిలో విద్యార్థుల మీద జరిపిన లాఠీ ఛార్జీని అరెస్టులను ఖండించింది

ట్యూషన్ ఫీజులను తగ్గించాలని, విద్యార్థి నాయకులందరినీ విడుదల చేయాలనీ యూనివర్సిటీలపై ఆంక్షలు పెడుతూ విధించిన ఆర్డినెన్సును రద్దుచేయాలనీ కార్యాచరణ సమితి డిమాండ్ చేసింది.

తిరువనంతపురం టీచర్లచే పని నిలుపుదల సమ్మె

తిరువనంతపురం జనవరి 11

నెలకు 25 రూపాయల తాత్కాలిక కరువు భత్యం ఇవ్వాలనీ, వేతన కమిషన్‌ను నియమించాలనీ డిమాండు చేస్తూ తిరువనంతపురంలోని 70 ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు నేడు పని నిలుపుదల సమ్మె చేశారు.

21 వేల సభ్యత్వం కలిగివున్న ప్రభుత్వ ప్రైమరీ ఉపాధ్యాయ సంఘం పిలుపు నందుకొని ఈ సమ్మె ప్రారంభించారు

ప్రైమరీ సెకండరీ స్కూల్స్ ఉపాధ్యాయులు నేడు నల్లబాడ్జీలు ధరించి క్లాసులకు వెళ్ళారు

తిరువనంతపురం గ్రాడ్యుయేట్ టీచర్సు కూడా ఈ సమ్మెలో పాల్గొన్నారు.

ప్రభుత్వం బెదిరింపు

ఉపాధ్యాయులు తలపెట్టిన ఈ సమ్మె క్రమశిక్షణా రాహిత్యచర్య అని ప్రభుత్వం నిన్న ఒక ప్రకటనలో బెదిరించింది.

వైద్యఉద్యోగులసమ్మె

(1వ పేజీ తరువాయి)

ఇంది దారు

పనివారల సమస్యలను వెంటనే పరిష్కరించవలసి దిగా కోరుతూ వైద్యశాఖ డైరెక్టరుకు ఆరోగ్యశాఖ మంత్రికి కార్మికశాఖ మంత్రికి యూనియన్ తరఫున టెలిగ్రాములు పంపారు. పనివారల ఆందోళనా కార్యక్రమాన్ని బలపరుస్తూ రు 10 లు విరాళం పంపారు

ప్రభుత్వ వైఖరికి గుంటూరు తాలూకా కమ్యూనిస్టు కమిటీ నిరసన

గుంటూరు వైద్య ఉద్యోగుల కోర్కెలను బలపరుస్తూ ప్రభుత్వం వెంటనే జోక్యం కల్పించుకొని పనివారల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రభుత్వ ఆదేశాలను సైతం అమలు జరిపించుకోటానికి ఉద్యోగులు ఈ విధంగా ఆందోళనా కార్యక్రమాలను చేపట్ట వలసిన దుస్థితిని కల్పించిన ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ గుంటూరు తాలూకా కమ్యూనిస్టు కమిటీ నిన్న సమావేశమై తీర్మానించింది

దేశరక్షణచట్టం క్రింద పోటీపార్టీ వారిని దేశవ్యాపితంగా అరెస్టు చేయటాన్ని ఖండిస్తూ కమిటీ సమావేశం తీర్మానించింది. రేపల్లె తాలూకా కమ్యూనిస్టు నాయకులు శ్రీ వెంకట్రామయ్య మరణంపట్ల సంతాపం ప్రకటిస్తూ, వారి కుటుంబానికి సానుభూతి వ్యక్తంచేస్తూ కమ్యూనిస్టుకమిటీ సమావేశం మరోతీర్మానం చేసింది.

తాలూకా కమ్యూనిస్టు కమిటీ ఈ రెండు రోజుల సమావేశంలో పార్టీ నిర్మాణ, ప్రజా ఉద్యమాలు, ఆర్థిక పరిస్థితిని గురించి వివరంగా చర్చించింది.

శ్రీ తాపీ ధర్మారావుగారి స్వస్థత

హైదరాబాద్, జనవరి 11

నిన్న అస్వస్థత చెందిన శ్రీ తాపీ ధర్మారావు గారు ఇప్పుడు క్రమంగా కోలుకుంటున్నారు

వాంతులు తీవ్ర జ్వరంతో నిన్న అస్వస్థత చెందారు.

'పోటీ కమ్యూనిస్టు పార్టీపై నిషేధం ఉండదు'

ఐ పి ఎ విలేకరి కథనం

దుర్గాపూర్ జనవరి 9

"కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ పోటీ పార్టీని గురించి చర్చించింది కాని ఆ పార్టీని నిషేధించాలనే పథకం లేదు అని ఐ పి ఎ. విలేకరికి కాంగ్రెస్ అధిష్ఠాన వర్గ సభ్యులొకరు చెప్పారు.

హోంమంత్రి నందా ప్రసంగ పాఠాన్ని ప్రతినిధులకు పత్రికలకు పంచిపెట్టారు శుక్రవారంనాడు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో హోంమంత్రి ఈ విషయమై చర్చించారు

పోటీ కమ్యూనిస్టుల ఎన్నికల ప్రచారం

త్రిచూర్ జనవరి 10

పోటీ కమ్యూనిస్టుపార్టీవారు నేడిజిల్లాలో పెద్ద ప్రదర్శనంతో తమ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. శ్రీ ఇ ఎం ఎస్ నంబూద్రిపాద్ దానిని ప్రారంభించారు ఆయన నాయకత్వాన వేలాది ప్రజలు-స్త్రీ పురుషులు జండాలు చేతబట్టి నగరంలోని ప్రధాన వీధుల గుండా ప్రదర్శనలు జరుపుతూ పూరేగింపు నడిపారు.

నాయకుల అరెస్టులను ఖండిస్తూ పూరేగింపులో నినాదాలనిచ్చారు.

నంబూద్రిపాద్ లేఖ

(1 వ పేజీ తరువాయి)

నాయకుల కుటుంబాలు ఎదుర్కుంటున్న బాధలూ ఇబ్బందులూ గురించి కేరళ గవర్నరుకు తెలియబరచానని ఆయన అన్నారు

ఈ విషయమై జైలులోని నాయకులుకూడా కొందరు వ్రాశారని ఆయన అన్నారు

నాయకుల విడుదలకై త్రివేండ్రంలో సభ

త్రివేండ్రం జనవరి 11

నిన్న సాయంకాలం త్రివేండ్రం పట్టణ వీధులలో పోటీ కమ్యూనిస్టుపార్టీ వలంటీర్లు తమ నాయకుల విడుదలకు డిమాండు చేస్తూ పూరేగింపు జరిపారు.

తరువాత పూరేగింపు ఒక బహిరంగ సభతో ముగిసింది. శ్రీ ఏ. కె. గోపాలన్ షష్టిపూర్తి వుత్సవం జరిపేటందుకు లక్ష రూపాయల నిధి పోగుచేయదలచినట్లు సభలో ప్రకటించటం జరిగింది.

మొదటి బహుమతి

రు. 110000 !

21-2-65 న జరగబోవు ఒరిస్సా లాటరీలో ఇంకా 1031 ఇతర పెద్ద బహుమతులు కలవు ఒక టికెట్టు రు 1-, పది టిక్కెట్లు రు 9/- లు మాత్రమే వెంటనే టిక్కెట్ల ఖరీదు దిగువవారికి పంపండి

జాన్ పనాచికల్, కొచ్చిన్-2

టెండరు నోటీసు

కృష్ణాజిల్లా నందిగామ తాలూకా నందిగామ పంచాయితీ యీ దిగువ చూపబడిన పనుల దాఖలా రోడ్డుపనులు వగైరాలకు ది 20-1-65 వ తేదీన సాయంత్రము 3 గంటలకు సదరు పంచాయతీ ఎగ్జిక్యూటివు ఆఫీసరుగారిచేగాని లేక వారిచే అనుమతి పొందిన మరియొకరిచేగాని టెండర్లు తీసుకొనబడును

పని వివరములు

1. 12 గ్రానైటు మెటల్‌రోడ్లు ఎస్టిమేట్లమొత్తం రు 23210 ధరావతు నూటికి రు 5 చొప్పున,
2. కల్వర్టు కొద్దులకు టయిర్లు ట్యూబులు సప్లయి చేయుట (ADV 500 19 1ype) ధరావతు 50

(సం) డి వి సింహాద్రిరావు
ఎగ్జిక్యూటివు ఆఫీసరు
నందిగామ పంచాయితీ కార్యాలయము
8—1—65

సభాధిక్కార నేరానికి శిక్ష విధించే హక్కు

శాసనసభలకు ఉండాలనేది మన రాజ్యాంగ నిర్ణేతల అభిప్రాయమని శ్రీ హుకుమ్ సింగ్

బొంబాయి, జనవరి 11

సభను ధిక్కరించిన నేరానికి పార్లమెంటుగాని శాసనసభగాని ఒక పౌరుని శిక్షిస్తే ఈ తీర్పును నిలిపివేయడానికిగానీ లేదా రద్దు చేయడానికిగానీ కోర్టులకు హక్కులేదనేది భారత రాజ్యాంగ రూపకర్తల అభిప్రాయమని లోక్‌సభ స్పీకర్ శ్రీ హుకుమ్‌సింగ్ నేడిక్కడ అన్నారు

ఈ అంశాన్ని రాజ్యాంగంలోని 194 (3) నిబంధనలో వ్యక్తంచేయవలసివుందని అన్నారు "కొత్తగాగానీ, అధికంగాగానీ మనం ఏమీ కోరటంలేదు" అని ఆయన చెప్పారు.

సభాధిక్కార నేరానికి ఒక పౌరుని శిక్షించే హక్కు పార్లమెంటుకుగానీ శాసనసభకుగానీ ఉందా? లేదా అనే విషయంలో సుప్రీంకోర్టు తెలిపిన అభిప్రాయం కొన్ని విధాల బాగుండలేదనీ, అభిప్రాయ సమర్థనకు అనేక వాదాలు చేస్తే చేయ వచ్చుననీ అన్నారు

శాసనసభ స్పీకర్ల సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ సుప్రీంకోర్టు వెలిబుచ్చిన అభిప్రాయంవల్ల శాసనసభల హక్కులకు అప్పుడే కోత పడిందని అన్నారు. సుప్రీంకోర్టు తన అభిప్రాయం వెలిబుచ్చటంలో శాసన సభలను ధిక్కరించే పనిని కొందరు ప్రదర్శించే సూచనలు దేశంలో కన్పిస్తున్నాయని అన్నారు

"మన న్యాయశాఖ గౌరవానికి అధికారానికి భంగం కలిగించే ఏ చర్యనూ మనం చేయబోము చేయాలనేది మన తలంపు కాదు నిజానికి న్యాయ స్థానాల ప్రతిష్ఠను ఇనుమడింప చేయాలి అని అన్నారు

భారత రాజ్యాంగం 105, 194 నిబంధనల లోని అంశాలను గురించి శ్రీ సింగ్ వివరిస్తూ బ్రిటన్ దిగువ సభకు ఉన్న అధికారాలు హక్కులే మన శాసన సభలకు ఉండాలనేదే మన రాజ్యాంగ నిర్ణేతల అభిప్రాయమని అన్నారు

సభాధిక్కరణ నేరానికి కోర్టులతో నిమిత్తం లేకుండానే సభకు వారెంటు జారీచేసే హక్కు కూడా వుండాలనేదికూడా రాజ్యాంగ నేతల అభిప్రాయమని అన్నారు.

1950 లో జరిగిన శాసనసభ స్పీకర్ల మహాసభలో శ్రీ జి వి మవలాంకర్ మాట్లాడుతూ మన పార్లమెంటు శాసనసభల హక్కులు, అధికారాలు బ్రిటన్ దిగువసభ అధికారాలతో సమానమైనవని పేర్కొన్న సంగతిని గుర్తుచేసారు

రాజ్యాంగ సభలో డాక్టర్ అంబేద్కర్ ఈ నిబంధనలగురించి మాట్లాడుతూ సభాధిక్కార నేరానికి ఒక పౌరుని పార్లమెంటుగానీ, శాసన సభగానీ శిక్షిస్తే దానిని నిలిపే అధికారంగానీ రద్దుచేసే అధికారంగానీ కోర్టులకులేదని స్పష్టం చేశారని హుకుం సింగ్ పేర్కొన్నారు.

శ్రీ సింగ్ ఇంకా యిలా అన్నారు

న్యాయస్థానాలకు మనం అత్యంత గౌరవం యివ్వవలసిందే అయితే ఒక అంశాన్ని వివరించేటప్పుడు భేదాభిప్రాయానికి తావులేదని అర్థం కాదు 194(3) నిబంధనలలో రాజ్యాంగ నిర్ణేతల అసలు అభిప్రాయాన్ని స్పష్టీకరించాలని మనం కోరుతున్నాం.

శ్రీ సింగ్ యింకా ఇలా అన్నారు.

"రాజ్యాంగం సమగ్రమయినది దానిలోనే అధికారాలకున్న అవధులు పరిమితులు పేర్కొనబడినాయి రాజ్యాంగంలో ఒకభాగానికి నష్టం జరిగినా మొత్తం యంత్రాంగం తలక్రిందులు అవుతోంది అందువల్లనే ప్రతి విభాగానికి ఉన్న అధికారాలు ఏమిటో స్పష్టంగా నిర్వచించబడినాయి

మన రాజ్యాంగ నిర్ణేతలకు అమెరికా పార్లమెంటు అధికారాలు తెలుసు, బ్రిటన్ పార్లమెంటు సంగతి తెలుసు తెలిసే బ్రిటిష్ పార్లమెంటరీ పద్ధతిని అనుసరించారు

అమెరికా పార్లమెంటుకున్న అధికారాలు మన శాసనసభలకు చాలునని వాదించబూనుకోవటం విచిత్రం ఎవరిపీ పక్షపాతం చూపవలసినదని కోరట లేదు

మన రాజ్యాంగ నిర్ణేతల అభిప్రాయం ఏమిటో మనకు స్పష్టంగా తెలుసు ఒకవేళ ఆ అభిప్రాయం 194 (3) నిబంధనలో లేదనుకుంటే ఆ లోటు పూడ్చాలి

సభాధిక్కరణ నేరానికి కోర్టు ప్రమేయం లేకుండా సాధారణ వారంటు జారీచేయటానికి పార్లమెంటుకుగానీ శాసనసభకుగానీ హక్కు లేదనీ సుప్రీంకోర్టు తీర్పుయిచ్చినా న్యాయమూర్తి శ్రీ ఎ. సర్కార్ తద్విరుద్ధమయిన అభిప్రాయాన్ని వెలిబుచ్చారు

సుప్రీంకోర్టు అభిప్రాయం పార్లమెంటుమూడు రోజులకు వాయిదా పడుతుండగా వచ్చింది అందువల్ల సమావేశంలో చర్చించడానికి వీలు కాలేదు అయినా మళ్ళీ తిరిగి సమావేశంలోగా అంశాలు చర్చించే ఒక అభిప్రాయానికి రావడానికి వీలున్నది.

ఏమయినా ఇంతవరకు నా అభిప్రాయాన్ని వెలిబుచ్చలేదు. శాసనసభ్యులు ప్రదర్శించిన నిగ్రహానికి అభినందించక తప్పదు.

న్యాయమూర్తులను అభిశంసించడానికి 211 నిబంధనక్రిందమన శాసనసభలకుహక్కువున్నా ఇంతవరకు ఒక్కసారి అయినా ఆ నిబంధనను వినియోగించకుండా శాసనసభ్యులు అపూర్వమైన నిగ్రహాన్ని చూపారు. ఈ విషయాన్నే సుప్రీంకోర్టు మైనారిటీ తీర్పులో పేర్కొంటూ శాసనసభ్యులు తమ అధికారాలను దుర్వినియోగం చేస్తారని అందుకు న్యాయస్థానం పర్యవేక్షణ అవసరమని వాదించటం పొరపాటని కూడా తెలిపింది.

ఇప్పటిదాకా శాసనసభ్యులు అనుసరించిన మార్గాన్ని ఇకముందు తప్పుతారని తానూ ఊహించలేనని అన్నారు

అల్జీరియాలో భూకంపాలు

16 మంది మరణం

అల్జీర్స్ జనవరి 10

ఇక్కడకు 200 కిలోమీటర్ల దూరంలో గల మిసిలావట్టణం గత రాత్రి భూకంపానికి గురైంది ఈ కారణంగా వచ్చిన చలిగాలులకు ఇద్దరు చిన్నపిల్లలు మృత్యువాతపడ్డారు ఈ దుర్వార్తను అల్జీర్స్ రేడియో నేడు ప్రకటించింది

జనవరి 1 2 తేదీలలో కూడా ఈ పట్టణం భూకంపాలకు గురైనది ఈ భూకంపాలమూలంగా మొత్తం ఇప్పటికి 16 మంది మరణించారని రేడియో వెల్లడించింది.

భూకంపాల ఫలితంగా ఇద్దరు మాత్రమే చనిపోయారు అయితే భూకంపాలవలనంతంగా, వాతావరణం పూర్తిగా చెడిపోయిన కారణంగా మిగతావారు అసువులు బాశారు.

ఈ వాతావరణంవల్ల ఇబ్బందిపడిన 16 వేల మంది "బ్రాంకైటిస్" వ్యాధితో బాధపడుతున్నట్లు అల్జీరియా పత్రికా విలేకరి ఒకరు తెల్పారు.

నెల్లూరు పట్టణంలో బియ్యం కొరత

నెల్లూరు, జనవరి 10

నెల్లూరు సెంట్రల్ సహకార వినిమయదారుల స్టోర్సు మార్కెటింగ్ సొసైటీలు పట్టణంలోని చిల్లర దుకాణాలకు తగిన మోతాదులో బియ్యాన్ని సరఫరాచేయలేక పోవటంతో నెల్లూరు పట్టణ ప్రజలు బియ్యం దొరకక నానా ఇబ్బందులు పడుతున్నారు

మిల్లర్లవద్ద బియ్యంలేని కారణంగా ప్రభుత్వం ఈ బియ్యం సరఫరాను ఆపివేయటం జరిగిందని కొందరంటున్నారు

కిలో 87 పైసలకు అమ్మటానికి గాను ప్రభుత్వం లెక్కక్రింద 100 టన్నుల బియ్యం ఇక్కడకు వచ్చాయని అయితే అవి ఇంతవరకు చిల్లర దుకాణాలకు అందలేదని తెలుస్తున్నది.

చిల్లర దుకాణాలను మూసివేయవలదని మొలకొలుకులు బియ్యం వచ్చేంతవరకు రానున్న మూడువారాల్లో ప్రతిరోజూ బియ్యం సరఫరా చేస్తామని రెవిన్యూ డివిజనల్ ఆఫీసరు శ్రీ డి జగదీశన్ అన్నారు

ధాన్య సేకరణ నిబంధనలద్వారా బియ్యపు మిల్లులను స్వాధీనం చేసుకునేందుకు వెంటనే చర్యలు గైకొనాలని గురువారం ఇక్కడకు వచ్చిన రాష్ట్ర ప్రణాళికా శాఖ మంత్రి శ్రీ చెన్నారెడ్డికి విజ్ఞప్తి చేయబడింది

మిల్లర్ల వద్ద నెల్లూరు కొవ్వూరు తాలూకాలలోని ధాన్య వ్యాపారులవద్ద కావలసినంత ధాన్యం నిలవలున్నాయని కలెక్టరుకు మంత్రికి శ్రీ ఆనం వెంకటరెడ్డి వివరించారు నెల్లూరు జిల్లాలో 90 వేల టన్నుల ధాన్యాన్ని సేకరించాలనే లక్ష్యంగా పెట్టుకోవడం జరిగింది. ఇంతవరకు కొత్త మొలకొలుకుల వడ్లకు బియ్యానికి ప్రభుత్వం ధరలు నిర్ణయించలేదు ధరలు పెరుగుతాయనే వాతావరణం కన్పడుతూన్న ఈ పరిస్థితుల్లో కంట్రోల్ ధరలకు ఉత్పత్తిదారులనుండి ధాన్యాన్ని కొనుగోలు చేయటం సాధ్యంకాదని అంటున్నట్లు తెలుస్తున్నది

కొత్త మొలకొలుకుల పుట్టి రు 420 లు ధరగా పేర్కొనబడింది ఈ ధర పాతపంట చట్టబద్ధ ధరకనా 16 రూపాయలు హెచ్చుగా వుంటుంది అయితే పాతపంట పుట్టి ధరలో 55 రూపాయల వరకు పెరుగుదల కన్పడుతున్నది.

కార్వార్‌లో ఆహార విషమ పరిస్థితి

కార్వార్ జనవరి 11

ఇక్కడి ఆహార ధాన్యాలు ప్రజలకు సత్వరంగా దొరకక విషమ పరిస్థితి ఏర్పడిందని వెంటనే దీనిని చక్కబరచటానికి తగిన చర్యలు తీసుకోవాలని కార్వార్ పురపాలక సంఘం నిన్న ఇక్కడ సమావేశమై రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది

ఈ సందర్భంలో చేసిన ఒక తీర్మానంలో ప్రభుత్వం ధరలు నిర్ణయించిన తరవాత ఆహార ధాన్యాలు ప్రజలకు అందక పోవటం వల్ల ఏర్పడిన విషమపరిస్థితిపై తమఆందోళన వెలిబుచ్చారు ప్రజలకు కావలసిన బియ్యాన్ని సేకరించటంలో జిల్లా అధికారులు విఫలులయారని ఏప తమ తీర్మానంలో పేర్కొన్నారు

పాక్ బియ్యం దిగుమతికి సంప్రతింపులు

కరాచీ జనవరి 10

వస్తువుమార్పిడి ప్రాతిపదికపై పాకిస్తాన్ బియ్యాన్ని కొనే విషయమై భారత అధికారులు నిన్న రావల్పిండిలో సంభాషణలు ప్రారంభించారు.

భారత ప్రతినిధివర్గానికి ఆర్థికశాఖ సహాయ కార్యదర్శి శ్రీ వై. టి. షా నాయకత్వం వహిస్తున్నారు,

ఈ సంభాషణలు తిరిగి రేపుకూడా జరుగుతాయి.

కరాచీలో కర్ఫ్యూ కొంత సడలింపు

ఇంకా నగరంలో ఉద్రిక్త వాతావరణం

కరాచీ, జనవరి 10

ఇటీవల తీవ్ర ఘర్షణలు, అల్లర్లు జరిగిన కరాచీలో విధించిన కర్ఫ్యూ ఉత్తర్వులను రేపటి నుంచి కొంత సడలించడానికి ప్రభుత్వం నిర్ణయించింది

రేపటి నుండి ప్రతిరోజూ అర్ధరాత్రి 12 గంటలనుండి ఉదయం 6 గంటలవరకు ఉంటుంది.

నగరంలో ప్రశాంత పరిస్థితులు నెలకొన్నాయని అధికారులు చెబుతున్నా ఇంకా పలు కేంద్రాలలో ఉద్రిక్తత సడలలేదు.

గతరాత్రికూడా పి ఐ బి కాలనీలో ఉండే ప్రజలు ప్రాణాలు అరచేత పెట్టుకునే ఉన్నారు

పశ్చిమ పాకిస్తాన్ గవర్నర్ నియమించిన విచారణకమిటీ మొదటి సమావేశం జనవరి 13 వ తేదీన జరుగుతుంది.

ముస్లింలను ముస్లింలు చంపుకోవడాన్ని కరాచీ మున్సిపల్ కార్పొరేషన్ నేడు ఖండించింది. ఈ ఘర్షణలలో నష్టపడిన కుటుంబాల సహాయార్థం రూ 5 లక్షలు కేటాయించింది

సంస్కృత ఎంట్రెన్సు సప్లిమెంటరీ ఫలితాలు

వాల్తేరు, జనవరి 10

1964 మే లో జరిగిన పరీక్షలలో ఈ క్రింది వారు ఉత్తీర్ణులయ్యారు

సాహిత్యవిద్యాప్రవీణ ఎంట్రెన్సుపరీక్ష

4 5, 16 30

అమెరికాతో రక్షణసంధి చేసుకోవాలని మసానీ 'సలహా'

మద్రాసు జనవరి, 10

జపాన్ భారత్ లాంటి ఆసియా దేశాలను భయ పెట్టడానికే చైనా అణుబాంబు తయారు చేసిందని అందువల్ల ఇప్పుడు భారత్ దేశం అమెరికాలాంటి "ప్రజా స్వామిక" దేశంతో రక్షణ ఒడంబడిక చేసుకోవటం మంచిదని స్వతంత్ర పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీ యమ్ ఆర్ మసానీ సలహా యిచ్చారు

అమెరికాతో రక్షణ సంధి" మినహా మరే యితర రక్షణ విధానమయిన మన ప్రజల నాశనాన్ని కొనితెచ్చుకోవటమేనని ఆయన అన్నారు.

స్నేహదేశాలనుండి సాధారణ ఆయుధాలను పొందడానికి తటస్థ విదేశాంగ విధానం అడ్డురాకపోతే దేశరక్షణకు అణు ఆయుధం సహాయాన్ని పొందటంలో తప్పులేదని అన్నారు

మోయడానికి యిష్టపడుతున్న దేశాల మీద మన రక్షణ ఖర్చును పెడితే బడ్జెట్‌ను సగానికి సగం తగ్గించుకోవచ్చునని మసానీ చెప్పారు

దేశ యిప్పటి పరిస్థితుల నుండి బయటపడడానికి ప్రస్తుతం ఉన్న పన్నులను 50శాతం తగ్గించాలని సూచించారు.

ప్రణాళికలకు రెండు సంవత్సరాలు "సెలవుయిచ్చి" రక్షణ ఖర్చును తగ్గించుకుంటే పన్నులు తగ్గించటం సాధ్యమని అన్నారు

మన రూపాయి రూపాయిగా వుండాలంటే మండలాలమధ్య ఆంక్షలు ఎత్తివేయాలనీ కంట్రోళ్ళు రద్దుచేయాలనీ సూచించారు.

కంట్రోళ్ళవల్ల అవినీతి వ్యాప్తి అయిందని ఆయన అన్నారు.

టోక్యో జనవరి 10

జపాన్‌లో ఒక అగ్నిప్రమాదంలో 9 మంది మరణించినట్లు జాతీయ పోలీసు సంస్థ నేడిక్కడ వెల్లడించింది.

ఈ అగ్నిప్రమాదంలో 30 ఇళ్ళు బూడిదపాలయ్యాయని తీవ్ర వేగంతో గాలులు వీస్తున్న ఫలితంగా అగ్నిమాపక దళాలు నిస్సహాయమైనాయని పోలీసు సంస్థ ప్రకటించింది

హోంమంత్రి ఇంటర్వ్యూకై శ్రీ భంజ్ దేవ్ నిరసనదీక్ష

న్యూఢిల్లీ జనవరి 10

తనకు రావలసిన పింఛను గురించి మాట్లాడేందుకు ప్రధాని శాస్త్రి హోం మంత్రి శ్రీ నందాగార్లతో భేటీ కావాలనే కోరికమీద తాము జనవరి 12 నుంచి నిరశనవ్రతం చేయదలచామని బస్తర్ మాజీ సంస్థానాధీశుడు శ్రీ ప్రవీరచంద్ర భంజదేవ్ నేడిక్కడ ప్రకటించారు

తమ కిస్తూ వచ్చిన రాజకీయ పింఛనును మధ్యప్రదేశ్ ప్రభుత్వం ఏడాదిక్రితం నిలుపు చేసిందనీ అప్పటినుంచి తాము హోం శాఖ మంత్రిని కలుసుకొనడానికి చేసిన ప్రయత్నాలు ఫలించలేదనీ ఆయన అన్నారు

"నా విషయం చెప్పుకొనేటందుకు అవకాశం ఇవ్వకపోవడం చేత నిరాశతో ఈ పనికి పూనుకొంటున్నాను నాకు ఇంటర్వ్యూ ఇచ్చే వరకూ ఈ దీక్ష వదలను, అని శ్రీ భంజ్ దేవ్ అన్నారు.

నెహ్రూ సమాధివద్ద తాము శాంతి వనంలో నిరశన వ్రతం సాగించేటందుకు అనుమతి కోరుతూ హోంశాఖకు వ్రాశాననీ ఆయన అనుమతించకపోతే ఎక్కడ కూర్చొనియైనా వ్రతం ప్రారంభిస్తాననీ ఆయన అన్నారు

తనకు పింఛను నాపడంవలన చాలా ఇబ్బందులు కలుగుతున్నాయనీ పన్నులు కట్టటానికూడా తనకు శక్తి చాలడంలేదనీ ఆయన అన్నారు

రాష్ట్రప్రభుత్వం నాకూ నా తమ్ముడికీ మధ్య వైషమ్యాలు పెంచడానికి ప్రయత్నిస్తూంది దానివలన నా ప్రాంతంలోని ఆదివాసీ ప్రజలకు బాధలు కలుగుతాయని నాకెంతో ఆందోళనగావుంది"

తనను 1961 లో అధికార చ్యుతుణ్ణి చేసినప్పుడు అనాడు హోంమంత్రిగా వున్న శ్రీ శాస్త్రి నెలకు 2 వేల భృతి ఏర్పాటుచేశారనీ రాష్ట్రప్రభుత్వం చట్టవిరుద్ధంగా దానిని నిలుపు చేసిందనీ ఆయన అన్నారు

తన ఆస్తులమీద నెలకు వచ్చే 5 వేల రూపాయల కిస్తును తన తమ్ముడికి బదలాయిస్తున్న ఆదేశంమీద మధ్యప్రదేశ్ ప్రభుత్వం శ్రీ నందాచేత సంతకం పెట్టించిందనీ అది అన్యాయమనీ ఆయన అన్నారు

రైలు ప్రమాదంలో కాంగ్రెస్‌వాది మృతి

దుర్గాపూర్ జనవరి 10

దుర్గాపూర్‌నుండి కలకత్తాకు వెళుతున్న కాంగ్రెస్ కార్యకర్తల రైలుపెట్టె ఇక్కడికి సమీపంలోని పానగర్‌వద్ద ఒక మోటారు ట్రక్కును ఢీకొన్న ఫలితంగా ఒక కాంగ్రెసు కార్యకర్త అక్కడి కక్కడే మరణించారు మరో 5 గురు గాయపడ్డారు గాయపడినవారిని దుర్గాపూర్ ఆస్పత్రికి చేర్చారు

ఏజెంట్లు కావలెను

మా వాచీలు మొదలయిన వాటికి ఆర్డర్లు బుక్ చేయుటకు ఏజెంట్లు కావలెను వాచీ 18 రు 20/- లు కమిషన్ ఉచిత క్యాటలాగు మరియు వి పి పి షరతులకొరకు వ్రాయండి.

VENICE WATCH SERVICE
Post Box 3623 Girgaum Bombay 4

మార్కాపురం మునిసిపాలిటీ

కావలయును

కర్నూలు జిల్లా మార్కాపురం మునిసిపాలిటీలో తాత్కాలికముగా ఒక సంవత్సరము పాటు బిల్డింగు అండ్ యన్‌క్రోచ్‌మెంటు ఇన్‌స్పెక్టరు గా పని చేయుటకు యోగ్యతగలవారి వద్దనుండి ఈ క్రింద సంతకము చేసినవారికి 18-1-65 తేదీలోగా చేరులాగున దరఖాస్తులు కోరబడుచున్నవి

విద్యార్హతలు: ఎస్ ఎస్ ఎల్ సి. లేదా దానికి సమానమైన పరీక్షయున్ను, నిర్ణయించిన టెక్నికల్ పరీక్షలున్ను ప్యాసయి యుండవలెను.

జీతము: రూ 100-4-120-5-185 మరియు అమలులో యున్న అలవెన్సులు.

ఉద్యోగము ప్రస్తుతం తాత్కాలికమైనను ఖాయమగుటకు అవకాశమున్నది.

(సం) పి బాలకృష్ణారావు.
కమీషనర్ మరియు స్పెషల్ ఆఫీసర్,
మార్కాపురం, ది 8-1-65

విజ్ఞులైన తల్లిదండ్రులు కుటుంబ నియంత్రణకై కొన్‌టాబ్ గర్భనిరోధక నురుగు మాత్రలనే వాడుతారు
వాడకం అతి తేలిక నమ్మకమైనవి చౌకను చౌక
ఇండియా ప్రభుత్వం అధికారపూర్వకంగా అనుమతించినవి
వాడక విధానం వివరంగా పెట్టెలోపలి కాగితంలో పేర్కొనబడింది
స్మిత్, స్టానిస్ట్రీట్ & కం., లిమిటెడ్
హైదరాబాద్ • విజయవాడ

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము

పబ్లిక్‌వర్క్సు (ప్రాజెక్టు) డిపార్టుమెంటు

టెండరు నోటీసు నెం. 15/64-65

ఈ దిగువ నుదహరించిన పనులకుగాను సీలువేసిన టెండర్లు శ్రీ నాగార్జున సాగర్ కెనాల్సు సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీరువారిచే గుంటూరులో వారి ఆఫీసునందు ది 12-2-65 సాయంత్రము 4 గంటలవరకు తీసుకొనబడును

పని పేరు	ధరావతు సొమ్ము	కాలపరిమితి	టెండరు షెడ్యూల్సుఖరీదు సేల్సు టాక్సుతో సహా
1 నాగార్జునసాగర్ కుడికాల్వ మైలు 54/1 నుండి మైలు 54/4 వరకు త్రవ్వకము పని	7 600	15 మాసములు	14 28
2 డిటో మైలు 54/7 నుండి మైలు 55/0 వరకు	2 900	9 మాసములు	10 20
3. డిటో మైలు 55/0 నుండి మైలు 55/5-330 వరకు	7 900	15 మాసములు	19 33
4 డిటో మైలు 56/0 నుండి మైలు 56/3 వరకు	4,100	9 మాసములు	14 28
5 డిటో మైలు 56/4 నుండి మైలు 57/0 వరకు	2 800	9 మాసములు	16 32

(2) టెండరు ఫారములు ఒక్కొక్కపనికి సేల్సుటాక్సుతోసహా పై నుదహరించిన రేట్ల ప్రకారము సొమ్ము చెల్లించి సూపరింటెండింగ్ ఇంజనీరువారి ఆఫీసునుండి 5-2-65 తేదీ తరువాత పొందవచ్చును

(3) టెండరు ఫారములకు దరఖాస్తులు 2-2-65 తేదీలోపుగా పంపవలయును.

(4) కంట్రాక్టు ఫారము — లమ్‌సమ్ (L S)

(5) టెండరు ఫారముల ఖరీదు శ్రీ పే అండ్ అకౌంట్సు ఆఫీసరు నాగార్జునసాగర్ ప్రాజెక్టు మాచర్లవారి పేర స్టేటు బ్యాంకు ఆఫ్ ఇండియాలోగాని స్టేట్ బ్యాంకు ఆఫ్ హైదరాబాదులోగానిచెల్లించి సదరు డిమాండుడ్రాఫ్టు టెండరు ఫారములకొరకు దరఖాస్తులతో పంపవలయును

గమనిక :- శ్రీ నాగార్జునసాగర్ కెనాల్సు చీఫ్ ఇంజనీరువారివద్దరూ 50,000/- లు లమ్‌సమ్ డిపాజిట్‌చేసి నిర్ణీతమైన బాండు వ్రాసినవారు పై నుదహరించిన ధరావతులో 2/5 వ వంతు మాత్రము చెల్లించవచ్చును.

(సం) కె. నాగేశ్వర రావు,
నాగార్జునసాగర్ కెనాల్సు సర్కిల్,
గుంటూరు 4, 6-1 65.

రాబిన్ హుడ్
ప్రపంచమంతటా మన్నన పొందినది
అదనపు సౌకర్యానికై పిట్ క్యాప్ సీటు వేసుకోండి
SEN-RALEIGH
సెన్-రాలె లిడ్.



అది శ్రేష్ఠతలో అంతులేనిది...

[illegible] తరహావ్యములను ఆధునిక సిగరెట్టు తయారీలో వినియోగపరచెదరు.

ఈ అంతులేని చార్‌మినార్ సిగరెట్ ఆగ్నేయాసియాలో పెద్దదైన సిగరెట్ ఫ్యాక్టరీలో ఆటామేటిక్ యంత్రముచే తయారు చేయబడినది. యంత్రము విద్యుచ్ఛక్తిపూర్వకముగా సిగరెట్లను సరియైన [illegible] కొలిచి తేలియును. తదుపరి [illegible] తయారు కాబడిన పెట్టెలో నింపబడి మీకరకు చేరుటకు తయారై వుండును. సుమారు [illegible] కోట్ల చార్‌మినార్ సిగరెట్లను ఈ నెలలో కాల్చెదరు. అదేవిధంగా వచ్చే నెలలోను—అటుతర్వాత వచ్చే నెలలోను

చార్‌మినార్ యొక్క పేరు ప్రఖ్యాతులు దానియొక్క అధిక మోతాదు అద్వితీయమైన రుచికలిగి [illegible] అంటే సాంప్రదాయిక రహస్యములతో పండించబడిన పొగాకువలన వరుసు పెట్టుబడిలో మిశ్రమం చేయుటవలన మరియు ప్రత్యేక విధానము వలన కలుగుచున్నది.

ఇందులో వుపయోగించే పొగాకును ప్రత్యేక చార్‌మినార్ కొరకే పెంపొందించెదరు. తరతరాలుగా అత్యమైన నేర్పుతో వాటిని మిశ్రమం చేసి ప్రత్యేకముగా చార్‌మినార్ కొరకై నియమితమైన అదనపు విధానమునకు జరిపించెదరు. అటుపిమ్మట ఆ పొగాకు సిగరెట్లు తయారుచేసే యంత్రములకు పోవును. వజీరు సుల్తాను టుబాకో కంపెనీవారు ప్రాచీన నైపుణ్యమును ఆధునిక సాంకేతిక విజ్ఞానముతో మిళితం చేయుటలోను చార్‌మినార్ శ్రేష్ఠతలో అంతులేనిదని విశ్వసించుటలోను కృతకృత్యులైనారు

సాటిలేని మేటి చార్‌మినార్ —
భారతదేశమందలి గొప్ప సిగరెట్

ది వజీరు సుల్తాను టుబాకో కంపెనీ లిమిటెడ్,
భారతదేశమందు ఘనత వహించిన సిగరెట్ నిర్మాతలు

GAS/VS i TBL

సంపాదకవర్గం: కాట్రగడ్డ రాజగోపాలరావు (అధ్యక్షులు) ఏటుకూరు బలరామమూర్తి, తమ్మల వెంకటరామయ్య, విశాలాంధ్ర విజ్ఞానసమితితరఫున ఎడిటర్, ప్రింటర్, అండ్ పబ్లిషర్ కాట్రగడ్డ రాజగోపాలరావు. స్వతంత్ర ఆర్ట్ ప్రింటర్స్ విజయవాడ-4